బుధవారం
22-03-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 269
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అమెరికా ఆర్థిక సంస్థ డిప్యూటీ చీఫ్‌గా నిషా దేశాయ్

అమెరికా ఆర్థిక సంస్థ డిప్యూటీ చీఫ్‌గా భారత సంతతికి చెందిన నిషా దేశాయ్ బిస్వాల్‌ను ఆ దేశాధ్యక్షుడు జో బిడెన్ నామినేట్ చేశారు. ఈ మేరకు వైట్ హౌస్ ఓ ప్రకటన విడుదల చేసింది.

2లో



ప్రత్యేక హోదాపై మళ్లీ పాతపాటే

ముగిసిన అధ్యాయమేనంటూ తేల్చిచెప్పిన కేంద్రం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీకి ప్రత్యేక హోదాపై కేంద్రం మళ్లీ పాత పాటే పాడింది. పార్లమెంటు సాక్షిగా చేసిన వాగ్దానాన్ని నిస్సిగ్గుగా అది ఇవ్వలేమని తెగేసి చెప్పింది. ఏపీకి ప్రత్యేక హోదా కేటాయింపుపై వైసీపీ పార్లమెంటు సభ్యులు లావు కృష్ణదేవరాయలు, వల్లభనేని బాలశౌరి లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ సమాధానం ఇచ్చారు. ఏపీకి ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమేనంటూ స్పష్టం చేశారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు గతంలో దీనిపై నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రాల ఆర్థిక లోటు భర్తీకి 14వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించిందని ఆయన వివరించారు. దీనివల్ల ప్రత్యేక హోదా రాష్ట్రాలకు, లేని ఇతర రాష్ట్రాలకు మధ్య తేడా లేకుండా పోయిందన్నారు. అందుకే ప్రత్యేక హోదా బదులుగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించామన్నారు. 2015 నుంచి 2018 వరకు ఈఏపీ పథకాలకు తీసుకున్న రుణాలపై వడ్డీని కూడా చెల్లించినట్లు తెలిపారు. మొత్తం ఈ ప్యాకేజీ కింద రూ.15.81 కోట్ల నిధులు విడుదల చేసినట్లు మంత్రి నిత్యానందరాయ్ వెల్లడించారు.

మొక్కుబడిగా ప్రశ్నిస్తున్న వైసీపీ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలను ఎక్కువ మందిని గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తామని 2019 ఎన్నికల్లో ప్రజలకు వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, గత నాలుగు సంవత్సరాలుగా ఆ అంశాన్ని ఏమాత్రం సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రధాని నరేంద్ర మోదీని

- మిగతా 2 లో

జగన్నాటకం

- రాజధాని భూములపై మళ్లీ కిరికిరి
- ఆర్-5 జోన్ ఏర్పాటు చేస్తూ గెజిట్ జారీ
- కోర్టు అక్షింతలు వేసినా మారని సర్కారు తీరు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అమరావతి రాజధాని నిర్మాణాలను అర్థాంతరంగా నిలిపివేసి విధ్వంసానికి పాల్పడిన జగన్ ప్రభుత్వం... రైతులిచ్చిన భూములను వినియోగించుకోవాలని శతవిధాలా ప్రయత్నాలు చేస్తోంది. నిరుపేదలకు ఇళ్లస్థలాల పేరుతో ఇక్కడి భూములను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సామాన్య ప్రజానీకానికి కేటాయించాలని చూస్తోంది. అందులో భాగంగా అమరావతిలో ఆర్-5 జోన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మళ్లీ గెజిట్ జారీ చేసింది. దీంతో అమరావతి రైతుల్లో మరోసారి అలజడి మొదలైంది. రైతుల అభిప్రాయాన్ని పట్టించుకోకుండా రాజధానిలో ఆర్-5 జోన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గెజిట్ జారీ చేయడంపై విపక్షాలు సైతం మండిపడుతున్నాయి.

మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు, తుళ్లూరు మండలంలోని మందడం, ఐనవోలు గ్రామాల పరిధిలో దాదాపు 900 ఎకరాలను ఆర్-5 జోన్ పరిధిలోకి ప్రభుత్వం తీసుకొచ్చింది. ఆర్-5 జోన్ ఏర్పాటుపై 2022 అక్టోబరులోనే ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ప్రభుత్వ నిర్ణయం సరికాదని పేర్కొంటూ జీవోను వ్యతిరేకిస్తూ అప్పట్లో రాజధాని రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కనీసం రైతుల అభిప్రాయాలు తీసుకోలేదని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు ఆదేశాలతో అధికారులు రాజధాని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని మూకుమ్మడిగా రాజధాని రైతులు వ్యతిరేకించారు. అయినా రైతుల అభిప్రాయాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వం ఆర్-5 జోన్ ఏర్పాటుపై గెజిట్ విడుదల చేసింది. పేదవర్గాల ఇళ్ల కోసం భూములు కేటాయిస్తున్నట్టు గెజిట్‌లో పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయాన్ని మరోసారి కోర్టులో సవాలు చేసేందుకు రాజధాని రైతులు సిద్ధమవుతున్నారు.

ఏమిటీ ఆర్-5 జోన్?

రాజధాని బృహత్ ప్రణాళిక ప్రకారం ఇప్పటి వరకు 4 నివాస జోన్లు ఉన్నాయి. మాస్టర్ ప్లాన్ ప్రకారం రాజధానిలో ఇంతవరకు ఆర్-1 (ప్రస్తుత గ్రామాలు), ఆర్-2 (తక్కువ సాంద్రత గృహాలు), ఆర్-3 (తక్కువ నుంచి మధ్యస్థాయి సాంద్రత కలిగిన గృహాలు), ఆర్-4 (హైడెన్సిటీ జోన్) పేర్లతో 4 రకాల నివాస జోన్లు ఉండేవి.

అయితే, రాజధానిలోని కృష్ణాయపాలెం, వెంకటపాలెం, నిడమర్రు, కురగల్లు, మందడం, ఐనవోలు గ్రామాల పరిధిలో 967.25 ఎకరాలను నివాస ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. అందులోని 900.97 ఎకరాలను ఆర్-5 జోన్‌గా ఏర్పాటు చేస్తూ గెజిట్ జారీ చేసింది.

గమనిక

రెండు పేజీల ఉగాది ప్రత్యేక సంచికను
EPAPER.VISALAANDHRA.COM
ఈ - పేపర్‌లో వీక్షించగలరు.

ప్రజాస్వామ్యానికి పాతర

- ఐక్యపోరాటాలు అవశ్యం
- ఉద్యమాలపై పోలీసుల ఉక్కుపాదం
- 24, 25న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్‌లో చర్చిస్తాం
- ఎమ్మెల్సీ ఫలితాలతో జగన్ పతనం ప్రారంభం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజాస్వామ్య సూత్రాల్ని కాలరాస్తూ పోలీసు రాజ్యాన్ని నడుపుతున్న జగన్ ప్రభుత్వ విధానాలపై వామపక్ష, ఇతర ప్రతిపక్ష పార్టీలు, ప్రజాతంత్ర, లౌకికవాదులు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విజయవాడ దాసరిభవన్‌లో మంగళవారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసుతో కలిసి రామకృష్ణ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల ఆందోళనలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, పోలీసు దౌర్జన్యాలు, బెదిరింపులు, అక్రమ నిర్బంధాలు ఎక్కువయ్యాయని ధ్వజమెత్తారు. సమస్యల పరిష్కారం కోసం విజయవాడ ధర్నాకు తరలివచ్చిన అంగన్‌వాడీలను ఎక్కడికక్కడే అక్రమంగా పోలీసుస్టేషన్లు, రైల్వేస్టేషన్లలో నిర్బంధించారని విమర్శించారు. అనారోగ్యానికి గురైన అంగన్‌వాడీల పట్ల కనీస కనికరం చూపకుండా పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. విజయవాడ ధర్నాచౌక్‌లో అనుమతిచ్చి ఉంటే అంగన్‌వాడీలు శాంతియుతంగా నిరసన తెలిపేవారని, ఏలూరు రోడ్డులో ధర్నాకు దిగాల్సిన పరిస్థితి వచ్చేదికాదని స్పష్టంచేశారు. ఆందోళనలు, ఉద్యమాలకు

- మిగతా 2 లో

జేపీసీనే మేము కోరేది

పార్లమెంట్ మొదటి అంతస్తులో భారీ బ్యానర్

విపక్షాల ఆందోళన

న్యూఢిల్లీ : అదానీ అంశంలో ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించాలని ప్రతిపక్ష పార్టీలు పట్టుపట్టాయి. ఇదే డిమాండ్‌తో మంగళవారం పార్లమెంటు భవనం మొదటి అంతస్తులో ఆందోళన చేపట్టాయి. అదానీ వ్యవహారంలో జేపీసీనే మేము కోరేది అంటూ పెద్దపెట్టున సభ్యులు నినాదాలు చేశారు. పార్లమెంటు మొదటి అంతస్తు నుంచి కింది వరకు పెద్ద బ్యానర్‌నూ ఏర్పాటు చేశారు. టీఎంసీ ఎంపీలు పార్లమెంటు కాంపెక్స్‌లో విడిగా ఆందోళన నిర్వహించారు. అదానీ వ్యవహారంలో ప్రధాని మోదీ మౌనం వీడాలని డిమాండ్ చేశారు. వ్యాపారవేత్త గౌతం అదానీకి మోదీ ప్రభుత్వం మద్దతిస్తోందని, అందుకే జేపీసీకి ఆదేశాలు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ అదానీని వెంటనే అరెస్టు చేయాలని టీఎంసీ

- మిగతా 2 లో

నొప్పి లేకుండా మరణశిక్ష

- ఉరి శిక్షకు ప్రత్యామ్నాయాలు చూడాలి
- కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : ఉరిశిక్ష అమలుపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నొప్పి కలగకుండా మరణం సంభవించే ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని కేంద్రాన్ని ఆదేశించింది. గౌరవకర మరణం చాలా ముఖ్యమైన అంశమని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. ఉరి శిక్షకు బదులు ప్రత్యామ్నాయ మార్గాలపై కమిటీని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. కొన్ని కేసుల్లో కోర్టులు మరణశిక్ష విధిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇవాళ ఆ అంశంపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. మెడకు ఉరి వేసి చంపడం కన్నా.. నొప్పి లేనటువంటి ఇతర పద్ధతుల్లో ప్రాణాలు తీసే వీలు ఉందా అని ఇవాళ సుప్రీంకోర్టు ప్రశ్నించింది. మెడకు ఉరి వేసి శిక్షించడం కన్నా.. తక్కువ స్థాయిలో నొప్పితో చనిపోయే పద్ధతులగురించి సమాచారాన్ని సేకరించి, ఆ అంశాన్ని చర్చించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరింది. ఉరిశిక్ష ప్రభావం గురించి స్టడీ చేసి రిపోర్టు ఇవ్వాలని అటార్నీ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అధికారంలో ఉన్నవారికి రాజపూజ్యం బాగుందనే చెబుతాం,మీరు నమ్మాలంతే!.

పింఛన్ సంస్కరణలపై

ఫ్రాన్స్ పార్లమెంటులో అవిశ్వాస తీర్మానాలు

- తృటిలో తప్పించుకొన్న ప్రభుత్వం
- నేటి మాక్రాన్ ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి

పారిస్: వివాదాస్పద పింఛన్ సంస్కరణలపై ఫ్రాన్స్ అట్టుడికిపోతోంది.అటు పార్లమెంటులోనూ ఈ అంశం ప్రకంపనలు సృష్టించింది. రెండు అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టగా స్వల్ప మెజారిటీతో తమ అధికారాన్ని మాక్రాన్ ప్రభుత్వం కాపాడుకోగలిగింది.దేశవ్యాప్తంగా ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ఇదే క్రమంలో అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ బుధవారం జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. పింఛన్ సంస్కరణలపై ఆయన ఏం మాట్లాడతారన్నది సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తోంది. పార్లమెంటులో అవిశ్వాస తీర్మానాల నుంచి తృటిలో తప్పించుకొని ప్రభుత్వం నిలద్రొక్కుకోగలిగిన క్రమంలో అధ్యక్షుడి ప్రసంగానికి ప్రాధాన్యత ఏర్పడింది. సోమవారం సాయంత్రం పింఛన్ సంస్కరణలపై జరిగిన ఆందోళనలలో 200 మందికిపైగా అరెస్టు అయినట్లు పోలీసులు తెలిపారు. పార్లమెంటులో మాక్రాన్ ప్రభుత్వం నెగ్గిన గంటల వ్యవధిలో ఆకస్మిక ఆందోళనలు పెద్దఎత్తున జరిగాయి. ఓ దశలో ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య పారిస్‌లో ఘర్షణ జరిగింది. మాక్రాన్ ప్రభుత్వం విశ్వాస ఓటు ఓడిపోయివుంటే పదవీ విరమణ వయస్సును 62 నుంచి 64కు పెంచుతూ తెచ్చిన శాసనం కూడా రద్దు అయ్యేది.పింఛన్ సంస్కరణలకు విరుద్ధంగా పార్లమెంటులో అవిశ్వాస తీర్మానానికి కేవలం తొమ్మిది ఓట్లు తగ్గాయి. 287 ఓట్లు వచ్చాయి. దీంతో మాక్రాన్ ప్రభుత్వం తుటిలో అధికారాన్ని నిలబెట్టుకోగలిగింది. నేషనల్ అసెంబ్లీ (పార్లమెంటు దిగువ సభ)లో పింఛన్ సంస్కరణలకు ఆమోదం లభించింది. పింఛన్ సంస్కరణలపై రెండు అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టారు. అటు పెట్రో డిపోల వద్ద సమ్మెల కారణంగా చమురు కొరత నెలకొంది. ఫలితంగా సముచిత నిల్వలు ఉండేలా చూడాలని మంగళవారం ప్రభుత్వం ఆదేశాలను జారీచేసింది.

అమెరికా ఆర్థికసంస్థ డిప్యూటీ చీఫ్‌గా నిషా దేశాయ్

నామినేట్ చేసిన అధ్యక్షుడు బైడెన్

వాషింగ్టన్: అమెరికా ఆర్థిక సంస్థ డిప్యూటీ చీఫ్‌గా భారత సంతతికి చెందిన నిషా దేశాయ్ బిస్వాల్‌ను ఆ దేశాధ్యక్షుడు జో బిడెన్ నామినేట్ చేశారు. ఈ మేరకు వైట్ హౌస్ ఓ ప్రకటన విడుదల చేసింది. 2013 నుంచి 2017 వరకు యుఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసిన బిస్వాల్, అమెరికా, భారత్ సంబంధాలను మెరుగు పరచడంలో ప్రధానపాత్ర పోషించారు. అమెరికా ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కమిషన్‌లో అత్యున్నత పరిపాలనా స్థానానికి నిషా దేశాయ్ బిస్వాల్‌ను అధ్యక్షుడు జో బైడెన్ నామినేట్ చేసినట్లు శ్వేతసౌధం సోమవారం ప్రకటించింది. ఒబామా హయాంలో దక్షిణ, మధ్యాసియా వ్యవహారాల శాఖ సహాయ కార్యదర్శిగా పనిచేసిన నిషాకు విదేశాంగ విధానం, అంతర్జాతీయ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలోనూ 30 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. ప్రస్తుతం అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ నేతృత్వ ఇంటర్నేషనల్ స్ట్రాటజీ, గ్లోబల్ ఇనీషియేటివ్స్ కార్యక్రమానికి సీనియర్ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. భారత్, బంగ్లాదేశ్‌లకు సంబంధించి అమెరికా వాణిజ్య మండళ్లకూ నేతృత్వం వహిస్తున్నారు. అమెరికా ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్‌లో ఆసియాకు అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేశారు. దక్షిణ, మధ్య -ఆగ్నేయాసియా ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియాలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నిషా ఆపై అంతర్జాతీయ సంబంధాలు, ఆర్థికశాస్త్రంలో మాస్టర్స్ చేశారు.

వెనిజులా మంత్రి ఐస్సామీ రాజీనామా

బొగటా, కొలంబియా: వెనిజులా చమురు శాఖ మంత్రి తారెక్ ఎల్ ఐస్సామీ తన పదవికి రాజీనామా చేశారు. ప్రభుత్వ చమురు కంపెనీ పెట్రోలియాస్ డి వెనిజులా (పీడీవీఎస్ఏ)లో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు రావడం, వాటిపై దర్యాప్తు ప్రారంభమైనందున తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఐస్సామీ ట్విట్టర్‌లో వెల్లడించారు. దర్యాప్తునకు పూర్తిగా మద్దతిస్తానని ట్వీట్‌లో పేర్కొన్నారు. అధ్యక్షుడు నికోలస్ మదురో అవినీతి వ్యతిరేక ప్రచారానికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే దర్యాప్తు సంస్థలు న్యాయవ్యవస్థ, ప్రభుత్వ విభాగాలకు చెందిన ఆరుగురు ఉన్నతాధికారులను అదుపులోకి తీసుకున్నారు. ఉపాధ్యక్షుడు, రెండు దశాబ్దాలుగా మంత్రిగా, మేయర్‌గా పనిచేసిన ఎల్ ఐస్సామీ స్థానంలో మరొకరిని నియమించడంపై మదురో ఏ ప్రకటన చేయలేదు. అవినీతికి పాల్పడిన అధికారులపై దర్యాప్తు, న్యాయపరమైన చర్యలు ఉంటాయని, అరెస్టు చేస్తామని అటార్నీ జనరల్ కార్యాలయం, ప్రభుత్వం ప్రకటించిన కొన్నిరోజులకు ఐస్సామీ తన రాజీనామాను ప్రకటించడం గమనార్హం. 2020 నుంచి చమురు మంత్రిగా ఎల్ ఐస్సామీ ఉన్నారు. అమెరికా ప్రభుత్వ వాంటెడ్ జాబితాలో ఈయన పేర ఉండగా, ఐస్సామీపై పది మిలియన్ డాలర్ల రివార్డు కూడా ఉంది. కాగా, ప్రపంచంలోనే అతిపెద్ద పెట్రోలియం నిల్వలున్న వెనిజులాలో అవినీతి అధికారులను అరెస్ట్ చేయడం ఇదే మొదటిసారి.

జేపీసీనే మేము కోరేది

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేసింది. ప్రతిపక్షాల ఉమ్మడి ధర్నాలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, డీఎంకే, ఆర్జేడీ, శివసేన (యూబీటీ), జేడీయూ, ఐయూఎంఎల్, ఆప్, ఎండీఎంకే సభ్యులు పాల్గొన్నారు. అదానీ వ్యవహారంలో దర్యాప్తునకు జేపీసీని ఏర్పాటు చేసేంత వరకు తమ పోరు కొనసాగుతుందని ప్రతిపక్ష ఎంపీలు తేల్చిచెప్పారు. అంతకుముందు విపక్ష నేత మల్లికార్జున ఖర్గే చాంబర్‌లో ఎంపీలు సమావేశమయ్యారు. పార్లమెంటులో అదానీ వ్యవహారం- రాహుల్ క్షమాపణల కోసం అధికార-విపక్షాల పోటాపోటీ డిమాండ్ క్రమంలో ఉభయ సభలలో వాయిదాల పర్వం కొనసాగింది. 'ఉదయం రాజ్యసభలో ఖర్గేకు మాట్లాడేందుకు చైర్మన్ అనుమతిచ్చారు. ఆయన లేచి నిలబడిన వెంటనే బీజేపీ ఎంపీలు నినాదాలు మొదలుపెట్టారు. దీంతో సభను చైర్మన్ వాయిదా వేశారు. మోదీ ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తే ప్రతిష్ఠంభనకు పరిష్కారం ఎలా సాధ్యం' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్విట్టర్‌లో (సభ వాయిదా పడిన తర్వాత) పేర్కొన్నారు. అమెరికా సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదికలో అదానీ సంస్థలపై చేసిన ఆరోపణల మీద నిజనిజాలు బహిర్గతం కావాలంటే ఒక్క జేపీసీతోనే సాధ్యమని ప్రతిపక్షాలు నొక్కిచెబుతున్నాయి. ఇదిలావుంటే టీఎంసీ ఎంపీలు పార్లమెంటు ఆవరణలో ఒంటరిగా ఆందోళన నిర్వహించి అదానీ అరెస్టుకు డిమాండ్ చేశారు. టీఎంసీ ఎపీ డెరెక్ ఓ బ్రెయిల్ మాట్లాడుతూ 'అదానీని అరెస్టు చేయాలి. రూ.లక్ష కోట్ల కుంభకోణంలో అదానీని రక్షించేందుకు మోదీ యత్నిస్తున్నారు. పార్లమెంటులో ఈ అంశంపై చర్చకు అనుమతి ఇవ్వకపోవడానికి ఇదే కారణం. ఈ వ్యవహారాన్ని సొంతంగా విచారించాలని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని బీజేపీయేతర పది రాష్ట్రాలకు టీఎంసీ సూచించింది' అని అన్నారు. అదానీ వద్దకు ఎల్ఐసీ-ఎస్‌బీఐ డబ్బు ఎలా వెళ్లింది... అదానీ ప్రజా ధానాన్ని ఎలా వినియోగించారన్నది సభలో మోదీ వివరణ ఇవ్వాలని టీఎంసీ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ డిమాండ్ చేశారు.

నొప్పి లేకుండా మరణశిక్ష

(మొదటిపేజీ తరువాయి)

జనరల్ ఆర్ వెంకటరమణిని సుప్రీం కోర్టు కోరింది. ఈ అంశంపై నిపుణుల కమిటీ వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సుప్రీం కోర్టు చెప్పింది. మరణశిక్ష పడ్డవాళ్లకు నొప్పి లేకుండా చావును ఇవ్వాలన్న అంశంపై దాఖలైన పిటిషన్ విచారణ నేపథ్యంలో కోర్టు ఈ అంశాన్ని పేర్కొన్నది. ఉరికి బదులుగా తుపాకీతో కాల్చడం, ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వడం, ఎలక్ట్రిక్ షాక్ లాంటి పద్ధతులను అమలు చేయాలంటూ పిటీషన్‌లో సూచించారు. మెడకు ఉరి వేసి చంపడం అనే చాలా క్రూరమైన పద్ధతి అని న్యాయ కమిషన్ న్యాయవాది రిషి మల్హోత్రా తెలిపారు. ఇది చాలా ఆలోచించాల్సిన అంశమే అని, కానీ దీనిపై శాస్త్రీయ సమాచారం అవసరమని, నొప్పుల గురించి అధ్యయనం చేసిన సమాచారం ఇవ్వాలని, త్వరలో కమిటీని ఏర్పాటు చేస్తామని సీజేఐ డీవై చంద్రచూడ్ తెలిపారు. ఈ కేసు విచారణను మే 2వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. కేసు విచారణ సమయంలో వివిధ రకాల మరణాల గురించి న్యాయమూర్తులు చర్చించారు. అమెరికాలో లీథల్ ఇంజెక్షన్ ఇచ్చి శిక్ష విధించే పద్ధతి అమలులో ఉన్నా... ఆ పద్ధతిలో కూడా నొప్పి ఉన్నట్లు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహ అభిప్రాయపడ్డారు. ఇంజెక్షన్ ద్వారా చంపడమూ నొప్పే అని, ఇక షూటింగ్ అంటే అదో మిలిటరీ గేమ్ అవుతుందని, ఇది మానవ హక్కులను ఉల్లంఘించినట్లే అని సీజేఐ చంద్రచూడ్ అన్నారు. ఒకవేళ ప్రాణాంతక ఇంజెక్షన్ విధానాన్ని ఆశ్రయిస్తే, అప్పుడు ఎటువంటి రసాయనం వాడాలన్న దానిపై పరిశోధన చేయాలని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. అయితే ఉరి తీయడాన్ని రాజ్యాంగ వ్యతిరేకంగా ప్రకటిస్తే, అప్పుడు ఇతర పద్ధతుల గురించి తెలుసుకోవలసి ఉంటుందని సీజేఐ చంద్రచూడ్ అన్నారు.

పది గంటలపాటు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి

మూడోసారి కవితను విచారించిన ఈడీ

న్యూఢిల్లీ: బీఆర్ఎస్ నేత కె.కవితను మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పది గంటల పాటు విచారించింది. వరుస ప్రశ్నలతో మహిళా నేతను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఉదయం 11.30 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు కవితను దర్యాప్తు అధికారులు ప్రశ్నించారు. కవిత విచారణ సమయంలో బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ ఈడీ కార్యాలయంలోకి వెళ్లారు. కవిత విజ్ఞప్తి మేరకు ఈడీ అధికారులు భరత్‌ను కార్యాలయానికి పిలిచారు. ఆథరైజేషన్ సంతకాల కోసం ఆయనను పిలిచినట్లు సమాచారం. తదుపరి విచారణలో అవసరమైతే కవితకు బదులుగా సోమ భరత్‌ని పంపించేందుకు, కొన్ని ముఖ్యమైన పత్రాలు అందజేసేందుకు భరత్‌కు అవకాశం కల్పించేందుకే ఆయనను పిలిచినట్లు తెలుస్తోంది. ఈడీ కార్యాలయానికి వెళ్లే ముందు కవిత తన పాత ఫోన్లను కవర్లలో తీసుకెళ్లారు. 10 ఫోన్లు వినియోగించినట్లు చార్జిషీట్‌లో ఈడీ పేర్కొన్న నేపథ్యంలో వాటిని ఈడీ విచారణకు అందజేశారు. ఈడీ విచారణకు పూర్తిగా సహకరిస్తున్నానని కవిత తెలిపారు. తన 10 ఫోన్లను ఐఎంఈఐ నంబర్లతో సహా జమ చేసినట్లు వెల్లడించారు. మహిళ స్వేచ్ఛకు భంగం కలిగించేలా తన ఫోన్లను కోరారని, వాటిని జమ చేస్తున్నానని ఈడీకి రాసిన లేఖలో కవిత పేర్కొన్నారు. దర్యాప్తునకు సంబంధించిన వాస్తవ విరుద్ధమైన అంశాలను మీడియాకు ఇస్తున్నారని ఆమె ఆరోపించారు.

రాజధానిపై వైసీపీ కొత్త ఎత్తుగడ!

- ఉక్కు కోసం గంటా చేసిన రాజీనామా ఆమోదానికి స్పీకర్ కసరత్తు
- తద్వారా విశాఖ ఉత్తర ఉప ఎన్నిక నిర్వహణకు వ్యూహం
- ఆ స్థానం గెలిచి సాధారణ ఎన్నికలకు వెళ్లే యోచన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖ రాజధాని విషయంలో వైసీపీ కొత్త ఎత్తుగడకు సిద్ధమయింది. ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికల్లో టీడీపీ గెలుపును జీర్ణించుకోలేని ఆ పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ప ఎన్నిక జరిగేలా చేయడం ద్వారా తమ సత్తా నిరూపించుకొనేందుకు సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. విశాఖ కేంద్రంగా రాజధానిని ఉత్తరాంధ్ర ప్రజలు తిరస్కరించారన్న విపక్షాల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ఈ ఉప ఎన్నిక ద్వారా తమ అనుకూల పరిస్థితులు నెలకొల్పుకోవాలని వైసీపీ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. రెండో ప్రాధాన్యత ఓట్లు బదిలీతో టీడీపీ విజయం సాధించింది. విశాఖ పరిపాలనా రాజధానిగా ప్రారంభిస్తామమంటూ వైసీపీ చెబుతున్న మాటలను ఉత్తరాంధ్ర ప్రజలు విశ్వసించటం లేదని విపక్షాలు ప్రచారం మొదలుపెట్టాయి. దీనిని వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. విశాఖ కేంద్రంగానే తమ సత్తా చాటాలని భావిస్తోంది. ఇందుకోసం కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని ఎన్నికల్లోనూ ఏకపక్షంగా విజయం సాధించింది. ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల్లోనూ టీడీపీకి అవకాశం ఇవ్వలేదు. తాజాగా జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ గెలుపొందింది. కానీ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాలు మూడు స్థానాల్లోనూ టీడీపీ గెలిచింది ఇప్పుడు ఈ విజయాన్ని టీడీపీ భారీగా ప్రచారం చేసుకుంటోంది. రాజధానుల అంశానికి ముడి పెడుతోంది. ఇవే ఫలితాలు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ పునరావృతం అవుతాయని చంద్రబాబు, పవన్, విపక్షాలు చెబుతున్నాయి. దీంతో విశాఖ కేంద్రంగా ప్రజల్లో తమపై ఉన్న ఆదరణను రాష్ట్ర ప్రజలకు నమూనాగా చూపించేందుకు, రాజధాని అంశంలో మద్దతు ఉందని చాటిచెప్పేందుకు విశాఖలోనే మరో ఉప ఎన్నిక ఎదుర్కోవాలని, దీనిపై ఒకటి రెండు రోజుల్లో కీలక నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని తెలుస్తోంది.

గంటా రాజీనామాకు ఆమోదం?

విశాఖతో పాటుగా రాయలసీమలోని రెండు పట్టభద్రుల స్థానాల్లో టీడీపీ విజయం సాధించింది. అయితే, విశాఖ ఇప్పుడు రాజకీయంగా కీలకంగా మారుతోంది. ఇప్పటికే టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విశాఖ ఉక్కు ఉద్యమానికి మద్దతుగా 2021, ఫిబ్రవరి 12న స్పీకర్ ఫార్మాట్‌లో తన రాజీనామా లేఖ అందించారు. ఈ లేఖపై స్పీకర్ ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. గంటా వైసీపీలో చేరతారనే ప్రచారం సాగినా, ఇప్పుడు విశాఖ టీడీపీలో కీలకంగా ఉన్నారు. తాజాగా గంటా రాజీనామాను ఆమోదించటం ద్వారా అక్కడ ఉప ఎన్నిక ఎదుర్కోవాలనేది వైసీపీ నాయకత్వ ఆలోచనగా తెలుస్తోంది. ఇదే సమయంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతీ ఎమ్మెల్యే ఓటు కీలకం కానుంది. గంటా రాజీనామా ఆమోదిస్తే అటు టీడీపీకి ఎమ్మెల్యే తగ్గటంతో పాటుగా విశాఖలో ఉప ఎన్నికలో గెలిచి, తమ వైపే సాధారణ ఓటర్లు ఉన్నారని నిరూపించుకోవాలనేది వైసీపీ అధినాయకత్వం వ్యూహంగా తెలుస్తోంది.

పొత్తులపై క్లారిటీ... కొత్త వ్యూహంతో

వైసీపీ నాయకత్వం ఉప ఎన్నికకు వెళ్లాలని నిర్ణయిస్తే అనూహ్య పరిణామాలు చోటు చేసుకొనే అవకాశం ఉంది. మరి కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ లోగా ఉప ఎన్నిక జరగాలంటే అసెంబ్లీ కార్యాలయం ఖాళీ నోటిఫై చేసిన తరువాత ఆరు నెలల్లోగా ఎన్నిక జరగాల్సి ఉంటుంది. ఎన్నికలు నిర్వహించినా మరి కొద్ది నెలల్లోనే సార్వత్రిక ఎన్నికలు జరగాల్సి ఉండటంతో ఎన్నికల సంఘం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్నిక అనివార్యమైతే కర్ణాటక రాష్ట్ర ఎన్నికలతో పాటుగా ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉంటుంది. ఇక ఈ ఎన్నిక ద్వారా టీడీపీ-జనసేన పొత్తు పైన స్పష్టత రానుంది. అదే సమయంలో విశాఖలో కచ్చితంగా గెలిచి తమ బలం చాటాలనేది వైసీపీ వ్యూహంగా కనిపిస్తోంది. అధికార వైసీపీలో చర్చ జరుగుతున్నట్లుగా గంటా రాజీనామాను ఆమోదిస్తారా ?, ఉప ఎన్నిక జరుగుతుందా? అనే విషయం త్వరలోనే తేలనున్నట్లు తెలుస్తోంది.

టెక్సాస్ హైస్కూల్‌లో కాల్పులు

ఓ విద్యార్థి మృతి-మరొకరికి గాయాలు

టెక్సాస్: టెక్సాస్‌లోని ఆర్లింగ్‌టన్‌లోని హైస్కూల్ వద్ద కాల్పుల్లో ఓ విద్యార్థి మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. సోమవారం ఉదయం 7.35 గంటలకు తరగతులు ప్రారంభమవుతాయని, కాల్పులు జరిగిన సమయంలో విద్యార్థులు ఎవరూ తరగతులకు రాలేదని పేర్కొంది. కాల్పులకు గురైన బాలుడిని అధికారులు, పాఠశాల సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విద్యార్థి పరిస్థితి విషమించడంతో మరణించాడు. ఈ కాల్పుల్లో మరో విద్యార్థికి గాయాలయ్యాయి. వాటి వల్ల ఆమెకు ప్రాణాపాయం ఏమీ లేదని వైద్యులు తెలిపారు. విద్యార్థులపై కాల్పులు జరిపిన నిందితుని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిపై హత్యానేరం మోపినట్లు చీఫ్ జోన్స్ అ న్నారు. కాల్పులు జరిపినది మైనర్ కావడంతో అతని వివరాలను అధికారులు వెల్లడించలేదు. నిందితుడిని ఆ ప్రాంతంలోని జువనైల్ డిటెన్షన్‌కు పంపినట్లు తెలిపారు.

విశ్వాస ఓటులో నెగ్గిన ప్రచండ

ఉపాధ్యక్షుడిగా యాదవ్ ప్రమాణం

ఖాట్మండు: నేపాల్ ప్రధాని పుష్పకమల్ దహల్ 'ప్రచండ' పార్లమెంటులో విశ్వాస ఓటు గెలుచుకున్నారు. దేశంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసిన మూడు నెలల్లో ఇది రెండో బల పరీక్ష కాగా 275 మంది సభ్యులున్న ప్రతినిధుల సభలో ప్రచండకు అనుకూలంగా 175 ఓట్లు వచ్చాయి. 89 వ్యతిరేక ఓట్లు రాగా ఒకరు ఓటింగ్‌లో పాల్గొనలేదు. మరోవైపు మాదేశీ నేత రామ్‌సహాయ ప్రసాద్ యాదవ్ ఉపాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడి కార్యాలయం శీతల్ నివాస్‌లో అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ సమక్షంలో 52 ఏళ్ల యాదవ్ దేశ మూడవ ఉపాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. కాగా నేపాలీ కాంగ్రెస్, సీపీఎన్-మావోయిస్ట్ సెంటర్, రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ, జనతా సమాజ్‌వాదీ పార్టీ నేపాల్, సీపీఎన్-యూనిఫైడ్ సోషలిస్ట్, లోకతాంత్రిక్ సమాజ్‌వాదీ పార్టీ నేపాల్, జనామత్ పార్టీ, నాగరిక్ ఉన్‌ముక్తి పార్టీ, రాష్ట్రీయ జనమోర్చా, ఆమ్ జనతా పార్టీ సభ్యులు ప్రచండకు అనుకూలంగా ఓటు వేశారు. రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ వ్యతిరేకంగా ఓటు వేయగా నేపాల్ వర్కర్స్, పీజెంట్స్ పార్టీ ఓటింగ్‌లో పాల్గొనలేదు.

థాయిలాండ్ పార్లమెంటు రద్దు- మేలో ఎన్నికలు

బ్యాంకాక్: థాయిలాండ్ పార్లమెంటును ప్రభుత్వ ఆదేశాలతో రద్దుచేశారు. దీంతో మేలో సార్వత్రిక ఎన్నికలు జరిపేందుకు రంగం సిద్ధమైంది. అంతేకాకుండా రాజకీయాల్లో సైనిక జోక్యాన్ని తగ్గించేందుకు ఇది దోహదమవుతుంది. ప్రతినిధుల సభ నాలుగేళ్ల పదవీ కాలం పూర్తి కావడానికి కొద్ది రోజులు ఉండగా పార్లమెంటును రద్దు చేయడం గమనార్హం. అయితే ఇందుకోసం ప్రధాని ప్రయుత్ ఛన్-ఓచా పూనుకున్నారు. మే 7 లేదా 14వ తేదీన ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నారు. అయితే ఎన్నికల తేదీని ఖరారు చేసి వచ్చే వారంలో ప్రకటిస్తారు.

ప్రజాస్వామ్యానికి పాతర

(మొదటిపేజీ తరువాయి)

ముందుగా అనుమతివ్వడం, చివరి నిమిషంలో రద్దు చేయడం పోలీసులకు అలవాటుగా మారిందని నిందించారు. సీపీఐ నాయకత్వాన టిడ్కో ఇళ్లు, జగనన్న ఇళ్ల సమస్యలపై విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నాకు ఇటీవల పిలుపునిచ్చామని, దానికి పోలీసులు అనుమతిచ్చినప్పటికీ పార్టీ శ్రేణులు, లబ్ధిదారులు విజయవాడ రాకుండా అడ్డుకున్నారని గుర్తుచేశారు. అనుమతులు ఎందుకిచ్చారు...నాయకులు, కార్యకర్తలను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రతి విషయంలోనూ జగన్ ప్రభుత్వం ఇదే ధోరణితో ఉందని ఆగ్రహం వెలిబుచ్చారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని, ప్రజాస్వామ్యహక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. జీవో నంబర్ 1 రద్దు కోసం చలో అసెంబ్లీకి పిలుపునిస్తే...అన్ని జిల్లాల్లో వామపక్ష, ప్రజాసంఘాల నేతలను ఎక్కడికక్కడే అక్రమ అరెస్టులు చేశారని దుయ్యబట్టారు. అసెంబ్లీలోనూ జీవో నంబర్-1కి వ్యతిరేకంగా మాట్లాడిన టీడీపీ ఎమ్మెల్యేలపై వైసీపీ ఎమ్మెల్యేలు దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. చట్టసభల గౌరవాన్ని జగన్ ప్రభుత్వం దిగజార్చిందని దుయ్యబట్టారు. టీడీపీ ఎమ్మెల్యేలే స్పీకర్‌పై దాడి చేశారంటూ అసత్యప్రచారం చేయడం తగదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి కారణంగానే వైసీపీ దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. జగన్ దుర్మార్గానికి అంతులేకుండా పోతోందన్నారు. టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై గతంలో ఏ ముఖ్యమంత్రి ఆసక్తి చూపలేదని గుర్తుచేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లతోనే వైసీపీ గెలిచిందని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఐక్యతతో జగన్‌కు తగిన బుద్ధిచెప్పాయన్నారు. ఇది జగన్ ప్రభుత్వ పతనానికి నాంది అని స్పష్టంచేశారు. జగన్ సొంత నియోజకవర్గంలో పట్టభద్రులు వ్యతిరేకంగా ఓట్లు వేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేలను జగన్ భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగానికి ఆయన తిలోదకాలిస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ప్రతిపక్ష పార్టీలు, ప్రజాతంత్ర, లౌకికవాదులంతా ఖండించాలన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఈనెల 24, 25 తేదీల్లో విజయవాడలో జరగనున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలలో చర్చిస్తామని, ఐక్య పోరాట కార్యాచరణను రూపొందిస్తామని రామకృష్ణ చెప్పారు.

చట్టసభల్లో ప్రజాసమస్యలు పక్కదారి: ఓబులేసు

చట్టసభలను సజావుగా నడపాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని, అయినా ప్రజాసమస్యల్ని పక్కదారిపట్టిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నాయని జి.ఓబులేసు విమర్శించారు. అదానీ అవినీతిపై జేపీసీ వేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నా...మోదీ సర్కారు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వమూ ప్రజాసమస్యల్ని ఆలకించడం లేదని, అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. దీనిపై చర్చించి రైతులకు న్యాయం చేయకుండా...అధికారపక్షమే ప్రజా సమస్యల్ని చర్చకు రాకుండా అడ్డుకుంటూ గందరగోళం చేస్తున్నదని మండిపడ్డారు. మందబలం ఉందనే అహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టసభల్లో ప్రతిపక్షాలపై దాడులకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఇవి ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.

భారత్‌కు 31 వేల మంది పైలట్లు అవసరం

బోయింగ్ ఇండియా ప్రెసిడెంట్ సలిల్ గుప్తే



న్యూఢిల్లీ: భారత విమానయాన రంగంలో రాబోయే 20 ఏళ్లలో వేల సంఖ్యలో పైలట్లు, సాంకేతికత సిబ్బంది అవసరమని అమెరికాకు చెందిన విమాన తయారీ సంస్థ బోయింగ్ అంచనా వేసింది. 'రాబోయే 20 ఏళ్లలో దక్షిణాసియా ప్రాంతం ప్రపంచస్థాయి సంస్థలకు అనుకూలమైన మార్కెట్‌గా అభివృద్ధి చెందుతుంది. విమానతయారీ సంస్థల నుంచి భారతీయ విమానయాన సంస్థలకు అందబోయే విమానాల నిర్వహణ కోసం భవిష్యత్తులో 31 వేల మంది పైలట్లు, 26 వేల మంది సాంకేతిక సిబ్బంది అవసరమవుతారు. విమానరంగంలో భారత్ సాధించిన అభివృద్ధికి ఇది నిదర్శనం. దాంతోపాటే విమానాశ్రయాల నిర్మాణం పెరుగుతుండటం శుభపరిణామం'' అని బోయింగ్ ఇండియా ప్రెసిడెంట్ సలిల్ గుప్తే అన్నారు. భారత విమానయాన సంస్థలు పెద్ద ఎత్తున విమానాల కొనుగోలుకు ఆర్డర్‌లు పెడుతున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. ప్రస్తుతం భారత్ నుంచి అందిన ఆర్డర్‌ల ప్రకారం భవిష్యత్తులో పెద్ద ఎత్తున నిపుణులైన సిబ్బంది అవసరం ఏర్పడుతుందని సలిల్ చెప్పారు.

'ఎయిరిండియాను టాటా గ్రూప్ సొంతం చేసుకున్న తర్వాత గత నెలలో 470 విమానాలకు ఆర్డర్ పెట్టింది. వీటిలో బోయింగ్ నుంచి 220, ఫ్రాన్స్‌కు చెందిన ఎయిర్‌బస్ నుంచి 250 విమానాలు ఆర్డర్ చేసింది. అలానే ఇండిగో కూడా తన విమానాల సంఖ్యను 500 నుంచి 1300కు పెంచాలనే యోచనలో ఉన్నట్లు విమాన కన్సల్టెన్సీ సంస్థ కాపా గత నెలలో వెల్లడించింది. దాని ప్రకారం 2040 నాటికి భారత్ ఎయిర్ ట్రాఫిక్ ఏడు శాతం మేర పెరుగుతుందని బోయింగ్ అంచనా. 'కరోనా పరిస్థితుల తర్వాత విమాన ప్రయాణాలు చేసే వారి సంఖ్య పెరిగింది. ఆర్థికంగా ఇది విమాన ప్రయాణాల వృద్ధిపై ఎలాంటి ప్రభావం చూపలేదు. రాబోయే 20 ఏళ్లలో మార్కెట్‌లో 90 శాతం నారో బాడీ (చిన్న) విమానాలకు డిమాండ్ ఉంటుంది. అందులో కూడా బోయింగ్ గట్టి పోటీ ఇస్తుందని భావిస్తున్నాం. వైడ్ బాడీ (పెద్ద) విమానాల మార్కెట్‌లో బోయింగ్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. భవిష్యత్తులో కూడా ఈ స్థానాన్ని బోయింగ్ భారత్ సహా అన్ని మార్కెట్‌లలో కొనసాగిస్తుంది' అని సలీల్ చెప్పారు.

రూ.100నాణెంపై ఎన్టీఆర్ బొమ్మ

అధికారిక గెజిట్ విడుదల

న్యూఢిల్లీ: టీడీపీ వ్యవస్థాపకుడు, గొప్ప ప్రజాదరణ పొందిన నాయకుడు ఎన్.టి.రామారావు (ఎన్టీఆర్) బొమ్మతో 100నాణెం ముద్రణకు కేంద్రం గెజిట్ విడుదల చేసింది. 50శాతం వెండి, 40శాతం రాగి, 5శాతం నికెల్, 5శాతం జింకుతో ఈ నాణెం తయారు చేయాలని నిర్ణయించింది. త్వరలోనే ఎన్టీఆర్ రూ.100 నాణెం మార్కెట్‌లోకి రాబోతోంది. నందమూరి తారక రామారావు శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆయన స్మారకార్థం ఎన్టీఆర్ నాణేనికి సంబంధించిన అధికారిక గెజిట్‌ను కేంద్రం ప్రభుత్వం విడుదల చేసింది. నాణెం 44ఎంఎం వ్యాసం కలిగి, 50శాతం వెండి, 40శాతం, రాగి, 5శాతం నికెల్, 5శాతం జింక్‌తో తయారు చేస్తారు. దీనిని ఎవరైనా కొనుగోలు చేయవచ్చు. దీని ధర రూ. 4160. ఈ నాణెంపై హిందీ, ఆంగ్ల భాషలలో ఎన్టీఆర్ 100 సంవత్సరాల వార్షికోత్సవం అని ముద్రిస్తారు. 1923-2023 గుర్తు ఉంటుంది. ఈ నాణేన్ని త్వరలో మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నారు.

ప్రత్యేక హోదాపై మళ్లీ పాతపాటే!

(మొదటిపేజీ తరువాయి)

కలిసినప్పుడల్లా వినతిపత్రం ఇవ్వడం, వైసీపీ ఎంపీలు ఉభయ సభల్లో ప్రశ్నోత్తరాల్లో దీనిపై ప్రశ్న వేసి చేతులు దులుపుకోవడం తప్ప, ఇందుకోసం కేంద్రంపై కనీస ఒత్తిడి తెచ్చిన దాఖలాల్లేవు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విషయంలో కూడా ఇదే పరిస్థితి. ఉభయ సభల్లో వైసీపీకి సుమారు 31 మంది ఎంపీలున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాలకు ఆమోదముద్ర వేయడానికి తప్ప, రాష్ట్ర ప్రయోజనాలకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. చివరికి బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వివాదాస్పద బిల్లులకు సైతం వైసీపీ పూర్తి మద్దతు ప్రకటిస్తూ వస్తోంది. విభజన అంశాల్లో ఏ ఒక్కటీ ఇంతవరకు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు.

ప్రభుత్వం దిగొచ్చేవరకూ ఉద్యమం

- ఉద్యోగుల వర్క్‌టూ రూల్ ప్రారంభం
- అడుగడుగునా దగా: ఏపీ జేఏసీ అమరావతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణలో భాగంగా మంగళవారం నుంచి 26 జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు, సిబ్బంది వర్క్ టు రూల్ పాటించారు. ఏప్రిల్ 5వరకు దీనిని కొనసాగిస్తారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకుంటే భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు పర్యవేక్షణలో దీనిని కొనసాగిస్తున్నారు. ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొప్పలపూడి ఈశ్వర్, రాష్ట్ర గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.అర్జయ్య, నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లీశ్వరరావు, గ్రామ/రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.సాంబశివరావు, జిల్లా కార్యదర్శి బత్తిన రామకృష్ణ తదితర నేతలు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. విజయవాడలోని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలకు ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు వెళ్లి ఉద్యోగులను సందర్శించారు. వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వద్ద ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములం అంటూనే...వారికి తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. 11వ పీఆర్సీ ద్వారా ఉద్యోగులకు రావాల్సిన బకాయిల మొత్తం నాలుగు నెలల్లో చెల్లిస్తామని గతేడాది సీఎం జగన్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. దానిని ఇంతవరకు నెరవేర్చకపోవడం దారుణమని, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు, ఇతరత్రా ప్రయోజనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒకటో తేదీన వేతనాలు, పెన్షన్లు ఇవ్వాలని స్పష్టంగా ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఎందుకీయడంలేదని నిలదీశారు. గతంలో ఎప్పుడూ లేనంత రీతిలో ఉద్యోగులకు నష్టం కలిగించేలా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం దిగివచ్చేంత వరకూ వర్క్‌టూ రూల్ ఆందోళన కొనసాగిస్తామని, భవిష్యత్‌లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్ర ప్రజలకు గవర్నర్, సీఎం ఉగాది శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శోభకృత్ నామ సంవత్సరాది సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారం దరికీ గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వారికి ప్రధానమైన ఈ పండుగ ప్రజలు ఆనందంగా జరుపుకునేదని గవర్నర్ తెలిపారు. అందరికీ కొత్త ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని, ఉజ్వల భవిష్యత్‌ను తెస్తుందని ఆకాంక్షించారు. జీవితంలోని షడ్రుచులను కలగలిపి ఉండే ఉగాది పచ్చడి... ఏడాది పొడవునా జీవితం మనకు అందించే అన్ని రకాల అనుభవాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. షడ్రుచుల సమ్మేళనంతో ప్రారంభమయ్యే ఉగాది... తెలుగు లోగిళ్లలో నూతన సంవత్సర శోభను తెస్తూ, కొత్త లక్ష్యాలకు, ఆలోచనలకు, ప్రతి ఒక్కరి ఉజ్వల భవిష్యత్తుకు, తద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదపడాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆకాంక్షించారు. శోభకృత్ నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు అన్నీ శుభాలు కలగాలని, సమృద్ధిగా వానలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులకు మేలు కలగాలని, సకల వృత్తుల వారు ఆనందంగా ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పల్లెల్లో, పట్టణాల్లో ప్రతి ఇల్లు కళకళలాడాలని, మన సంస్కృతీ సంప్రదాయాలు కలకాలం వర్ధిల్లాలని సీఎం అభిలషించారు. శోభకృత్ నామ సంవత్సరంలో ఇంటింటా ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, ఆనందాలు నిండాలని ఆకాంక్షించారు.

మరో కిడ్నీ బాధితుడి మృతి

విశాలాంధ్ర-ఏ కొండూరు: ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండలం ఏ కొండూరు గ్రామానికి చెందిన వేల్పుల ఏసు (47) గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ సోమవారం రాత్రి విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. కూలి, నాలి చేసుకుంటూ జీవనం సాగించే తమ గ్రామాల్లో ఈ కిడ్నీ వ్యాధి మహమ్మారి వ్యాపించి కుటుంబాలకు కుటుంబాలని రోడ్డున పడేస్తోందని మృతుని భార్య, పిల్లలు రోధిస్తున్నారు. ఇప్పటివరకు 3 లక్షల రూపాయలు ఖర్చు చేసినా తమ తండ్రి దక్కలేదని కుమారుడు కన్నీరు మున్నీరుగా విలపించాడు. మండలంలో కిడ్నీ వ్యాధి మహమ్మారితో వందలది ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వంలో కనీసం చలనం కూడా కలగడం లేదని టీడీపీ మండల కార్యదర్శి వనపర్తి దేవరింగాల ఆందోళన వ్యక్తంచేశారు. ఏ కొండూరు దళితవాడలో కూడా కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని మండలంలో ఉన్న అన్ని తండాలలో ఎలా అయితే ట్యాంకర్ల ద్వారా శుద్ధ కృష్ణా జలాలను అందిస్తున్నారో అదేవిధంగా ఏ కొండూరు దళితవాడ కూడా శుద్ధ కృష్ణా జలాలను అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

నాపై తప్పుడు ఆరోపణలు ఎందుకు?

- ఫోన్లు మార్చాను-ధ్వంసం చేశానని ఎలా చెబుతారు?
- ఈడీకి లేఖలో కవిత ప్రశ్నలు

విశాలాంధ్ర–హైదరాబాద్: ఢిల్లీ మద్యం కేసులో మనీలాండరింగ్ నేపథ్య ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు తన పాత ఫోన్లతో బీఆర్ఎస్ నేత కె.కవిత మంగళవారం హాజరయ్యారు. ఈడీ కార్యాలయంలోకి వెళ్లే ముందు తన పాత ఫోన్లను విలేకరులకు చూపించారు. వాటిని ఈడీకి ఇవ్వ నున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో ఆమె ఈడీ అధికారి అధికారి జోగేంద్రకు ఓ లేఖ రాశారు. అందులో తనను సంప్రదించకుండా పాత ఫోన్లు ధ్వంసం చేసినట్లు ఎలా చెప్పారని ప్రశ్నించారు. దురుద్దేశపూరకంగా వ్యవహరిస్తున్నట్లు టీకే నేను గతంలో వాడిన ఫోన్లను సమర్పిస్తు న్నానని తెలిపారు. ఒక మహిళ ఫోను స్వాధీనం చేసుకోవడం గోప్యత హక్కుకు భంగం కలగదా? అని నిలదీశారు. దుర్బుద్ధితో వ్యవహరిస్తున్న దర్యాప్తు సంస్థ నేను ఫోన్లు ధ్వంసం చేశానని పేర్కొందన్నారు. కనీసం సమన్లు ఇవ్వలేదు. అడగను లేదు. కేసుగా ఆరోపణలు చేశారు. ఈ పద్ధతేమిటి అని ప్రశ్నించారు. మార్చిలో తొలిసారి విచారణకు పిలిచిన ఈడీ... గతేడాది నవంబరులోనే ఫోన్లు ధ్వంసం చేశానని ఎలా ఆరోపించింది. దురుద్దేశంతోనే తప్పుడు ఆరోప ణలు చేసిందా? తప్పుడు ఆరోపణలు చేయడం వల్ల రాజకీయ ప్రత్యర్థులు నన్ను ప్రజల్లో నిందిస్తున్నారు. నా ప్రతిష్ఠకు భంగం కలగడమే కాకుండా మా పార్టీ ప్రతిష్ఠను ప్రజల్లో తగ్గించే యత్నం జరిగింది. రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఈడీ వంటి దర్యాప్తు సంస్థ నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలన్న విధిని తొక్కిపెట్టి వ్యవహరించడం దురదృష్టకరం' అని కవిత పేర్కొన్నారు. 'కనీసం రెండు మొబైల్ ఫోన్లు వాడుతున్నానని, వాటి ఐఎంఈఐ నంబ ర్లను 10సార్లు మార్చానన్న ఆరోపణలు నన్ను షాక్కు గురిచేశాయి. ఎలాంటి సందర్భాల్లో ఇటువంటి ఆరోపణలు చేయాల్సి వచ్చింది. అలా ఎందుకు తప్పుడు ఆరోపణలు చేశారు' అని ఆమె ప్రశ్నించారు. దర్యాప్తు సంస్థ తనను అప్రతిష్ఠపాల్జే సేందుకు చేసే ప్రయత్నాన్ని తిప్పికొట్టేందుకే పాత ఫోన్లను అప్పగిస్తున్నట్లు కవిత వెల్లడించారు.

అంబేద్కర్ గురుకులాల ఉపాధ్యాయుల వేతనాలేవీ?

ఎస్టీయూ నేతలు సాయిశ్రీనివాస్, తిమ్మన్న

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులకు ఫిబ్రవరి వేతనాలు ఇంతవరకు చెల్లించకపోవడం దారుణమని, తక్షణమే వారికి వేతనాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 189 గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న దాదాపు 2,500 మంది ఉపాధ్యాయులకు నెల వేతనాలను ఇంతవరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఉపాధ్యాయులు ప్రతినెల జీత భత్యాలపైనే ఆధారపడి జీవిస్తారని వివరించారు. దానికి తోడు వ్యక్తిగత బ్యాంకు, గృహ రుణాలు, నెలసరి వాయిదాల చెల్లింపులో సకాలంలో జీతాలు రాకపోతే బ్యాంకు అధికారులు వారికి అపరాధ రుసుం వేస్తున్నారన్నారు. ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలకు అన్ని రకాల వసతులు కల్పిస్తామని, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని ప్రగల్భాలు పలుకుతోందన్నారు. 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు మాసాంత అవాంతాలతో ఉన్నారన్నారు. ప్రతినెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాదా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి ఉపాధ్యాయుల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే గురుకుల ఉపాధ్యాయుల ఫిబ్రవరి వేతనాలను చెల్లించాలని, లేకుంటే ఎస్టీయూ ఉద్యమబాట పడుతుందని హెచ్చరించారు.

ప్రజా గాయకుడు గని: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు: ఇండియన్ పీపుల్ థియేటర్ అసోసియేషన్(ఇప్టా) జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన గనిని సీపీఐ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ బాల్యం నుండే డప్పు చేతపట్టి సామాజిక స్పృహతో గీతాలు పాడుతూ ప్రజలను చైతన్యపరుస్తూ ముందుకు వెళుతున్న ప్రజా గాయకుడు గని అని కొనియాడారు. 50 సంవత్సరాలుగా జరుగుతున్న ప్రతి ప్రజా ఉద్యమంలో గని పాట లేని సభ లేదన్నారు. అనేకమంది గాయకులను సమాజానికి అందించిన వ్యక్తి అని అన్నారు. గనిని అభినందించడం గర్వంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేడా హనుమంతరావు, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్, అధ్యక్షులు రావుల అంజిబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, నగర కార్యదర్శి శశి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, నగర అధ్యక్షులు చిన్నపోతుల శ్రీను, రమణ, కాయల రామారావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీలో ఖాళీలు భర్తీ చేయండి

స్పీకర్‌కు చైర్మన్ పయ్యావుల కేశవ్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రజాపద్దులకమిటీ (పీఏసీ)లో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరుతూ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారామ్‌కు పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్ మంగళవారం లేఖ రాశారు. పీఏసీలో మొత్తం ఏడు ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. గతంలో ఇదే అంశానికి సంబంధించి గత ఏడాది అక్టోబర్ 21న అసెంబ్లీ సెక్రటరీకి లేఖ రాసిన విషయాన్ని ఈ సందర్భంగా కేశవ్ గుర్తు చేశారు. ఇప్పటివరకు ఖాళీలు భర్తీ చేయలేదని లేఖలో పేర్కొన్నారు. అసెంబ్లీ కమిటీల్లో ఒకటైన ప్రజాపద్దుల కమిటీలో మొత్తం 12 మంది సభ్యులు ఉండాలి. ఇందులో 10 మంది సభ్యుల్ని గతంలో భర్తీ చేశారు. వైస్సార్‌గా వివక్ష టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు వరుసగా రెండోసారి అవకాశం దక్కిన విషయం తెలిసిందే. పీఏసీలో గతంలో ఇద్దరు సభ్యుల్ని భర్తీ చేయాల్సి ఉంది. అదే సమయంలో ఉన్న 10 మందిలోనూ ఐదుగురు వివిధ పదవులు వచ్చి వెళ్లిపోయారు. దీంతో కేవలం ఐదుగురు సభ్యులతో పీఏసీని నడిపించాల్సి వస్తోందన్నారు. పీఏసీలో సభ్యులుగా ఉన్న మేరుగ నాగార్జున, జోగి రమేశ్, ఉషశ్రీ చరణ్‌లకు మంత్రి పదవులు రాగా, కోలగట్ల వీరభద్ర స్వామికి డిప్యూటీ స్పీకర్ పదవి, కరణం ధర్మశ్రీకి విప్ పదవులు ఇచ్చారు. దీంతో ఈ ఐదు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. దీని వల్ల పీఏసీ పనితీరు కుంటుపడుతోందని స్పీకర్‌కు రాసిన లేఖలో పయ్యావుల తెలిపారు. శాసనసభ నుంచి ఐదు, మండలి నుంచి రెండు ఖాళీలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. తక్షణమే ఖాళీలు భర్తీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, ఏడు ఖాళీలు ఉండటంతో పీఏసీ తన విధులను నిర్వహించలేకపోతోందని పయ్యావుల కేశవ్ ఆ లేఖలో పేర్కొన్నారు.

ఆయుష్ మార్కెట్ రూ.1.49 లక్షల కోట్లు

రాజ్యసభలో విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి సోనోవాల్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దేశంలో ఆయుష్ పరిశ్రమ మార్కెట్ సైజు లక్షా 49 వేల 451 కోట్ల రూపాయలకు చేరిందని ఆయుష్ శాఖమంత్రి శర్బానంద సోనోవాల్ తెలిపారు. రాజ్యసభలో మంగళవారం వైఎస్సార్సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. భారతీయ సంప్రదాయ వైద్య వేదిక (ఫోరం ఆన్ ఇండియన్ ట్రెడిషనల్ మెడిసిన్) ఆయుష్ రంగంపై జరిపిన పరిశోధనా నివేదిక ప్రకారం 2014-15లో రూ.23,532 కోట్లు ఉన్న ఆయుష్ మార్కెట్ 2020 నాటికి రూ.1.42 లక్షల కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించారు. ఆయుష్ రంగంలో అంతర్జాతీయ సహకారం పెంపొందించేందుకు ఆయుష్ మంత్రిత్వ శాఖ ఒక పథకాన్ని రూపొందించింది. అందులో భాగంగా భారతీయ ఆయుష్ తయారీదారులు, సర్వీస్ ప్రొవైడర్లు తమ ఎగుమతులను మరింత వృద్ధి చేసుకునేందుకు వీలుగా అనేక రకాల చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. అంతర్జాతీయస్థాయిలో ఆయుష్ ఉత్పత్తులను విధానాలపై అంతర్జాతీయస్థాయిలో అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహకారంతో ఆయుర్వేద, యునాని, సిద్ధ, హోమియోపతి, సోవా రిగ్పా వైద్య విధానాలకు సంబంధించిన మందులు ఇతర ఉత్పాదనల ఎగుమతుల కోసం ఆయుష్ ఎగుమతుల మండలిని ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. ఆయుష్ వైద్య విధానాన్ని అంతర్జాతీయంగా ప్రోత్సహించేందుకు వేర్వేరు దేశాలతో ఆయుష్ విధానాలపై పరిశోధనలు, అధ్యయనంపై సహకారం కోసం వివిధ అంతర్జాతీయ సంస్థలతో 40 ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు మంత్రి చెప్పారు. ఆయుష్ అకడమిక్ చైర్స్ నెలకొల్పేందుకు 15 ఎంఓయూలు కుదుర్చుకున్నట్లు ఆయన చెప్పారు. 35 దేశాలలో ఆయుష్ సమాచార కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఆయుష్ మంత్రిత్వ శాఖ 39 ఎంఓయూలు కుదుర్చుకుందన్నారు. అభివృద్ధి చేయడం, ఆయుష్ వైద్య విధానానికి అంతర్జాతీయ గుర్తింపు సాధించడం, భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు, అంతర్జాతీయంగా ఆయుష్ మార్కెట్లను అభివృద్ధి చేయడం, వివిధ దేశాలలో ఆయుష్ అకడమిక్ చైర్లు ఏర్పాటు చేస్తూ ఆయుష్‌లో అకడమిక్, పరిశోధనలను ప్రోత్సహించడం, శిక్షణ, వర్క్ షాపుల నిర్వహించడం ద్వారా ఆయుష్ వైద్య చికిత్సా

వైసీపీ ప్రభుత్వంపై ఛార్జిషీట్

బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ ప్రభుత్వంపై చార్జ్ షీట్ వేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు. బీజేపీ కార్యాలయంలో సోము వీర్రాజు అధ్యక్షతన పదాధికారుల సమావేశం మంగళవారం జరిగింది. జాతీయ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివ ప్రకాశ్, జాతీయ ప్రధాన కార్యదర్శి పురందేశ్వరి, జాతీయ కార్యదర్శి, బూత్ సశక్తి కరణ్ అభియాన్ ఇన్‌ఛార్జి అరవింద్ మీనన్, జాతీయ కార్యదర్శి సునీల్ దేవధర్, జాతీయ కార్యదర్శి వై. సత్యకుమార్, రాష్ట్ర పదాధికారులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్టీ ఇన్‌ఛార్జ్ లు పాల్గొని పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ అవినీతి రాజకీయాలకు బీజేపీ కేంద్రం గా మారిందని, ఇంత ఘోరమైన పరిస్థితి ఏ రాష్ట్రంలో లేదన్నారు. ఇసుక, మైనింగ్, మద్యం అన్నింటిలోనూ అవినీతే అని, ప్రజల వనరులను నిలువునా దోచుకుని దాచుకుంటున్నారని విమర్శించారు. ఆ డబ్బుతో రాజకీయం చేసి ఓట్లు కొంటున్నారు. కొనాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పదో తరగతి వాళ్లతో ఓట్లు వేయించారని, ఇంత దిగజారి రాజకీయం చేయడం దుర్మార్గమన్నారు. ఈ రాష్ట్రంలో ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకత ఉందని, ఈ పరిస్థితిని అంచనావేసి ఈ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ లు పీవీఎన్ మాధవ్, వాకాటి నారాయణ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వేటుకూరి సూర్యనారాయణ రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, చిట్ల శివన్నారాయణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బీజేపీతో తాడోపేడో తేల్చుకుంటాం

- 27, 28 తేదీలలో చలో ఢిల్లీ
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని, అందుకు నిరసనగా ఈనెల 27,28 తేదీలలో చలో ఢిల్లీ పిలుపు ఇచ్చామని, అక్కడ బీజేపీతో తాడోపేడో తేల్చుకుంటామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో భాగంగా విజయవాడ అర్బన్ శాఖ అధ్యక్షులతో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశంలో ఎవరి జనాభా ఎంతో, జనాభాకు తగ్గ ఫలాలు, ఫలితాలు అన్ని రంగాల్లో దక్కాలన్నదే తమ కోరిక అన్నారు. అందులో భాగంగా ఎస్సీలలో ఉన్న అన్ని కులాలకు రిజర్వేషన్లు ఫలాలు వారి జనాభాకు తగ్గట్టుగా అందాలని, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సాధన కోసం గత 29 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ అధ్వర్యంలో సుదీర్ఘ పోరాటం జరుగుతుందన్నారు. దళితులలో అట్టడుగున ఉండి ఇప్పటికీ రిజర్వేషన్లు న్యాయపరమైన వాటాను పొందలేని కులాల ప్రజల కోసం, ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధన కోసం ఎస్సీ రాష్ట్రాల్లో ఉద్యమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం జరుగుతున్న ఈ ఉద్యమానికి తెలుగు నేల వేదికే కాకుండా ప్రతి రాష్ట్రంలో బీజేపీ సమర్థిస్తూనే వస్తోందన్నారు. ప్రస్తుతం పరిష్కారం జరగాల్సిన సామాజిక న్యాయ అంశాల్లో ప్రథమ స్థానంలో ఎస్సీ వర్గీకరణ అంశమే మిగిలి ఉందన్నారు. బీజేపీ నిర్లక్ష్యం చేయడంతో వర్గీకరణ ఎప్పుడో జరగి ఉండవలసిన ఈ విషయంలో బీజేపీ మాత్రమే ముమ్మాటికి నిజమైన దోషి అన్నారు. ఎస్సీ వర్గీకరణ డిమాండ్ అనేది సర్వజనుల అంగీకారం పొందిన అంశమని, ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా కేంద్రం పార్లమెంటులో బిల్లు ఆమోదించాలని డిమాండ్ చేస్తూ చలో ఢిల్లీ పిలుపు ఇస్తున్నామన్నారు. అలాగే ఏప్రిల్ 3న విజయవాడ, హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయాల వద్ద మహాధర్నాలు చేస్తామని తెలిపారు. అలాగే 4న విజయవాడ నగర నాలుగు వైపుల జాతీయ రహదారులు ముట్టడి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జాతీయ అధ్యక్షులు డా.ముల్లంగి నరసింహారావు మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఏలీషా మాదిగ, నగర అధ్యక్షులు లింగాల నరసింహులు, కోట డానియల్ మాదిగ, ఎండ్రాతి కోటేశ్వరరావు మాదిగ, మంద పిచ్చయ్య, మంద వెంకటేశ్వరరావు, ఇంకొల్లు జమలయ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

స్కిల్‌పై దుష్ప్రచారం

జగన్ పసలేని ఆరోపణ: నక్కా ఆనంద్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పుతో సీఎం జగన్‌కు మతిభ్రమించిందని, స్కిల్ డెవలప్‌మెంట్‌పై శాసనసభలో పసలేని ఆరోపణలు చేశారని టీడీపీ నేత నక్కా ఆనంద్‌బాబు మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా కట్టుకథలు అల్లి, ప్రజల్ని నమ్మించేందుకు జగన్ ప్రయత్నించారన్నారు. మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో అవినీతి జరిగితే, దానికి సంబంధించిన ఒప్పందం మొదలు నుంచి ప్రాజెక్టు కార్యకలాపాల అమలు వరకు భాగస్వాములైన అధికారుల్ని సీఐడీ ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. సీమెన్స్ సంస్థను, దానిలోని ఉద్యోగుల్ని సీఐడీ ఇప్పటివరకు ఎందుకు విచారించలేదని నిలదీశారు. అవినీతితో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుపై సీఎం జగన్ అసెంబ్లీలో రెండు గంటలపాటు అసంబద్ధ ఆరోపణలు చేశారన్నారు. చంద్రబాబు అవినీతి అంటగట్టాలని జగన్ మూడేళ్లు విశ్వప్రయత్నం చేస్తున్నారని, కొండనుతవ్వి ఎలుకను పట్టినట్లుగా జగన్ మాట్లాడారని చెప్పారు. జగన్ సీఎం అయిన దగ్గర నుంచి లక్షలకోట్ల రూపాయలు కొల్లగొట్టి, హవాలా ద్వారా విదేశాలకు తరలిస్తూనే ఉన్నారని విమర్శించారు. తన కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన బాలినేని శ్రీనివాసరెడ్డి హవాల ద్వారా కోట్లాది రూపాయలు చెన్నైకి తరలిస్తుంటే పట్టుకున్నారన్నారు. చంద్రబాబు తప్పుచేశారని నిరూపించడానికి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రయత్నించి భంగపడ్డారని, ఇప్పుడు జగన్‌కు అదే పరాభవం తప్పదని వ్యాఖ్యానించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకి రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఇచ్చిన రూ.371కోట్లు, టీడీపీ నేతల ఖాతాల్లోకి వస్తే ప్రాజెక్ట్ ఎలా అమలైందని, 2.94 లక్షలమంది యువత ఎలా శిక్షణ పొందారు?, వారిలో 70 వేలమందికి ఉద్యోగాలు ఎలావచ్చాయి? అని ప్రశ్నించారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ అనే కేంద్ర సంస్థ ప్రాజెక్టు అంచనాలను క్షుణ్ణంగా పరిశీలించి...అంతా సక్రమంగా ఉందని చెప్పిన తర్వాత కూడా జగన్ విమర్శలు చేయడం తగదన్నారు. ఒక పక్క ఈడీ విచారణ కొనసాగుతుండగానే, జగన్ సీఐడీతో సమాంతర విచారణ చేయిస్తున్నారని మండిపడ్డారు. అంతటితో ఆగకుండా అసెంబ్లీలో దానిపై సీఎం మాట్లాడం ఈడీ విచారణను ప్రభావితం చేయడం కాదా? అని ప్రశ్నించారు. జగన్‌కు దమ్మూ, ధైర్యం ఉంటే స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో అవినీతి జరిగిందని చెప్పాల్సిన డబ్బు, ఎక్కడి నుంచి, ఎవరి ఖాతాలకు వచ్చిందో, ఎప్పుడు వచ్చిందో వారంలో నిరూపించాలని ఆనంద్‌బాబు సవాల్ విసిరారు.

రైల్వేకు పోర్టు నుంచి బొగ్గు రవాణా అత్యధికం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): రైల్వే శాఖ ఈ ఆర్థిక సంవత్సరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక బొగ్గు లోడింగ్‌ను సాధించడంలో అదానీ కృష్ణపట్నం యాజమాన్యం అందించిన సహకారం ఎనలేనిదని సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ జి.జాన్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన కృష్ణపట్నం పోర్ట్ పని తీరును సమీక్షించారు. ముందుగా వెంకటాచలం రోడ్ జంక్షన్‌లో నూతన ఎలక్ట్రానిక్ ఇన్ మోషన్ వెయిట్ బ్రిడ్జిని ప్రారంభించారు. అక్కడ నుంచి పోర్ట్ ప్రైవేట్ సైడింగ్ లిమిటెడ్‌ని సందర్శించారు. అనంతరం పోర్టు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో 2014లో లక్ష్యం పెట్టుకున్న అత్యధిక బెంచ్ మార్క్‌ను అధిగమించడం జరిగిందన్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో లోడింగ్ అంచనాలు, సరుకు రవాణా ఆదాయ అంచనాలను కూడా ఆయన చర్చించారు. లోడింగ్, రాబడి పని తీరులో కొత్త ఎత్తులను సాధించడానికి రైల్వే అధికారులు, పోర్ట్ అథారిటీలు ఇదే ఉపయోగపడటం కొనసాగించాలని సూచించారు. ప్రస్తుత డిమాండ్, లోడింగ్ లక్ష్యాలను చేరుకోవడానికి రైల్వే యంత్రాంగం నుంచి పూర్తి స్థాయి మద్దతు, సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. పోర్ట్ మౌలిక సదుపాయాలను ఆధునీకరణ చేయటంతో అదనపు వ్యాగన్‌ల నిర్వహణ, లోడింగ్ సౌలభ్యం మెరుగుపడిందన్నారు.

హిందూ ధర్మపరిరక్షణే లక్ష్యం

- ఏడు దేవాలయాలపై ప్రచారం
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హిందూ ధర్మ పరిరక్షణే లక్ష్యంగా ఏడు ప్రముఖ దేవాలయాల ప్రచార రథాల ద్వారా పెద్ద ఎత్తున ధర్మ ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి (దేవాదాయశాఖ) కొట్టు సత్యనారాయణ చెప్పారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ధార్మిక పరిషత్ కమిటీ మూడో సమావేశం ఉప ముఖ్య మంత్రి అధ్యక్షతన నిర్వహించారు. కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి దేవాలయంల్లో రోజువారీ చేపట్టాల్సిన ఆధ్యాత్మిక కార్యక్రమాలను సక్రమంగా కొనసాగించాలని, ఆ విషయంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ కనకదుర్గ, శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం ప్రముఖ ఏడు ఆలయాలైన ప్రచార రథాల ద్వారా హిందూ ధర్మ ప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని అంశం పైన పురాణ ఇతిహాసాలకు సంబంధించి చిన్నచిన్న పుస్తకాలు ప్రచురించి ప్రజలకు పంపిణీ చేయడం ద్వారా వారిలో హిందూ ధర్మ పరిరక్షణపై అవగాహన పెంపొందించుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లాం మాట్లాడుతూ హిందూ ధర్మప్రచారంతో పాటు త్వరలో నిర్వహించనున్న యజ్ఞం నిర్వహణకు వివిధ సూచనలు, సలహాలిచ్చారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్- కార్యదర్శి హరి జవహర్‌లాల్, అదనపు కమిషనర్ రామచంద్ర మోహన్, సంయుక్త కమిషనర్లు ఆజాద్, భ్రమరాంబ, రాజా ప్రతాప్, సురేష్‌బాబు, సాగర్‌బాబు, శ్రీనాథరావు, చంద్రశేఖర్ రెడ్డి, ఉప కమిషనర్ విజయరాజు, దేవాలయ పరిపాలనా సంబంధాలు రామచంద్రరావు, ఆగమ పండితులు, సలహాదారులు, ధార్మిక పరిషత్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మరో ఉద్యమానికి సిద్ధం అవుతున్న రైతులు

దేశంలోని రైతులు మరో మహా పోరాటానికి సిద్ధం అవుతున్నట్టున్నారు. ఏడాదికి పైగా ఢిల్లీ పొలిమేరల్లో సుదీర్ఘ కాలం శాంతియుతంగా ఉద్యమం కొనసాగించిన తరవాత ప్రధానమంత్రి మోదీ వివాదాస్పదమైన మూడు వ్యవసాయ చట్టాలు ఉపసంహరించుకున్నారు. అదే సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చారు. కానీ ఇవి అమలులోకి రాలేదు. అందువల్ల 2022 నవంబర్ 26న రైతులు మరోసారి ఉద్యమం చేపట్టారు. అన్ని రాష్ట్రాల గవర్నర్లకు విజ్ఞాపన పత్రాలు అందజేయడానికి ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో సోమవారం ఢిల్లీలో కిసాన్ మహా పంచాయత్ నిర్వహించారు. తమ కోర్కెలను కేంద్ర ప్రభుత్వం తీర్చకపోతే ఇంతకు ముందు చేపట్టిన ఉద్యమంకన్నా భారీ స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంలో కొంతమంది రైతులు కేంద్ర వ్యవసాయమంత్రి నరేంద్ర సింగ్ తోమార్‌కు విజ్ఞాపన పత్రాలు అందజేశారు. ధరలు అమాంతం పడిపోయినందువల్ల బంగాళాదుంప, టొమాటో, ఉల్లి, ఆవాల రైతులు బాగా నష్టపోయారు. ఇది ఈ సంవత్సరం తలెత్తిన సమస్య. ఢిల్లీ పొలిమేరల్లో 2020 నవంబర్ 26న ప్రారంభించిన ధర్నా 2021 డిసెంబర్‌లో ముగిసింది. 2021 నవంబర్ 19న ప్రధాన మంత్రి మోదీ వివాదాస్పద వ్యవసాయ చట్టాలను ఏకపక్షంగా ఉపసంహరించినా రైతులు వెంటనే ఆనందోత్సాహాలతో ఉద్యమం విరమించలేదని గుర్తుంచుకోవాలి. కేంద్రప్రభుత్వం లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చిన తరవాతే రైతులు ఉద్యమం విరమించారు. రైతుల న్యాయమైన కోర్కెలన్నిటినీ తీరుస్తామని కేంద్రప్రభుత్వం అప్పుడు వాగ్దానం చేసింది. అప్పటినుంచి ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వానికి న్యాయమైన రైతుల కోర్కెలు ఏమీ కనిపించలేదనుకోవాలి. లేకపోతే మోదీచేసే అనేకానేక వాగ్దానాలలాగే రైతులకు ఇచ్చిన మాటకూడా బూటకం అయిఉండాలి. ఉద్యమం ఎంత శాంతియుతంగా సాగినా ఆ క్రమంలో 750 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఇంతమంది రైతులు ప్రాణత్యాగం చేస్తే మోదీ ఒక్క కన్నీటిబొట్టు అయినా రాల్చకపోవడం రైతుల విషయంలో ఆయన ధోరణి ఏమిటో అర్థంచేసుకోవచ్చు. రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చినందువల్లే తాము ఉద్యమం విరమించామని రైతులు వ్యవసాయశాఖమంత్రికి అందజేసిన విజ్ఞాపనపత్రంలో తెలియజేశారు. అప్పుడు ఇచ్చిన హామీలు నెరవేరకపోగా మారిన పరిస్థితుల్లో రైతులు కొత్త సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. వీటిని కూడా ఈ విజ్ఞాపన పత్రంలో ఏకరువుపెట్టారు. ఉద్యమం చేపట్టిన రైతులు ఇతర సమస్యలతో పాటు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు కనీస మద్దతుధర చెల్లించడానికి చట్టం చేయాలని కోరారు. కనీస మద్దతుధర చెల్లిస్తూనే ఉన్నాం కదా అని కేంద్ర ప్రభుత్వం వాదిస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎంత అరకొరగా నెరవేరుస్తున్నారో తెలుసుగనకే రైతులు కనీస మద్దతుధరకు చట్ట ప్రతిపత్తి కల్పించాలని పట్టుబడుతున్నారు. సేద్యానికి అయ్యే ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి కనక స్వామినాథన్ కమిషన్ లాంటి కమిషన్ మళ్లీ ఏర్పాటుచేయాలని కూడా రైతులు కోరుతున్నారు. రైతుల రుణభారం చాలా పెరిగింది కనక రుణాలన్నీ మాఫీ చేయాలని కూడా రైతులు కోరారు. నెలకు రైతులకు రూ.5,000 పింఛన్ చెల్లించాలనీ అడిగారు. విద్యుత్ (సవరణ) బిల్లును ఉపసంహరించాలని, పంటల బీమా సమర్థవంతంగా అమలు చేయాలని కూడా రైతులు కోరుతున్నారు.

లఖింపూర్‌ఖేరీ సంఘటనతో ప్రమేయం ఉన్నందువల్ల కేంద్ర హోం శాఖ సహాయమంత్రి అజయ్ మిశ్రా "తేనీ"ని తొలగించాలన్న డిమాండునూ మోదీ ఇప్పటిదాకా పెడ్చూ వచ్చారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో రైతుల మీద మోపిన కేసులను ఉపసంహరించుకోవాలన్న డిమాండుకూ అతీగతీ లేదు. అమరులైన రైతులకు స్మారక చిహ్నం నిర్మించడానికి స్థలం కేటాయించాలన్న కోరికనూ పట్టించుకున్న వారేలేరు. ఇంతకు ముందు అందజేసిన విజ్ఞాపన పత్రాలలో కూడా ఇవే కోర్కెలున్నాయి. అంటే మోదీ సర్కారు ఏ సమస్యనూ పరిష్కరించలేదన్న మాట. ప్రస్తుతం రైతులు ఎదుర్కుంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడానికే ఇటీవలే నాసిక్ నుంచి ముంబై దాకా రైతులు సుదీర్ఘ పాద యాత్ర చేయవలసి వచ్చింది. ఇప్పుడు అమలులో ఉన్న మద్దతుధరల పథకాలను ఇంత సంక్షోభ సమయంలోనూ అమలు చేయడంలేదు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం ఒక వేపు ఎగుమతి, దిగుమతుల మీద ఆంక్షలు విధిస్తోంది. ద్రవ్యోల్బణాన్ని అదుపుచేసే మిషతో రైతులకు మెరుగైన ధర దక్కడానికి ఏ చర్యా తీసుకోవడం లేదు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని, రాష్ట్రస్థాయి సదస్సులు, అఖిలభారత స్థాయిలో ర్యాలీలు నిర్వహించి ఈ సమస్యలను జనందృష్టికి తీసుకు వస్తామని సోమవారంనాటి కిసాన్ మహాపంచాయత్‌లో హెచ్చరించారు. మోదీ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికే రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు. ఉపసంహరించుకున్న వివాదాస్పదమైన మూడు వ్యవసాయ చట్టాల లక్ష్యమూ అదే. రైతు వ్యతిరేక విధానాలను అమలు చేయడమే మోదీ ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. విచిత్రం ఏమిటంటే ఆర్.ఎస్.ఎస్.కు అనుబంధంగా ఉన్న భారతీయ కిసాన్ సంఘ్ 2022 డిసెంబర్‌లో ఢిల్లీలో రైతు గర్జన నిర్వహించిందంటే బీజేపీకి అనుకూల రైతు సంఘాలు కూడా రైతు వ్యతిరేక విధానాలపై పోరాడక తప్పని పరిస్థితి ఉంది. ఆ సంఘమూ మద్దతు ధర గురించి మాట్లాడడమే కాక సేద్యానికి అయ్యే పెట్టుబడి తగ్గేట్టు చూడాలని కోరింది. తమ కోర్కెలు అంగీకరించకపోతే ఉద్యమం తప్పదని ఆర్.ఎస్.ఎస్. అనుబంధరైతు సంఘం కూడా హెచ్చరించడం అంటే మోదీ సర్కారు మంకుతనం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది ఆరు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు జరగాల్సి ఉంది. అందుకే రైతులు కూడా మళ్లీ ఉద్యమ బాట పడుతున్నట్టున్నారు. మోదీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడానికి దేశవ్యాప్తంగా ప్రచారం చేయాలని కూడా సంయుక్త కిసాన్‌మోర్చా ఆలోచిస్తోంది. ఇంతకు ముందు బెంగాల్, ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికలలోనూ రైతులు ఇలాగే బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం చేయవలసి వచ్చింది. రైతుల ప్రచార ప్రభావం ఎంత అని నికరంగా లెక్కవేయడం కుదరకపోవచ్చు. ఈ వ్యతిరేక ప్రచారాన్ని ఎదుర్కొని ఎన్నికల్లో విజయం సాధించడానికి బీజేపీ చేసిన కట్టుదిట్టాల గురించీ కచ్చితంగా చెప్పలేం. మోదీ ప్రభుత్వం ఇదే మొండివైఖరి అనుసరిస్తే మరోసారి భీకరమైన రైతుఉద్యమం తప్పకపోవచ్చు. ఇటీవలి కాలంలో ఇతర ఏ వర్గానికన్నా కూడా రైతులే తమ సంఘటిత శక్తిని ప్రదర్శిస్తున్నారు. ఈ వాస్తవం విస్మరించడం మోదీకి ప్రతికూలమైన పరిస్థితికే దారితీస్తుంది.

పంచాంగ శ్రవణం

ఎదురు చూస్తున్న ఉగాది రానే వచ్చింది. ప్రతి సంవత్సరంలాగా పంచాంగ శ్రవణానికి పంతులుగారిని పిలుద్దామనుకొన్నారు. పాపం అందరిలాగానే ఆయన కూడా కోవిడ్ వాక్సిన్ వేయించుకున్న తర్వాత ఆరోగ్యం వెనుకతట్టు పట్టింది. అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యాయి. ఓరోజు గుండె బరువుగా ఉందని, ఇంకొక రోజు ఒళ్లంతా నొప్పులని, ఊపిరితిత్తులకు నిమ్ము వచ్చి శ్వాసకు ఇబ్బందిగా ఉంటుందని ఏవేవో బాధలు చెబుతున్నాడు. ఊరందరికి జాతకాలు చెప్పి బాగానే కూడేశాడు కాని కార్పొరేట్ ఆసుపత్రులు మొత్తం ఊదేశాయి. తన భవిష్యత్తే తనకు అర్థం కావడంలేదు, దేశభవిష్యత్తేమి చెపుతాడు. ఆయన శిష్యుడే రామకృష్ణ పంతులు. సరుకు లేకపోయినా బిల్డప్ ఎక్కువ. పంతులే పంచాంగం చదవాలని, ఇంకెవరకు అర్హతలేదనటంతో ఊర్లో ఇంకెవరు లేకపోవటంతో అతన్నే పిలుచుకొచ్చారు మా కాలనీ వాళ్ళు. లేకపోతే నేనయినా గోచీ బిగించి చదివి చెప్పేవాడ్ని. పంచె కట్టుకోవటం చేతకాకపోయినా రామకృష్ణ పంతులు రామరాజు రెడీమేడ్ పంచె కొనుక్కొని, భూతవైద్యుడులా పెద్దబొట్టు పెట్టుకొని పంచాంగం పట్టుకు బయలుదేరి వచ్చి చప్టా అరుగుపై కూర్చొని పెద్దారెడ్డి రావటంతో సభకు నమస్కారం అంటూ పంచాంగ శ్రవణం మొదలుపెట్టారు.

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఎన్నికల వత్సరం కావటంవల్ల జనం ప్రభుత్వాల వరాల జల్లులతో తడిసి ముద్దవుతారు. రసాధిపతి, రాజు బుధమహర్షి, రాజు గారు కొంచం మెతకవైఖరి అవలంబించటం వల్ల మంత్రి అన్నీ తానై నిర్వహిస్తారు. మంత్రి రాక్షస గురువు శుక్రాచార్యులు వారు, ఎత్తుగడలన్ని రాక్షస విధానాలు కొనసాగుతాయి. సేనాధిపతి, మేఘాధిపతి మన గురువు గురుమహర్షి ఎంత మంచివారైనా వాతావరణం మాత్రం గరం గరంగానే ఉంటుంది. ప్రకృతి గ్లోబలైజేషన్‌లో భాగంగా పొల్యూషన్ పెరిగిపోవడంతో వాతావరణం ఎవరికి స్వాధీనంకాదు. ఎన్నికలయ్యే వరకు ధరలు పెరగకుండా ప్రయత్నిద్దాం అనుకుంటారు కానీ మార్కెట్ పగ్గాలు వ్యాపార దిగ్గజాల వశంలో ఉండటంవల్ల, మంత్రిగారి జుట్టు వారి చేతిలో ఉండటంవల్ల వీరిని పెద్దగా పట్టించుకోరు. దానికితోడు కొనుగోలుదారులపై ప్రభుత్వ పన్నుల బాదుడు వల్ల సరుకులు అత్యంత అప్రియమై పోతాయి. పెళ్లి రోజున కనిపించని అరుంధతీ నక్షత్రం నిరంతరం కనిపిస్తూనే ఉంది. అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులు, ఉక్రెయిన్-రష్యా యుద్ధం కొనసాగడం వల్ల చమురు ధరలు ఆకాశాన్నంటుతాయి. దానివల్ల మార్కెట్ ఒడిదుడుకులకు లోనవుతూ ఉంది. వేటి ధరలూ స్థిరీకరించటం ఎలాగో అర్థం కాక ఆర్థిక నిపుణులు జుట్లు పట్టుకుంటారు.

ముఖ్యంగా 'ధరా'ఘాతాల సెగ అధికారపార్టీకి తలనొప్పి తెప్పిస్తుంది. ప్రతిపక్షాలు ముప్పేట దాడిచేస్తాయి. సస్యాధిపతి చంద్రుడు. చంద్రుని సహజసిద్ధమైన చల్లని చూపు రైతులపై ఉన్నప్పటికీ అధిక వర్షపాతం వల్ల పల్లపు పంటలు నాశనమవ్వటమే కాక, దిగుమతి బాగా వచ్చిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతుల ఆక్రందనలు షరా మామూలే. స్కూళ్లలో, కాలేజీలో చదువుకొనే విద్యార్థి, విదార్థినులు అనేక వత్తిళ్లవల్ల డిప్రెషన్‌కు లోనవుతారు.

సాంకేతికతను అడ్డం పెట్టుకొని ఈ నేరగాళ్లు ఇటు ప్రజలకు, అటు పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తారు. ఇదంతా గతమాదిరిగానే కొనసాగుతుంది. ఈ నేరగాళ్లు మీకు తెలియ కుండా ఆధార్‌కి మీరిచ్చిన (వేలిముద్రలు వగైరా) ఆధారాల నడ్డంపెట్టుకొని మీ ఖాతాల్లో సొమ్ము జమచెయ్యగలరు, తీసుకొన గలరు. ప్రజలు బాంకు ఖాతాల్లో నిల్వ ఉంచటం అంత శ్రేయస్కరం కాదు. బాంకులు మీ ప్రమేయం లేకుండా మీ సొమ్ము నిక్షేపంగా బాంక్‌లకు శఠగోపం పెట్టేవారికీ లోన్లు ఇవ్వటం, వాడు బాకీలెగగొట్టి విదేశాలకు ఉడాయించే ఫలితాలు గోచరిస్తున్నాయి. డబుల్ ఇంజను రైలు కొంచం ఇరకాటంలో పడుతుంది. కేంద్ర ప్రభుత్వం బుల్డోజర్ డ్రైవింగ్ లైసెన్సులు ఎక్కువగా ఇవ్వటం వల్ల విశ్వగురు కీర్తి మసకబారుతుంది. క్రోనీలకు కట్టబెట్టేసొమ్ము ప్రజలదే అనే విషయం అందరికి తెలిసిపోతుంది. పరిశ్రమలు మూతబెట్టటంవల్ల ఉన్న ఉద్యోగాలు ఊడి రోడ్డున పడతారు. నూతన నిరుద్యోగులు మరింత నిరాశ చెందవలసి ఉంటుంది. ఉద్యోగ నియామకాలు పేపర్ ప్రకటనలకు పరిమితమైపోతాయి. ఏది ఏమైనా అష్ట గ్రహాల గ్రహస్థితి బాగున్నా దేశ, రాష్ట్రాల రాజకీయ పరిస్థితులు పెద్దగా బాగుండదు. ఎన్నికల్లో ఈ సారి బాగా ఖర్చుపెట్టినవారు ఎక్కువ నష్టాల్లో కూరుకుపోతారు. ఓటరునాడి రాజకీయ నాయకులకు, సిద్ధాంత కర్తలకు అంతు చిక్కదు. రాజకీయనాయకులు, వారిపై కోసుపందాలు కాసుకొనే పందెగాళ్ళు ఆచితూచి అడుగేయాలి. ఇంతటితో సెలవు. అందరమూ ఇలా బతికి బాగుంటే శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాదికి కలుద్దాం...

బంగారు వి బి ఆచార్యులు, 9849579569

జాతి మరవలేని అమరవీరులు

నక్కి లెనిన్ బాబు

భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి భారత ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన భారతరత్నాలు సర్దార్ భగత్‌సింగ్, శివరాం రాజ్‌గురు సుఖదేవ్ థాపర్. ఎక్కడోపుట్టి ఎక్కడోపెరిగి ఒకేచోట చదివి స్వాతంత్ర సంగ్రామంలో వీరోచితమైన పోరాటాలు నిర్వహించి, భారత యువతకు ఆదర్శప్రాయంగా నిలిచిన ఉద్యమకారులు. భగత్‌సింగ్ లాహోర్ సమీపంలోని బంగా గ్రామంలో జన్మించాడు. భగత్‌సింగ్ కుటుంబ నేపథ్యం స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటున్న విప్లవకారుల కుటుంబం. భగత్‌సింగ్ చిన్నాన్న అజిత్‌సింగ్ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా అజ్ఞాతవాసంలో ఉంటూ పోరాటాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అతి చిన్న వయసునుండి భగత్‌సింగ్‌లో బ్రిటిష్ వ్యతిరేకభావం పెరుగుతూ వచ్చింది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనాలన్న ఆలోచనతో తుపాకులు నాటితే మొలకెత్తుతాయి కదా అని భావించేవాడు. 1919లో పంజాబ్‌లోని జలియన్ వాలాబాగ్‌లో జరిగిన సంఘటన భగత్‌సింగ్‌పై తీవ్ర ప్రభావం పడింది. సుమారు 20,000 మంది ప్రజలు జలియన్‌వాలాబాగ్ తోటలో రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా సమావేశంకాగా, నిరాధారమైన ప్రజలపై పోలీసు అధికారి డయ్యర్ ఏకపక్షంగా సుమారు 1650 రౌండ్లు కాల్పులు జరపడంతో 379 మరణించారు. పదివేలకుపైగా ప్రజలు గాయపడ్డారు. తోట మొత్తం రక్తంతో తడిచిపోవడం, పక్కనఉన్న బావిలో తమ ప్రాణాలు కాపాడుకోవడంకోసం దూకడంతో అనేకమంది మరణించిన ఈ సంఘటన దేశవ్యాప్తంగా పెనుసంచలనం సృష్టించింది. భగత్‌సింగ్ జలియన్ వాలాబాగ్ వెళ్లి అక్కడ రక్తంతో తడిచిన మట్టిని తీసుకుని ఒక సీసాలో పోసుకొని ప్రతిరోజూ నా భారత ప్రజల ప్రాణాలుతీసిన డయ్యర్‌పై ప్రతీకారం తీసుకుంటానని ప్రతిజ్ఞ చేసేవాడు.

శివరాం రాజ్‌గురు మరాఠీ బ్రాహ్మణ కుటుంబంలో పూనే దగ్గర కుగ్రామంలో జన్మించాడు. దేశభక్తి భావజాలం పెరగడంతో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడాలన్న లక్ష్యంతో నేషనల్ కాలేజీలో విద్యాభ్యాసం కొనసాగించాడు. అక్కడే భగత్‌సింగ్ పరిచయమయ్యారు. సుఖదేవ్ థాపర్ లూధియానాలోని నౌఘరలో జన్మించాడు. సుఖదేవ్ కూడా బ్రిటిష్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను కళ్లారాచూసి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేందుకు హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్ కమిటీ సభ్యులకు పరిచయమయ్యారు. చంద్రశేఖర అజాద్, రాంప్రసాద్ బిస్మిల్లా ఆ సంస్థకు నాయకత్వం వహిస్తున్న నాయకులు. 1928లో సర్‌జాన్ సైమన్‌కమిషన్ భారతదేశంలో పర్యటిస్తున్న నేపథ్యంలో లాలాలజపతిరాయ్ నాయకత్వంలో సైమన్ కమిషన్ గో బ్యాక్ అంటూ పెద్దఎత్తున ఉద్యమం జరిగింది. సైమన్ కమిషన్ గోబ్యాక్ అంటూ ఉద్యమాన్ని నడిపిస్తున్న లాలాలజపతిరాయ్‌ని పోలీస్ అధికారి స్కాట్ తీవ్రంగా దాడిచేయడంతో ఆయన మరణించారు. వీరి మరణం హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్ సభ్యులపై తీవ్ర ప్రభావం చూపడంతో స్కాట్‌ను చంపాలని నిర్ణయించుకున్నారు. పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వస్తున్న స్కాట్‌ను అనుకొని డిఎస్పీగా ఉన్న జె.పి సాండర్స్‌పై కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను అరెస్టు చేయడంకోసం ప్రయత్నించడంతో మారువేషంలో భగత్‌సింగ్ అనేక ప్రాంతాలు తిరిగారు. శాసన సభలో అనేక చట్టాలు తీసుకొచ్చి భారత ప్రజలను అణిచివేసేందుకు జరుగుతున్న కుట్రల నేపథ్యంలో హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్ సభ్యులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ 1929 ఏప్రిల్ 8 ఎవరికీ హాని జరగని బాంబులువేసి నిరసన తెలపాలని నిర్ణయించుకున్నారు. భగత్‌సింగ్ ఆ కార్యక్రమంలో పాల్గొంటానంటే చంద్రశేఖర్ ఆజాద్ భగత్‌సింగ్‌వద్దని చెప్పినా చివరకు ఒత్తిడిచేసి నేను పార్లమెంటులో పొగబాంబు వేసి నిరసన తెలుపుతానంటూ నిర్ణయించుకున్నాడు. పార్లమెంట్‌లో పొగబాంబువేసి బ్రిటిష్‌పాలన మాకొద్దు సంపూర్ణ స్వతంత్రం కావాలని నినాదాలుచేస్తూ స్వచ్ఛందంగా లొంగిపోయాడు. అరెస్ట్ అయిన నేపథ్యంలో డిఎస్పి జె పి సాండర్స్ హత్యకేసు విచారణ ప్రారంభమైంది. జైల్లో ఉన్నకాలంలో భగత్‌సింగ్ కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగిల్స్, లెనిన్ రచనలు అనేకంగా చదివాడు. దేవుడుపై ఎప్పటికి నమ్మకం లేదని ప్రకటించారు. జైల్లో ఉన్న సర్దార్ భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు కూడా రాజకీయ ఖైదీలకు హక్కులు ఉండాలని 64 రోజులు పాటు నిరాహార దీక్ష నిర్వహించి విజయం సాధించారు. ఈ విచారణ నేపథ్యంలో వ్యక్తులను చంపడం సులువైనప్పటికీ సిద్ధాంతాలను సమాధి చేయలేరని నిరూపించారు. సామ్రాజ్యాలు కూలిపోయినా సిద్ధాంతాలు మాత్రం సజీవంగానే ఉన్నాయని భగత్‌సింగ్ అన్నారు. క్షమాభిక్ష కోరితే ఉరిశిక్ష రద్దుచేస్తావని అధికారులుచెప్పినా నా ప్రాణాలుపోయినా క్షమాభిక్ష దరఖాస్తుపై సంతకం చేయనని చెప్పిన వ్యక్తి భగత్‌సింగ్. నాకూ ఆశలూ, ఆకాంక్షలూ ఉన్నాయి. ఆనందమైన జీవనం గడపాలనిఉంది. అయితే అవసరమొచ్చినప్పుడు వీటన్నిటినీ త్యజించగలను. ఇదే అసలైన బలిదానం అన్నారు.

కర్తార్ సింగ్ సారాభా ప్రభావం భగత్‌సింగ్‌పై తీవ్రంగా ఉంది. విదేశాలలో బ్రిటిష్ వారికి అనుగుణంగా పనిచేయడంకోసం వేలాది మంది భారతీయులను తీసుకెళ్లిన బ్రిటిష్ అధికారులు అక్కడ తీవ్రమైన హింసలకు గురిచేసేవారు. ఈ నేపథ్యంలో భారతదేశానికి స్వాతంత్రం కావాలన్న లక్ష్యంతో విదేశాల్లో ఏర్పడిన ఏకైక పార్టీ గదర్‌పార్టీ. గదర్ అంటే తిరుగుబాటు. సోహన్‌సింగ్ నాయకత్వంలో ఏర్పడిన గదర్ పార్టీలో 15 సంవత్సరాల వయసు కలిగిన కర్తార్ సింగ్ సారాభా సభ్యుడిగాచేరి భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనాలన్న లక్ష్యంతో ఒక ప్రత్యేక హోదాలో విదేశాల్లో ఉన్న భారతీయులను తీసుకుని భారతదేశానికి బయలుదేరిన సమాచారం ముందుగానే బ్రిటిష్ వారికి అందడంతో వారు ప్రయాణిస్తున్న ఓడపై కాల్పులు జరిపి కర్తార్‌సింగ్ సారాభాను ఉరితీసారు. కర్తార్‌సింగ్ సారాభా నీ చివరి కోరిక ఏమిటి అని జడ్జి అడిగితే దేవుడు ఉంటే భారతదేశంలో మళ్లీ జన్మించాలి, మీ పాలనకు వ్యతిరేకంగా పోరాడి మరణిస్తానే ఉంటానంటూ చెప్పడం యువతలో తీవ్ర ప్రభావం చూపించాడు. భగత్‌సింగ్ కర్తార్‌సింగ్ సారాభా ఫోటో జేబులో పెట్టుకుని ప్రతిరోజు చూసుకుంటూ పోరాటాల్లో పాల్గొనేవాడు. సాండర్స్ హత్య కేసు విచారణ నేపథ్యంలో ప్రతిరోజు కేసును స్వయంగా వారే వాదించుకుంటూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో యువత పాల్గొనాలని ప్రచార మాధ్యమాల ద్వారా తెలిపేవారు. విచారణ ఏకపక్షంగా నిర్వహించి చివరకు 1931 మార్చి 24న భగత్‌సింగ్‌ను ఉరితీయాలని తీర్పు ఇచ్చారు. ఉరితీసేముందు నీ చివరి కోరిక ఏమిటి అని భగత్‌సింగ్‌ను జైలు అధికారి అడగడంతో రష్యా పోరాటయోధుడు వి.ఐ.లెనిన్ జీవిత చరిత్ర చదువుతున్నాను ఒక విప్లవకారుడు మరో విప్లవకారుడుతో మాట్లాడుతున్నాను అంటూ సమాధానం ఇచ్చాడు. దేశంలోని ప్రజలందరూ పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా ఉద్యమం చేస్తున్న నేపథ్యంలో లాహోర్ జైల్లో ఉన్న భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురులను మార్చి 23వ తేదీ నిబంధనలకు విరుద్ధంగా ఉరితీసి సట్లెజ్ నది దగ్గర అంతక్రియలు నిర్వహిస్తున్నారన్న విషయం తెలిసిన ప్రజలు పెద్దఎత్తున నది దగ్గరికి వెళ్లి అక్కడ కాలుతున్న భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురులకు ప్రజలే అంత్యక్రియలు నిర్వహించారు. ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలి.. సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాడి వీర మరణం పొందిన భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు స్వాతంత్ర్య ఉద్యమకారులు ఉద్యమస్ఫూర్తితో నేడు దేశాన్ని పరిపాలిస్తున్న మతోన్మాద పాలకపక్షాలు, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్య, వైద్య, ఉపాధి, హక్కుల సాధనకోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా)

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, సెల్: 8247806001

ఈ ఏడాదీ సాగునీటి రంగానికి మొండి చెయ్యేనా?

వి. శంకరయ్య

ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి ప్రాజెక్టులఅంశం చర్చకువస్తే మెట్ట ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలు గుర్తు కొస్తాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత మెట్టప్రాంతాల్లోని సాగునీటిరంగం పూర్తిగా పడకేసింది. ఏటా ఘనంగా కేటాయింపులు చేస్తున్నా ఆచరణలో నిధులు విడుదల చేయడంలేదు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి పాలనలో అనుమతులు ఇచ్చి పునాది రాళ్లు వేసిన ప్రాజెక్టులు రాయలసీమలో అడుగు ముందుకు కూడా కదలలేదు. బడ్జెట్‌లో ఏటా పదివేల కోట్లరూపాయలకు మించి కేటాయింపులుంటాయి. నిధులు విడుదల వుండదు. 2023-24 బడ్జెట్‌లో 11,908 కోట్లు కేటాయించారు. తమాషా ఏమంటే ఇందులో 5,042 కోట్లు పోలవరం పద్దు కింద చూపించారు. వాస్తవంలో కేంద్రప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు తన పూర్తి నిధులతో నిర్మించాలి. గణాంకాల్లో మాత్రం భారీ మధ్యతరహా ప్రాజెక్టుల పద్దుకింద 9,176 కోట్లు చూపించారు.

విశాఖ రాజధానిని చేసి ఉత్తరాంధ్రను ఉద్ధరిస్తామనిచెప్పే ఈ ప్రభుత్వం ఆ ప్రాంతానికి జీవనాడి అయిన ఉత్తరాంధ్ర సుజలస్రవంతి పథకానికి ఈ బడ్జెట్‌లో 141.79 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ ప్రాజెక్టు ప్రతిపాదించి నపుడు అంచనా వ్యయం 7 వేల కోట్లు కాగా ప్రస్తుతం 17 వేల కోట్లకు చేరిందని చెబుతున్నారు. వైసిపి అధికారంలోనికి వచ్చిన తర్వాత మహేంద్ర తనయ అఫ్‌షోర్ జలాశయం వరద కాలువ నిర్మాణానికి రూ.852.43 కోట్లుగా సవరించిన అంచనాలకు పరిపాలనా అనుమతి ఇచ్చారు. కాని ఈ బడ్జెట్‌లో మాత్రం కేవలం 60.12 కోట్లు కేటాయించారు. మరి ఎన్నాళ్ళకు ఈ పథకాలు పూర్తికావాలి. వచ్చే ఏడాది పెరిగే షెడ్యూల్‌రేట్ల అంచనాలకు ఈ నిధులు సరిపోవు. నిత్యం క్షామపీడిత ప్రాంతమైన రాయలసీమ ప్రాజెక్టుల పరిస్థితి మరీ దారుణంగా వుంది. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పోతురెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ పనులు ప్రస్తావనలేదు. గ్రీన్ ట్రిబ్యునల్‌లో వున్న కేసుతోపాటు కేంద్ర జలసంఘం వద్ద డిపిఆర్ ఆమోదం మరచి పోయారు. అదే సమయంలో గ్రీన్‌ట్రిబ్యునల్‌లో కేసువున్నా కేంద్ర జలసంఘం అనుమతి లేకున్నా తెలంగాణ పాలమూరు రంగారెడ్డి పథకం పనులు సాగిస్తున్నారు. రాయలసీమలో జగన్మోహన్ రెడ్డి అధికారంలోనికి వచ్చిన తర్వాత కాస్త కదలిక కలిగిన వెలుగొండ ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో 101.47 కోట్లు కేటాయించి తోకకోశారు. వాస్తవంలో ఈ పథకం పూర్తి కావాలంటే జలవనరుల శాఖ అంచనా మేరకే దాదాపు నాలుగు వేలకోట్ల రూపాయలు అవసరం. హంద్రీనీవా ప్రాజెక్టుకు ఈ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందనాలి. 2021లోనే హంద్రీనీవా విస్తరణలో భాగంగా ఎత్తిపోతల సామర్థ్యం పెంచేందుకు 221 కిలోమీటర్ల ప్రధాన కాలువలో 6,300 క్యూసెక్కుల నీరు ప్రవహించేందుకు వీలుగా విస్తరణకు 6,182 కోట్ల రూపాయల అంచనాలను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది.

అయితే ఈ ఏడు బడ్జెట్‌లో 122.69 కోట్లు కేటాయించారు. మరి ఇది ఎన్నాళ్ళకు పూర్తవుతుంది?

గాలేరు నగరి పథకానికి ఈ బడ్జెట్‌లో 855.35 కోట్లు చూపెట్టారు. తొలి పనులు ఇంకా పెండింగ్‌లో వున్నాయి. తొలి దశ పనుల్లో వామికొండ సర్వారాయసాగర్ జలాశయాలకు కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ పనులు పంట కాలువల నిర్మాణం ముట్టుకోలేదు. కడప జిల్లాలో నిర్మించవలసిన ఉద్దిమడుగు రిజర్వాయర్ కాదు కదా ఇప్పటి వరకు ప్రధాన కాలువ పనులు చేపట్ట లేదు. మరీ అన్యాయమేమంటే గాలేరు నగరి రెండవదశ పథకానికి చెందిన టెండర్లు మొత్తంగా రద్దుచేశారు. రెండేళ్లకు పైబడిన పాత కాంట్రాక్టర్‌ల బిల్లులు చెల్లించలేదు. తిరిగి టెండర్లు పిలిచే జాడలేదు. పైగా కడప జిల్లా నుండి చిత్తూరు జిల్లాకు వచ్చే ప్రధాన కాలువ అలైన్‌మెంట్‌పై తర్జనభర్జనలు సాగుతున్నాయి. నీటిఎద్దడి రోజుల్లో తిరుపతి తిరుమలకు తాగునీటి కోసం ఉద్దేశించి గాలేరు నగరి రెండవ దశలో ప్రతిపాదించిన బాలాజీ రిజర్వాయర్ నిర్మాణం పునాది దశలోనే వైసిపి ప్రభుత్వం టెండర్ రద్దు చేయడంతో నిర్మాణం ఆగిపోయింది. రాష్ట్ర మంతటా సాంస్కృతి కోత్సవాలల్లో ప్రజలకు వినోదం పంచుతున్న మంత్రి రోజా నియోజకవర్గంలో దాదాపు ఆరు టిఎంసిల సామర్థ్యంతో మూడు రిజర్వాయర్‌ల నిర్మాణం ఎక్కడికక్కడ ఆగిపోయింది. అసలు ప్రధాన కాలువ రూపురేఖలు కన్పించదు. గత అనుభవం దృష్టిలో పెట్టుకొంటే నిధులు ఏమాత్రం విడుదల అవుతాయో చెప్పలేము.

వైసిపి ప్రభుత్వం అధికారంలోనికొచ్చిన తర్వాత ప్రతి ఏటా పదివేలకోట్లకు పైగా బడ్జెట్‌లో కేటాయిస్తున్నారు. కాని నిధుల విడుదల భిన్నంగావుంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తొలి మూడేళ్లలో 15,786 కోట్లు రాష్ట్రం మొత్తం మీద సాగునీటి రంగంలో వ్యయంచేస్తే గత ప్రభుత్వం 29,352 కోట్లు ఖర్చు చేసింది. సాగునీటి ప్రాజెక్టులనగానే ముందుగా మెట్ట ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలు పరిగణనలోకి తీసుకోవాలి. ఈ జిల్లాల్లో ఎక్కువమంది వ్యవసాయం ఆధారంగా జీవిస్తుంటారు. వారికి ఏం న్యాయం చేసినట్టు? గత ఏడాది కూడా జనవరి ఆఖరుకు 3.514కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేశారు. అయితే బడ్జెట్‌లో 8,795 కోట్లు వ్యయం కానున్నట్టు చూపారు. మిగిలిన రెండు నెలలకాలంలో దాదాపు 5 వేల కోట్ల రూపాయల ఖర్చు పెట్టగలరా?

రాయలసీమ, ఉత్తరాంధ్రజిల్లాల్లో ఎక్కువభాగం వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం సాగుతున్నందున జూదంలాగా మిగిలింది. ఈ ప్రాంతాల నుండే గ్రామీణులు వలసపోతున్నారు. ఒక వేపు కృష్ణ, తుదకు పెన్నా, వంశధార నదుల నుండి వందలాది టియంసిలు నీరు సముద్రపాలు అవుతున్నా వర్షపునీరు కూడా నిల్వచేసుకొనే వసరులు లేక పోవడంతో ఉపాధి కరవై వలసలు తప్పడంలేదు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో వర్షపాతం 1200 మిల్లీ మీటర్లయితే ఉమ్మడి అనంతపురంజిల్లా సగటు వర్షపాతం 500 మిల్లీ మీటర్లు. అయినా రెండు జిల్లాల్లో వలసలు తప్పడం లేదు. ఎన్నికలు ముంగిటపెట్టుకొని ఈ ప్రాంతాల్లో వున్న కీలక పథకాలకైనా బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోవడం నేటి విషాదం.

విశ్రాంత పాత్రికేయులు, 9848394013

అదానీ సమస్య తేల్చాల్సిందే

న్యూఢిల్లీ : పార్లమెంటు ఉభయ సభలూ వరుసగా రోజూ వాయిదా పడుతున్నాయి. అదానీ గ్రూప్ అవకతవకలపై చర్చ చేపట్టాలని, జేపీసీ విచారణ చేయించాలని ప్రతిపక్ష పార్టీలు గట్టిగా పట్టుపడుతున్నాయి. అయితే అధికార పక్షం మాత్రం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్న వ్యాఖ్యలనే లేవనెత్తుతూ అదానీ అంశాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలను కొనసాగిస్తోంది. అదానీ, రాహుల్ అంశాలు రెండూ లోక్‌సభ, రాజ్యసభలో రగడకు దారితీస్తున్నాయి. అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంటోంది. మంగళవారం లోక్‌సభ సమావేశమైన వెంటనే ప్రతిపక్ష పార్టీలు అదానీ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) కి డిమాండ్ చేయడంతో గందరగోళం చోటుచేసుకుంది. దీంతో సభ వాయిదా పడింది. తిరిగి మార్చి 23 గురువారం సమావేశం అవుతుంది. ఉదయం సభ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష సభ్యులు 'వుయ్ వాంట్ జేపీసీ' వంటి నినాదాలతో అదానీ అంశాన్ని లేవనెత్తారు. అయితే సభాధ్యక్షుడి స్థానంలో ఉన్న రాజేంద్ర అగర్వాల్, జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి బడ్జెట్‌ను ఆమోదించడంలో సఫలమయ్యారు. సభ వాయిదా పడటానికి ముందు, చైత్ర సుఖ్లాది, గుడి పడ్వా, ఉగాది, చేతి చంద్, నవ్రే, సాజిబు చీరాబాతో సహా వివిధ పండుగల సందర్భంగా ఎంపీలకు అగర్వాల్ శుభాకాంక్షలు తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు వీలు కల్పించాలని అనేక మంది సభ్యుల అభ్యర్థన మేరకు బుధవారం సభ ఉండదని, బదులుగా మార్చి 23న సమావేశమవుతుందని చెప్పారు. అంతకుముందు, స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల సమయానికి సహకరించాలని నిరసనకారులకు పదేపదే విజ్ఞప్తి చేశారు. అందరికీ మాట్లాడే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. 'నేను అన్ని పార్టీల నేతలకు వ్యక్తిగతంగా ఒక అభ్యర్థన చేశాను. నేను మరో విజ్ఞప్తి చేయాలనుకుంటున్నాను. సభ పనిచేయాలి. బడ్జెట్ సమావేశం చాలా ముఖ్యమైనది. అందరికీ మాట్లాడే అవకాశం ఉంటుంది' అని తెలిపారు. 'ప్రశ్నల సమయం తర్వాత అవకాశం ఇవ్వకపోతే, మీరు వెల్‌లోకి రావచ్చు. మీరు సభను నిర్వహించకూడదనుకుంటే, ప్రక్రియను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేస్తాను' అని బిర్లా చెప్పారు. కాగా ప్రతిపక్షాల నిరసనలతో పార్లమెంటు సోమవారం వరుసగా ఆరవ రోజూ స్తంభించిన విషయం తెలిసిందే.

- జేపీసీ విచారణ, చర్చకు విపక్షాల డిమాండ్
- పార్లమెంటు కార్యకలాపాలు వాయిదా
- రాహుల్ వ్యాఖ్యలే లేవనెత్తుతున్న అధికార పక్షం
- తిరిగి గురువారం ఉభయ సభలూ సమావేశం

రాజ్యసభలోనూ అదే రభస

రాజ్యసభ కూడా మంగళవారం వాయిదా పడింది. లండన్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం' వ్యాఖ్యలకు ఆయన క్షమాపణ చెప్పాలంటూ బీజేపీ డిమాండ్ చేయడంతో సభలో రగడ చోటుచేసుకుంది. దీంతో సభ వాయిదా పడింది. తిరిగి గురువారం సమావేశమవుతుంది. అంతకుముందు వాయిదా పడిన సభ తిరిగి 2 గంటలకు సమావేశమైనప్పుడు, చైత్ర సుఖ్లాది, గుడి పడ్వా, ఉగాది, చేతి చంద్, నవ్రే, సాజిబు చీరాబాతో సహా వివిధ పండుగలకు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్ నేతృత్వంలో దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు వీలు కల్పించాలని అనేక మంది సభ్యుల అభ్యర్థన మేరకు బుధవారం సభ ఉండదని, బదులుగా మార్చి 23న సమావేశమవుతుందని చెప్పారు. ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్య స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ పని తీరుపై చర్చ చేపట్టడానికి ధన్కర్ ప్రయత్నించారు. అనంతరం ఆయన ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేకు చురకలంటించారు. ఖర్గే లేచి నిలబడి, 'రాహుల్ గాంధీ ఈ సభలో సభ్యుడు కాదు. అతను క్షమాపణలు చెప్పే ప్రశ్నే లేదు (ఈ సభలో)...' అని చెప్పినప్పుడు, లండన్‌లో తన వ్యాఖ్యలకు రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ అధికార పార్టీ సభ్యులు నినాదాలు చేశారు. దీంతో ధన్కర్ సభను మార్చి 23 (గురువారం) కి వాయిదా వేశారు. అంతకుముందు, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ప్రజాస్వామ్య వ్యాఖ్యలపై అధికార పక్ష ఎంపీలు గందరగోళం సృష్టించడంతో సభ కార్యకలాపాలు మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడ్డాయి. 267వ నిబంధన కింద ఈరోజు షెడ్యూల్‌ను నిలిపివేసి, అదానీ అంశంపై చర్చ చేపట్టాలన్న 11 నోటీసులను చైర్మన్ ధన్కర్ తిరస్కరించడంతో విపక్ష సభ్యులు కూడా తమ సీట్ల వద్ద లేచి నిలబడి నిరసన తెలిపారు. సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేయడానికి ముందు, ఉదయం 11.30 గంటలకు తన ఛాంబర్‌లో తనను కలవాలని వివిధ రాజకీయ నేతల ఫ్లోర్ లీడర్‌లను చైర్మన్ కోరారు. రూల్స్ 267 కింద నోటీసులు ఇచ్చిన ప్రతిపక్ష పార్టీ సభ్యులలో అమీ యాజ్ఞిక్, ప్రమోద్ తివారీ, తిరుచ్చి శివ, కుమార్ కేత్కర్, నీరజ్ డాంగి, రజనీత్ రంజన్, జేబీ మాథర్ హిషామ్, సయ్యద్ నాసిర్ హుస్సేన్, ఎలమరం కరీం, సంజయ్ సింగ్, పి.సంతోష్ కుమార్ ఉన్నారు. అదానీ గ్రూప్‌పై కార్పొరేట్ మోసం, రాజకీయ అవినీతి, వాటాల తారుమారు, ఆర్థిక దుర్వినియోగం ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం వైఫల్యంపై చర్చించాలని నోటీసుల ద్వారా ప్రతిపక్ష ఎంపీలు కొందరు డిమాండ్ చేశారు.

రైతుల్ని ఆదుకోండి

పంట నష్టానికి ప్యాకేజి ప్రకటించండి

మోదీ, తోమర్‌కు వినయ్ విశ్వం లేఖ

న్యూఢిల్లీ: దేశంలోని రైతులకు కేంద్రప్రభుత్వం అండగా నిలవాలని, అకాల వర్షానికి అపార నష్టాన్ని చవిచూసిన రైతులకు సహాయ ప్యాకేజి ప్రకటించాలని సీపీఐ ఎంపీ వినయ్‌విశ్వం డిమాండ్ చేశారు. ఇదే క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు మంగళవారం వేర్వేరుగా లేఖ రాశారు. ఉత్తర, మధ్య భారతంలో అకాల వర్షాలు, వడగండ్ల వాన, ఈదురు గాలులతో పంట నష్టం భారీగా సంభవించినట్లు మోదీ, తోమర్ దృష్టికి విశ్వం తీసుకెళ్లారు. గోధుమ, ఆవాలు, చక్కెర, కూరగాయల, శనగల సాగు దెబ్బతిని రైతులకు అపార నష్టాలు వచ్చాయని తెలిపారు. కష్టకాలంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన హామీలు రైతులకు అక్కరకు రాకపోవడాన్ని తన లేఖలో వినయ్ విశ్వం ప్రస్తావించారు. 'రైతు కేంద్రం'గా వ్యవసాయ రంగాన్ని మారుస్తామన్న కేంద్రం ఇచ్చిన హామీని దృష్టిలో పెట్టుకొని బాధిత రైతులకు ఎకరాకు కనీసం రూ.15వేల నష్టపరిహారాన్ని ప్రకటించాలని కోరుతున్నా. ఈ విషయానికి అత్యంత ప్రాధాన్యతను ప్రభుత్వం ఇస్తుందని, తక్షణమే తగు చర్యలను తీసుకుంటుందని నమ్ముతున్నా' అని విశ్వం పేర్కొన్నారు.

అసత్య ఆరోపణలకు నేను వివరణ ఇవ్వాల్సిందే

స్పీకర్‌కు రాహుల్ లేఖ

న్యూఢిల్లీ: బీజేపీ నేతలు, కేంద్రమంత్రులు తనపై దురుసు పదజాలంతో విమర్శలు గుప్పించారని, దీనికి పార్లమెంటులో సమాధానం చెప్పాల్సిన బాధ్యత, హక్కు తనకుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పారు. తనపై పూర్తిగా నిరాధార, అనవసర ఆరోపణలు చేశారని మండిపడ్డారు. భారతదేశం ప్రజాస్వామ్యాన్ని తక్కువ చేసి తాను మాట్లాడలేదని స్పష్టంచేశారు. ఈ మేరకు రాహుల్‌గాంధీ మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. 357 నిబంధన కింద వ్యక్తిగత వివరణ ఇవ్వడానికి అంగీకరించాలని స్పీకర్‌ను రాహుల్ కోరారు. గతంలో పార్లమెంటులో జ్యోతిరాదిత్య సింధియా చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇవ్వడానికి బీజేపీ ఎంపీ, అప్పటి కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్‌కు ఇదే రూల్ ప్రకారం అవకాశం కల్పించారని గుర్తుచేశారు. 'నేను మరోసారి విజ్ఞప్తి చేస్తున్నా. పార్లమెంటరీ నిబంధనలు, రాజ్యాంగం కల్పించిన రూల్ 357 కింద నేను అనుమతి కోరుతున్నా' అని స్పీకర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ విషయం సభ ముందు లేకపోయినప్పటికీ తనపై అనవసర ఆరోపణలు చేసినందున...వాటికి వివరణ ఇవ్వడానికి అవకాశం కల్పించాలని రాహుల్ విజ్ఞప్తి చేశారు. అధికార పార్టీ సభ్యులు బూతుపురాణంతో తన పరువుకు భంగం కలిగించేలా ఆరోపణలు చేశారని, పార్లమెంటు లోపలా, బయటా ఇవి కొనసాగాయని రాహుల్ తెలిపారు. అందువల్ల ఈ ఆరోపణలకు తాను వ్యక్తిగతంగా వివరణ ఇవ్వాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. పార్లమెంటు లోపల ఇలాంటి ఆరోపణలు చేసినప్పుడు వాటికి వివరణ ఇచ్చే అవకాశం కల్పించిన సందర్భాలు అనేకం ఉన్నాయని, అవన్నీ లోక్‌సభ డిజిటల్ లైబ్రరీలో భద్రపరిచి ఉన్నాయని వివరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 21 ప్రకారం సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగా పార్లమెంటు వంటి ఇతర ఏ సంస్థ అయినా కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టంచేశారు. ఈ హక్కును గౌరవించాల్సిన బాధ్యత స్పీకర్‌కు ఉందని తెలిపారు. ఈ విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని...పార్లమెంటులో తాను మాట్లాడటానికి అనుమతించాలని రాహుల్ విజ్ఞప్తి చేశారు.

సవాళ్లను ఐక్యంగా ఎదుర్కొందాం: పాండే

గురుగ్రామ్: భవిష్యత్‌లోనూ ఉగ్రవాదం, అంతర్గత భద్రతా సవాళ్లను భారత్ ఎదుర్కొంటుందని ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే మంగళవారం చెప్పారు. దేశ భద్రతా దళాలు ఐక్యంగా ఈ సవాళ్లను అధిగమిస్తాయని పేర్కొన్నారు. మనేసర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో జనరల్ మనోజ్ పాండే మాట్లాడుతూ డ్రోన్లు, ఇంటర్నెట్, సైబర్‌స్పేస్, సోషల్ మీడియా వంటి అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని శత్రువులు సైతం సమర్థవంతంగా ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. ఉగ్రవాదం, అంతర్గత భద్రతా పరిస్థితుల ప్రభావం మనదేశంపై వివిధ రూపాల్లో పడుతున్న విషయం అందరికీ తెలుసని జనరల్ పాండే చెప్పారు. ఈ సవాళ్లను మనం ఐక్యంగా ఎదుర్కొంటున్నామన్నారు. భారత బలగాలన్నీ ఐక్యంగా ఉండటం కారణంగానే అనేక రాష్ట్రాల్లో భద్రతా పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపారు. ఇవే సవాళ్లు భవిష్యత్‌లోనూ ఎదురవుతాయన్నారు. ఈ సవాళ్లు కొన్ని బహిరంగానూ, కొన్ని రహస్యగానూ వస్తాయన్నారు. మన ఇంటెలిజెన్స్ వ్యవస్థ పటిష్టవంతంగా ఉన్నప్పటికీ దేశంలో ఉగ్రవాద దాడులు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని విస్మరించరాదన్నారు.

పెద్దనోట్ల రద్దుపై కేంద్రాన్ని సంప్రదించండి: సుప్రీం

న్యూఢిల్లీ: రద్దు చేసిన రూ.1000, రూ.500 నోట్లను ఆమోదించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం తోసిపుచ్చింది. ఇలాంటి వ్యక్తిగత కేసులను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టంచేసింది. అయితే, ఈ విషయంపై ప్రభుత్వాన్ని సంప్రదించవచ్చని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్‌నాథ్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది. వ్యక్తిగత ఇబ్బందులను పరిశీలించడంపై 12 వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పెద్దనోట్ల రద్దుపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టమైన తీర్పు వెలువరించిన తర్వాత ఈ కేసులను విచారించే అవకాశం తమకు లేదని ధర్మాసనం తేల్చిచెప్పింది. కేంద్ర ప్రభుత్వం చర్యతో సంతృప్తి చెందకపోతే ఎవరైనా సంబంధిత హైకోర్టులను సంప్రదించే అవకాశం ఉందని తెలిపింది. రూ.1000, రూ.500 నోట్ల రద్దుపై సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన విషయం విదితమే. కేంద్రం తీసుకున్న నిర్ణయంలో తప్పులేదని, ఆర్‌బీఐ-కేంద్రం మధ్య సంప్రదింపుల తర్వాతే పెద్దనోట్ల రద్దుపై నిర్ణయం తీసుకున్నారని ధర్మాసనంలోని మెజారిటీ సభ్యులు వెల్లడించారు.

రూ.1.48 లక్షల కోట్లకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ: అదానీ వ్యవహారంలో ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్నప్పటికీ...ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1.48 లక్షల కోట్లను కేంద్రం ఖర్చు పెట్టేందుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. లోక్‌సభ అనుమతి కోసం కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి మార్చి 13న రూ.2,70,508.89 కోట్లకు సంబంధించిన అనుబంధ పద్దులను లోక్‌సభ ముందుంచారు. అయితే, రూ.1,48,133.23 కోట్లకు అనుమతిచ్చింది. ఆశ్చర్యమేమంటే లోక్‌సభలో ఎలాంటి చర్చ లేకుండా ఈ అనుబంధ పద్దులకు అనుమతి లభించింది. అదానీ గ్రూపు కంపెనీలకు సంబంధించిన ఆరోపణలపై జేపీసీ విచారణకు ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తుండగానే ప్రభుత్వం హడావుడిగా అనుబంధ పద్దులకు ఆమోదం పొందింది.

అడుగడుగునా కేంద్రం వివక్ష

29 నుంచి కోల్‌కతాలో ధర్నా: మమత

కోల్‌కతా: మోదీ సర్కారుపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వెలిబుచ్చారు. బెంగాల్ పట్ల కేంద్రం తీవ్ర వివక్ష ప్రదర్శిస్తున్నదని మండిపడ్డారు. కేంద్రం వివక్షాపూరిత ప్రవర్తనకు నిరసనగా మార్చి 29 నుంచి రెండురోజుల పాటు కోల్‌కతాలో ధర్నా చేయనున్నట్లు మమతా బెనర్జీ మంగళవారం చెప్పారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, గృహనిర్మాణం, రోడ్లు తదితర పథకాలకు కేంద్రం నిధులు విడుదల చేయడం లేదని మమత ఆరోపించారు. 'కేంద్రం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సాయం తీసుకొని ఏకైక రాష్ట్రం పశ్చిమబెంగాల్ మాత్రమే. మాకు రావాల్సిన బకాయిలు సైతం ఇవ్వడం లేదు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లోనూ మా రాష్ట్రానికి ఏమీ ప్రకటించలేదు' అని మమత విమర్శించారు. తమ రాష్ట్రం పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శిస్తున్న కేంద్రానికి వ్యతిరేకంగా తాను నిరసన తెలపాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. 'ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి నిరసన తెలుపుతూ మార్చి 29 నుంచి 30వ తేదీ సాయంత్రం వరకు కోల్‌కతాలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తాను' అని మమత విలేకరులకు చెప్పారు. మూడు రోజుల ఒడిశా పర్యటనకు వెళుతూ దుండుం విమానాశ్రయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. తన పర్యటనలో భాగంగా ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలుస్తానని ఆమె చెప్పారు.

ఆంగ్లంపై నితీశ్ ఆగ్రహం



పాట్నా: ఆంగ్ల భాష వినియోగంపై బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ మరోసారి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటన సోమవారం శాసనమండలిలో జరిగింది. శాసనమండలిలో డిస్‌ప్లే బోర్డుపై కొన్ని అంశాలు ఇంగ్లీషులో రాసి ఉండటాన్ని చూసిన నితీశ్ కోపంతో ఊగిపోయారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అయింది. డిస్‌ప్లే బోర్డుపై ఇంగ్లీష్ పదాలు చూసిన నితీశ్ జేడీయూకి చెందిన శాసనమండలి చైర్మన్ దేవేశ్ చంద్ర ఠాకూర్‌ను కొట్టినంత పనిచేశారు. 'ఆ డిస్‌ప్లే బోర్డుపై ఇంగ్లీష్ ఏమిటి? హిందీని చంపేద్దామనుకుంటున్నారా?' అని నితీశ్ నిలదీశారు. నిమిషం పాటు సీఎం ఆగ్రహంతో ఊగిపోయారు. చివరికి బోర్డుపై ఇంగ్లీష్‌ను తీసేస్తామని చైర్మన్ చెప్పారు. గతంలోనూ రైతు నుంచి ఉద్యోగిగా మారిన ఒకరు ఇంగ్లీష్‌లో మాట్లాడిన సందర్భంలోనూ నితీశ్ కోపగించుకున్నారు. వాస్తవంగా ఆ ఉద్యోగి రాష్ట్ర ప్రభుత్వ పనితీరును ప్రశంసిస్తూ మాట్లాడారు. ఈ ఘటనను అడ్డుపెట్టుకొని బీజేపీ నితీశ్‌ను లక్ష్యంగా చేసుకొని ఆరోపణలు గుప్పించింది. తమ నుంచి విడిపోయిన తర్వాత నితీశ్ కుమార్ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, తన నిస్సహాయతను ఇలా వ్యక్తపరుస్తున్నారని మాజీమంత్రి నీరజ్‌సింగ్ బబ్లూ ఆరోపించారు. ఆర్‌జేడీ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్‌తో చేతులు కలిపిన తర్వాత నితీశ్ పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. నితీశ్‌ను మానసిక ఆరోగ్యసమస్యలు పట్టిపీడిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర ప్రతినిధి నిఖిల్ ఆనంద్ చెప్పారు.

నేర కార్యకలాపాలపై కఠిన చర్యలకు భయపడం : సీఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ : రాష్ట్రంలో నేర కార్యకలాపాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవడానికి పంజాబ్ ప్రభుత్వం భయపడదని ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం స్పష్టం చేశారు. ఖలిస్తాన్ వేర్పాటువాద నాయకుడు, అతని సంస్థ 'వారిస్ పంజాబ్ దే' సభ్యులపై పంజాబ్ పోలీసులు భారీ అణిచివేత ప్రారంభించిన తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'పంజాబ్‌లో మేము (ఆప్) అధికారంలోకి వచ్చినప్పుడు విద్య, ఆరోగ్యం, విద్యుత్ రంగాలలో తాము పని చేయగలమని, అయితే శాంతిభద్రతల పరిస్థితిని నిర్వహించడం చాలా కష్టమని ప్రజలు చెప్పారు. గత ప్రభుత్వాల నుంచి మనకు సంక్రమించిన వ్యవస్థ నేరస్తులకు, గూండాలకు రాజకీయ రక్షణ కల్పించినట్లు చూపింది. కానీ మా ప్రభుత్వం నిజాయితీ కలిగినది. అలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం' అని కేజ్రీవాల్ తెలిపారు. నేరస్థులపై పంజాబ్ ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యలు, ఆప్ ఒక గొప్ప దేశభక్తి పార్టీ అని తేలిందని ఆయన అన్నారు. 'ప్రజల మద్దతుకు నా కృతజ్ఞతలు' అని కేజ్రీవాల్ అన్నారు. అణిచివేత చర్యలు చేపట్టిన పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌ను అభినందించారు. పంజాబ్‌లోని పోలీసులు శనివారం అమృత్‌పాల్ సింగ్, అతని సంస్థకు చెందిన సభ్యులపై భారీ వేట ప్రారంభించారు. అయితే అమృత్‌పాల్ సింగ్ జలంధర్ జిల్లాలో అతని అశ్వ దళాన్ని అడ్డగించినప్పుడు, పోలీసుల వలలో నుంచి తప్పించుకున్నాడు. పోలీసుల చర్యపై తన ప్రతిస్పందనగా, తన ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ ప్రజల నుంచి తనకు అనేక ఫోన్లు వచ్చాయని రాష్ట్ర ముఖ్యమంత్రి మాన్ తెలిపారు. 'నువ్వు మంచి పని చేశావని, పంజాబ్‌లో శాంతి, సామరస్యాలు నెలకొనాలని, ఈ విషయంలో మేం మీకు మద్దతిస్తామని ప్రజలు అంటున్నారు' అని ఒక వీడియో సందేశంలో అన్నారు.

కర్ణాటక నిధులు అడ్డుకోవడంపై

మహారాష్ట్ర మండలిలో గందరగోళం

ముంబై : మరాఠీ జనాభా గణనీయంగా ఉన్న సరిహద్దు గ్రామాలకు మహారాష్ట్ర కేటాయిస్తున్న ఆరోగ్య ప్రయోజనాల నిధులను అడ్డుకునేందుకు కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న చర్యపై రాష్ట్రంలోని అధికార పార్టీల మౌనాన్ని శివసేన (యూబీటీ) ఎమ్మెల్సీ అంబాదాస్ దన్వే ప్రశ్నించడంతో మహారాష్ట్ర శాసన మండలిలో మంగళవారం గందరగోళం చోటుచేసుకుంది. ఈ గందరగోళం మధ్య నిధులను అడ్డుకున్న కర్ణాటక ప్రభుత్వ చర్యకు నిరసనగా శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ నీలం గోర్హే సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు. అయితే ప్రతిపక్ష నేతలు బాధ్యతారాహిత్యంగా, అపరిపక్వంగా ప్రవర్తిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు, కర్ణాటక ప్రభుత్వం అక్కడ నివసించే (సరిహద్దు గ్రామాలలో) మరాఠీ ప్రజలకు ఆరోగ్య ప్రయోజనాలను విస్తరించడానికి కేటాయించిన రూ.54 కోట్ల విలువైన నిధులను నిలిపివేస్తోందని దాన్వే అన్నారు. 'కర్ణాటకలో బీజేపీ అధికారంలో ఉంది. ఇప్పటికీ ఇక్కడ మహారాష్ట్రలో ఎవరూ ఈ చర్యను వ్యతిరేకించడం లేదు. నిధులు ఆరోగ్య ప్రయోజనాలను విస్తరించడానికి ఉద్దేశించబడ్డాయి. ఇది తీవ్రంగా ఖండించదగినది' అని మండలిలో ప్రతిపక్ష నేత అన్నారు. అయితే దాన్వే వ్యాఖ్యలపై బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కొద్దిసేపటికే అధికార పక్ష సభ్యులు, ప్రతిపక్షాలు ఈ అంశంపై తీవ్ర వాగ్వాదానికి దిగారు. సభను ఆర్డర్‌లోకి తీసుకురావాలని చైర్ పర్సన్ గోర్హే పదేపదే చేసిన విజ్ఞప్తులను సభ్యులు పట్టించుకోకపోవడంతో మధ్యాహ్నం 1:45 గంటలకు సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు. 'నిధులను అడ్డుకున్న కర్ణాటక ప్రభుత్వ చర్యకు నిరసనగా, నేను కౌన్సిల్‌ను పది నిమిషాలు వాయిదా వేస్తున్నాను, అయితే ప్రతిపక్ష నాయకులు బాధ్యతారాహిత్యంగా, అపరిపక్వంగా ప్రవర్తించారు' అని తెలిపారు. కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో 'మహాత్మా జ్యోతిబా పూలే జన్ ఆరోగ్య యోజన' అమలు కోసం ఏకనాథ్ షిండే-బీజేపీ ప్రభుత్వం ఇటీవల అదనంగా రూ.54 కోట్లు ప్రకటించింది. ప్రతిపక్షాల విమర్శల మధ్య, మహారాష్ట్ర ప్రభుత్వం 865 సరిహద్దు గ్రామాలలో ఆరోగ్య బీమా పథకాన్ని అందించకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై బుధవారం చెప్పారు.

ప్రభుత్వ ప్లీడర్ల ఫీజు పెంచాలి

పార్లమెంటరీ ప్యానల్ సిఫార్సు

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం తరపున అనేక వ్యాజ్యాలపై హైకోర్టులలో వాదించే న్యాయవాదుల ఫీజు పెంచాలని పార్లమెంటరీ ప్యానల్ నొక్కిచెప్పింది. మిగతా వకీళ్లతో పోల్చితే వీరికిచ్చేది చాలా తక్కువని, ప్రస్తుత మార్కెట్ రేటుకు అనుగుణంగా ఫీజు పెంచడం సబబుగా ఉంటుందని పేర్కొంది. అలా చేయడం వల్ల న్యాయవాదులు మరింత నిబద్ధతతో పనిచేస్తారని అభిప్రాయపడింది. ప్యానల్ న్యాయవాదుల ఎంప్యానల్మెంట్‌కూ తగు మార్గదర్శకాలు జారీచేయాల కూడా కేంద్ర న్యాయశాఖలో న్యాయ వ్యవహారాల శాఖ సంబంధిత పద్దులపై నివేదికలో పార్లమెంటరీ స్థాయిసంఘం సూచించింది. దేశంలోని ప్యానల్ న్యాయవాదులు కేంద్రప్రభుత్వ వ్యాజ్యాల భారాన్ని ఎక్కువగా మోస్తున్నట్లు తమ సమీక్షలో తేలిందని పేర్కొంది. 2015లో వేర్వేరు విభాగాల సర్కారీ వకీళ్ల చెల్లింపులను సమీక్షిస్తే మార్కెట్ రేట్ల కంటే చాలా తక్కువగా ఉన్నట్లు తెలిసిందని బీజేపీ నేత సుశీల్ కుమార్ మోదీ నేతృత్వ కమిటీ తెలిపింది. హైకోర్టులు, ట్రిబ్యునళ్లు, ఇతర కోర్టుల్లో ప్రభుత్వ ప్లీడర్లకు ఇచ్చే ఫీజులపై ఏడేళ్ల కిందట సమీక్ష జరిగినట్లు గుర్తుచేసింది. తగు విధంగా ఫీజు చెల్లిస్తే ఉన్న న్యాయవాదులు నిబద్ధతతో పనిచేయడమే కాకుండా మిగతా వకీళ్లు కూడా ప్యానల్ కౌన్సిల్‌లోకి వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తారని పేర్కొంది. సర్కారీ వకీళ్ల ఎంప్యానల్మెంట్‌కు తగు మార్గదర్శకాలు జారీచేస్తే నియామక అర్హతలపై స్పష్టత రావడమే కాకుండా ఆ ప్రక్రియ మరింత పారదర్శకమవుతుందని అభిప్రాయపడింది. అవసరాన్ని బట్టి న్యాయవాదుల నియామకాలు జరుగుతున్నాయేగానీ హైకోర్టులు, ట్రిబ్యునళ్లకు ఎంత మంది న్యాయవాదులు అవసరమన్న లెక్క లేదని పేర్కొంది. ఈ విషయంలోనూ చర్యలు తీసుకోవడం అనుచితమని పార్లమెంటరీ కమిటీ సూచించింది.

పార్లమెంటు ప్రతిష్టంభనపై లభించని పరిష్కారం

న్యూఢిల్లీ: పార్లమెంటులో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. అధికార-విపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరక ఉభయసభలు సజావుగా సాగే పరిస్థితి లేదు. దీంతో స్పీకర్ ఓం బిర్లా మంగళవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. కాంగ్రెస్‌తో పాటు కొన్ని విపక్షాల సభ్యులు అదానీ వ్యవహారాన్ని లేవనెత్తారు. తమ డిమాండ్లపై వెనక్కి తగ్గేది లేదని చెప్పారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ వైఖరిపై స్పష్టతను కోరారు. అదానీ అక్రమాలపై జేపీసీ విచారణకు డిమాండ్ చేశారు. పార్లమెంటులో రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరితో సహా మరికొందరు ప్రతిపక్ష సభ్యులు కోరారు. బ్రిటన్‌లో దేశ ప్రజాస్వామ్యంపై చేసిన వ్యాఖ్యలకు రాహుల్ క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తున్న విషయం విదితమే

చదువు...పౌష్టికాహారం

- ఉన్నత విద్యలో సమూల మార్పులు
- రూ.86 కోట్లతో విద్యార్థులకు రాగి జావ
- ప్రారంభించిన సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: చదువుతోపాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం తాజాగా రాగి జావ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 44,392 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని 37,63,698 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ ఏటా రూ.86 కోట్ల అదనపు వ్యయంతో రాగి జావ అందించే కార్యక్రమాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం వర్చువల్‌గా సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి రోజు నుంచి బడి మానేసే పిల్లల సంఖ్యను ఎలా తగ్గించాలి? బడులలో సదుపాయాలు మెరుగుపర్చడం ఎలా? బడిపిల్లల మేధో వికాసానికి కావాల్సిన వాతావరణాన్ని కల్పించడం ఎలా? పెద్ద చదువులు చదివించడానికి ప్రోత్సహించడమెలా? అన్న అంశాలపై ప్రత్యేక దృష్టి పెడుతూ వాటి అమలుకు కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే సంపూర్ణ పోషణం కార్యక్రమం అమలు చేస్తున్నట్లు చెప్పారు. గర్భవతులుగా ఉన్న మహిళలు, పాలిచ్చే తల్లులు, ఆరు నెలల వయస్సు నుంచి ఆరు సంవత్సరాల వరకూ అంగన్‌వాడీలలో ఉంటున్న పిల్లలకు సంపూర్ణ పోషణ ద్వారా పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామన్నారు. విద్యాకానుక, నాడు–నేడు, ఇంగ్లీషు మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్, ద్విభాషా పాఠ్యపుస్తకాలు, ఆరో తరగతి నుంచి ప్రతి తరగతిగదిలోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ ప్యానెల్స్) ద్వారా డిజిటల్ బోధనను ప్రభుత్వ బడులలో తీసుకొస్తున్నామని, 8వ తరగతిలోకి వచ్చిన వెంటనే పిల్లలకు ట్యాబులు అందజేస్తున్నామని, అన్నింటికీ మించి పిల్లలను ప్రోత్సహించేందుకు అమ్మ ఒడి కార్యక్రమాన్ని తీసుకొచ్చామని సీఎం వివరించారు. ఉన్నత విద్యలోనూ సమూల మార్పులు తీసుకొస్తున్నామని, తప్పనిసరిగా ఉద్యోగాలు సాధించే పాఠ్యాంశాలు, ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరిచేస్తున్నామని, ఆన్‌లైన్ వర్టికల్స్‌ని పాఠ్యాంశాలకు అనుసంధానం చేస్తున్నామన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన, విద్యాకానుక వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. గోరుముద్దను ఇప్పటికే రోజుకొక మెనూతో అమలు చేస్తున్నామని, ఈరోజు నుంచి రాగిజావ కూడా పిల్లలకు అందిస్తూ గోరుముద్దను మరింత మెరుగ్గా చేయడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ రాగిజావ పిల్లలకు ఐరన్, కాల్షియం పెరగానికి దోహదపడుతుందన్నారు. ఇప్పటివరకు మెనూలో ప్రతి సోమవారం వేడి పొంగళి, ఉడికించిన గుడ్డు దగ్గర నుంచి కూరగాయలు, పలావ్, గుడ్డు కూర, వేరుశెనగ చిక్కీ మంగళవారం పులిహోర, టమోట పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, బుధవారం కూరగాయలు అన్నం, బంగాళదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశెనగ చిక్కీ, గురువారం సాంబార్ బాత్ లేదా లెమన్‌రైస్ విత్ టమోట పచ్చడి, ఉడికించిన గుడ్డు, శుక్రవారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశెనగ చిక్కీ, శనివారం పప్పు ఆకుకూర అన్నం, తీపి పొంగల్ ఇస్తున్నామని జగన్ వివరించారు. వారంలో మొత్తం 15 రకాల ఆహార పదార్థాలు పిల్లలకు గోరుముద్ద ద్వారా అందిస్తున్నామని చెప్పారు. ఏడాదికి రూ.86 కోట్లు ఖర్చయ్యే కార్యక్రమానికి సత్యసాయి ట్రస్ట్ దాదాపు రూ.42 కోట్లు అందజేస్తుంటే... మిగిలిన రూ.44 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెడుతుందన్నారు. ఏప్రిల్‌లో పరీక్షలు రాయబోతున్న పిల్లలందరికీ 'మేనమామ'గా ఆల్ ది వెరీ బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్, మౌలిక వసతుల కల్పన కమిషనర్ కాటమనేని భాస్కర్, పౌరసరఫరాల సంస్థ వీసీ జి.వీరపాండ్యన్, మధ్యాహ్న భోజనం డైరెక్టర్ నిధి మీనా తదితరులు పాల్గొన్నారు.

కర్ల లింగయ్య కళాభవన్‌కు రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర – పెనుగంచిప్రోలు: ఎన్టీఆర్ జిల్లా పెనుగంచి ప్రోలులో గురువారం ప్రారంభం కానున్న కర్ల లింగయ్య కళాభవన్ (సీపీఐ కార్యాలయం)కు వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన కమ్యూనిస్టు పార్టీ నాయ కులు హరికథా కళాకారుడు కీ.శే. తుమ్మేపల్లి సూర్యానారాయణ జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాసరావు, కుటుంబసభ్యులు లక్ష రూపాయల భూరి విరాళం ప్రకటించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ విజ్ఞప్తి మేరకు ఈ భూరి విరాళం ప్రకటించినట్లు సీపీఐ సీనియర్ నాయకులు వల్లంకొండ బ్రహ్మం. మాజీ ఎంపీపీ పొన్నం. నరసింహారావు తెలిపారు. సూర్యనారాయణ కుటుంబానికి సీపీఐ పెనుగంచిప్రోలు మండల కార్యదర్శి కనకపూడి బాబూరావు, మండల సమితి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బెయిలివ్వండి... అనారోగ్య భార్యను చూసుకోవాలి

- దిల్లీ కోర్టులో సిసోడియా పిటిషన్
- వ్యతిరేకించిన సీబీఐ • 24న తదుపరి విచారణ

న్యూదిల్లీ: మద్యం కుంభకోణం కేసులో దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు ఊరట లభించేలా లేదు. ఆయన బెయిల్ పిటిషన్‌ను విచారించిన దిల్లీ కోర్టు తదుపరి విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది. అటు మనీలాండరింగ్ కేసులోనూ ఆయన బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. సిసోడియా బెయిల్ అభ్యర్థనపై ఈనెల 25లోగా సమాధానం ఇవ్వాలని ఈడీకి నోటీసులు జారీ చేసింది. అనంతరం విచారణను వాయిదా వేసింది. ఆయన జ్యుడీషియల్ కస్టడీని కోర్టు మరో 14 రోజులు పొడిగించింది. దీంతో సిసోదియా ఏప్రిల్ 3 వరకు జైల్లోనే ఉండనున్నారు. అయితే సిసోడియాకు మద్యం కేసులో బెయిల్ ఇస్తే సాక్ష్యాలను ధ్వంసం చేసే ప్రమాదముందని, నిరంతరం ఫోన్లు మార్చిన వ్యక్తి అమాయకుడు ఎలా అవుతాడని సీబీఐ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. సిసోడియా తరపున న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఆయనకు కస్టోడియల్ విచారణ అవసరం లేదని కోర్టుకు తెలిపారు. 'ఈ కేసులో సిసోడియా ముడుపులు తీసుకున్నట్లు సాక్ష్యాధారాలు లేవు. సోదాల్లోనూ ఆయనకు వ్యతిరేకంగా ఏమీ లభించలేదు. ఆయనో ప్రజాప్రతినిధి. విచారణకు సహకరిస్తున్నారు. విదేశాలకు పారిపోయే ముప్పు లేదు. ఆయనను కస్టడీలో విచారించాల్సి అవసరం లేదు. ఆయన సతీమణి అనారోగ్యంతో బాధపడుతున్నారు. కుమారుడు విదేశాల్లో చదువుతున్నాడు కాబట్టి అనారోగ్యంతో ఉన్న భార్యను చూసుకోవాల్సిన బాధ్యత సిసోడియాపై ఉంది. ఆయనకు బెయిల్ మంజూరు చేయండి' అని కోర్టుకు విన్నవించారు. అయితే సీబీఐ వ్యతిరేకించింది. 'ఆయన విదేశాలకు పారిపోకపోవచ్చు. కానీ సాక్ష్యాలను ధ్వంసం చేసే ప్రమాదముంది. నిరంతరం ఫోన్లు మార్చిన వ్యక్తి అమాయకుడు కాబోరు. సాక్ష్యాలను చెరిపివేసేందుకు యత్నిస్తారు. ఈ కేసులో చార్జిషీట్ దాఖలుకు 60 రోజుల గడువు ఉంది. సిసోదియా బయటకు వస్తే దర్యాప్తు పక్కదారి పడుతుంది. సాక్షులను ప్రభావితం చేసే అవకాశ ముంటుంది' అని సీబీఐ వాదించింది. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది.

అతనిలో సంస్కరణకు అవకాశం ఉంది

- మరణశిక్షను 20 ఏళ్ల జైలు శిక్షగా మార్చిన సుప్రీం
- బాలుడి అపహరణ, హత్య కేసులో తీర్పు

న్యూదిల్లీ : 2009లో తమిళనాడులో ఏడేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి హత్య చేసిన వ్యక్తి మరణశిక్షను 20 ఏళ్ల జైలుశిక్షగా సుప్రీం కోర్టు మంగళవారం మార్పు చేసింది. అతను ఘోరమైన నేరం చేసినప్పటికీ అతనికి సంస్కరణకు అవకాశం ఉందని తెలిపింది. ఆ వ్యక్తి నేరాన్ని అనుమానించాల్సిన అవసరం లేదని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంటూ, ఆ వ్యక్తికి 20 సంవత్సరాలకు తగ్గకుండా యావజ్జీవ జైలు శిక్ష విధించడం జరుగుతుందని తెలిపింది. ట్రయల్ కోర్టులో శిక్షపై విచారణ విడిగా నిర్వహించలేదని, ఉరిశిక్ష విధించే ముందు అప్పీలేట్ కోర్టులలో ఉపశమన పరిస్థితులను పరిగణనలోకి తీసుకోలేదన్న వాదనలను పరిగణనలోకి తీసు కున్న తర్వాత మరణశిక్షను తగ్గించింది. జులై 27, 2009న పాఠశాల నుంచి స్కూల్ వ్యాన్‌లో తిరిగి వస్తుండగా బాధితుడిని తీసుకువెళ్లిన సుందర్ అలియాస్ సుందర్‌రాజన్ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌పై సుప్రీం కోర్టు తీర్పు వచ్చింది. అదే రోజు రాత్రి, బాధితురాలి తల్లికి సుందర్ నుంచి మొబైల్ ఫోన్‌కు కాల్ వచ్చింది. అతనిని విడుదల చేయడానికి రూ.5 లక్షల డబ్బును డిమాండ్ చేశాడు. జులై 30, 2009న పోలీసులు సుందర్ ఇంటిపై దాడి చేసి, తర్వాత నిర్దోషిగా విడుదలైన సహ నిందితుడితో పాటు అతన్ని అరెస్టు చేశారు. బాలుడిని గొంతు నులిమి చంపి, మృతదేహాన్ని గోనె సంచిలో వేసి మీరంకుళం ట్యాంక్‌లో విసిరి నట్లు ఒప్పుకు న్నాడు. మద్రాస్ హైకోర్టు సెప్టెం బరు 30, 2010న దోషిగా నిర్ధారించి మరణ శిక్షను ఖరారు చేసింది. దీనిని ఫిబ్రవరి 5, 2013న ఉన్నత న్యాయస్థానం సమర్థించింది. మోహద్‌లోని రాజ్యాంగ ధర్మాసనం నిర్ణయం ఆధారంగా హత్యా నేరం, మరణశిక్ష విధించి నందుకు తన నేరాన్ని సమీక్షించాలని కోరుతూ సుందర్ 2013లో సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నిర్ధారించి మరణశిక్ష విధించడం వల్ల తలెత్తే సమీక్షా పిటిషన్లను బహిరంగ కోర్టులో విచారించాలని, వాటిని సర్క్యులేషన్ ద్వారా పరిష్కరించలేమని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. తన 51 పేజీల తీర్పులో సుప్రీం కోర్టు తన శిక్షా నిర్ణయాన్ని తగ్గించే పరిస్థితులను న్యాయవాదికి తెలియ జేయలేనని, అతని బంధువులు, పేద, చదువుకోని కారణంగా తన కోసం కేసును సరిగ్గా వేయలేకపో యారన్న వ్యక్తి వాదనలను పరిగణనలోకి తీసుకుంది.

దళిత, గిరిజనుల రక్షణకు ప్రత్యేక చట్టం

- ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు తప్పనిసరి
- ఉపాధి పథకానికి బడ్జెట్‌లో అన్యాయం
- విజయవాడ ధర్నాలో జల్లి విల్సన్ డిమాండ్

విశాలాంధ్ర–విజయవాడ (గాంధీనగర్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నాయని, దళిత, గిరిజనుల కోసం రూపొందించిన చట్టాలను నీరుగారుస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ విమర్శించారు. దళితులు, గిరిజనులపై జరిగే దాడులు, హత్యలకు వ్యతిరేకంగా ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. దళితులపై మతోన్మాద బీజేపీ దాడులను అరికట్టాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్, ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు, దళిత, గిరిజన ప్రజాసంఘాల అధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద మంగళవారం ధర్నా జరిగింది. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అధ్యక్షత వహించారు.

జల్లి విల్సన్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల్లో రిజర్వేషన్లు ఉండటం వల్ల దళితులు, గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు దక్కేవన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటీకరిస్తూ దళిత, గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను నిర్బంధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో 2.40 లక్షల కోట్ల రూపాయలు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.80 వేల కోట్లు మాత్రమే కేటాయించటం దుర్మార్గమని విల్సన్ విమర్శించారు. ఉపాధి హామీ చట్టం కింద ప్రతి కుటుంబానికీ 200 పనిదినాలు కల్పించాలని, కనీస కూలి రూ.400 ఇవ్వాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి... వారి అభివృద్ధికి, మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పనకు వెచ్చించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను సమగ్రంగా అమలు చేయాలన్నారు. సుప్రీం కోర్టు, హైకోర్టులలో జడ్జిల నియామకంలోనూ రిజర్వేషన్లు, సామాజిక పొందికను పరిగణనలోనికి తీసుకోవాలన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప మాట్లాడుతూ భూ సీలింగ్ చట్టాన్ని పునరుద్ధరించాలని, భూమిలేని పేదలందరికీ భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులం దరినీ క్రమబద్ధీకరించాలన్నారు. దేశవ్యాప్తంగా కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం అమలుకు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. సార్వత్రిక ఉచిత విద్యను, ప్రభుత్వ ఆరోగ్య సేవలను విస్తరించి అమలు చేయాలని కోరారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు యడ్ల గోపి, రాంబాబు, చిన్నం కాళ్లయ్య, కళింగ లక్ష్మణరావు, సంగుల పేరయ్య, కొడాలి ఆనందరావు, బీసు శాంతమ్మ, మేకల డేవిడ్, పెయ్యేల వెంకటేశ్వరరావు, కాళ్ల చిన్నప్ప, బూదాడ శ్రీనివాసరావు, జి.ప్రసాద్, రాహేల్ బాబు, ప్రత్తిపాటి రాజు, కేవీపీఎస్ నాయకులు జి.నటరాజ్, గుండిమెడ క్రాంతికుమార్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

చోక్సీపై రెడ్‌నోటీసు పునరుద్ధరణ

- ఇంటర్‌పోల్ నిర్ణయంపై పున:సమీక్షకు సీబీఐ సూచన
- నాలుగు నెలల తర్వాత స్పందించిన దర్యాప్తు సంస్థ

న్యూదిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)కి రూ.13వేల కోట్లు ఎగవేసి విదేశాలకు పలాయనం సాగించిన వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీపై ఉన్న రెడ్‌కార్నర్ నోటీసును ఇంటర్‌పోల్ రద్దుచేసింది. ఈ ఆదేశాలు ఉపసంహరించుకొని చోక్సీపై రెడ్ నోటీసును పునరుద్ధరించాలని ఇంటర్‌పోల్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కోరింది. ది కమిషన్ ఫర్ కంట్రోల్ ఫర్ ఇంటర్‌పోల్స్ ఫైల్స్ (సీసీఎఫ్)నే ఇంటర్‌పోల్ కమిటీ అని కూడా అంటారు. ఫ్రాన్స్‌లోని లియోన్‌లో ఉన్న ఇంటర్‌పోల్ ప్రధాన కార్యాలయంలో చోక్సీ పిటిషన్ దాఖలు చేయగా రెడ్ నోటీసు జాబితా నుంచి ఆయన పేరు తొలగిస్తూ నిర్ణయం వెలువడింది. సీసీఎఫ్ నిర్ణయంపై మీడియా నివేదికలు దేశంలో రాజకీయ దుమారాన్ని సృష్టించగా సీబీఐ మంగళవారం ఒక ప్రకటనలో సీసీఎఫ్ నిర్ణయం ఉపసంహరణ–చోక్సీపై రెడ్ నోటీసు పునరుద్ధరణకు డిమాండ్ చేసింది. వాంటెడ్ జాబితా నుంచి చోక్సీ పేరు తొలగింపుపై 2022 నవంబరులో సీసీఎఫ్ నిర్ణయం తీసుకుంది. కాగా దాదాపు నాలుగు నెలల తర్వాత సీసీఎఫ్ నిర్ణయాన్ని తప్పుపడుతూ దర్యాప్తు సంస్థ స్పందించింది. ఆంటిగ్యువా, బర్బూడలో కొనసాగుతున్న అప్పగింత చర్యలను తప్పించే విధంగా వాంటెడ్ నేరగాడు మేహుల్ చినుభాయి చోక్సీ యత్నిస్తున్నట్లు సీబీఐ అధికారిక ప్రకటనలో పేర్కొంది. తద్వార భారత్‌లో చట్టబద్ధ చర్యల నుంచి తప్పించుకోవాలని ఆయన చూస్తున్నట్లు పేర్కొంది. ఊహాజనిత సంకేతాలు– రుజువుకాని అంశాల ఆధారంగా సీసీఎఫ్ ఐదుగురు సభ్యుల కమిటీ... చోక్సీపై రెడ్ నోటీసు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుందని సీబీఐ పేర్కొంది. ఈ తప్పుడు నిర్ణయాన్ని సరిచేసేందుకు ఉన్న అవకాశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. తాము అన్ని అంశాలను పరిగణ నలోకి తీసుకున్న తర్వాత ఈ నిర్ణయానికి వచ్చామని సీసీఎఫ్ స్పష్టంచేసింది. చోక్సీ విచారణ పారదర్శకంగా సాగబోదని తమ నిర్ణయంలో ఎక్కడా లేదని వెల్లడించింది. కొత్త సమాచారం, నిర్ణయంలో తీవ్ర తప్పిదాల దృష్ట్యా సీసీఎఫ్ నిర్ణయంపై సమీక్షకు సీబీఐ యత్నిస్తున్నట్లు అధికారిక ప్రకటన పేర్కొంది.

ఇంటర్‌పోల్ డేటాబేస్ నుంచి మేహుల్ చోక్సీ పేరు తొలగించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేసినట్లు ప్రతిపక్ష కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఆయనపై రెడ్ నోటీసులను రద్దు చేయాలని దుయ్యబట్టింది. ప్రతిపక్షాలే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), సీబీఐ లక్ష్యం... 'మిత్రులకు' పూర్తి స్వేచ్ఛ అంటూ ఘాటుగా విమర్శించింది. 'ముందు దోచుకోవడం.. తర్వాత శిక్ష లేకుండా తప్పించుకోవడం... ఇదే 'మోదానీ' నమూనా' అని మోదీ ప్రభుత్వానికి చురకలు అంటించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే స్పందిస్తూ ఇటువంటి నేరస్తులకు రక్షణ కల్పించే వారు దేశభక్తి గురించి మాట్లాడటం హాస్యాస్పదం' అని అన్నారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్విట్టర్ మాధ్యమంగా స్పందిస్తూ 'విపక్షమే లక్ష్యంగా ఈడీ, సీబీఐ.... మిత్రులకు విముక్తి. ముందు దోచుకోవడం.. తర్వాత శిక్ష లేకుండా తప్పించుకోవడం... ఇదే 'మోదానీ' నమూనా' అని ట్వీట్ చేశారు. పార్లమెంటుకు వెళ్లే ముందు ఖడ్గే విలేకరులతో మాట్లాడుతూ 'వాస్తవ సమస్యలపై నుంచి దృష్టిమళ్లించేలా వ్యవహరిస్తున్నారు. మన దౌత్య కార్యాలయాలపై దాడులు జరుగుతున్నాయి. బ్యాంకులను లూటీ చేసి తప్పించుకుపోయిన చోక్సీ వంటివారికి రక్షణ కల్పిస్తున్న వారు దేశభక్తి గురించి మాట్లాడటం హాస్యాస్పదం. దీనిపై కేంద్రప్రభుత్వం నుంచి స్పష్టత కోరతాం' అని అన్నారు. ఆత్మీయ మిత్రుడి కోసం పార్లమెం టును స్తంభింపజేసే వారు.... ఐదేళ్ల కిందట పలాయనం సాగించిన పాత మిత్రుడికి సాయం చేయరా అంటూ అంతకుముందు హిందీలో ఖడ్గే ట్వీట్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

విశాలాంధ్ర
బుధవారం
22, మార్చి 2023

ఉగాది ప్రత్యేకం

చైత్రశుద్ధ పాడ్యమి నుండి తెలుగువారికి కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. కన్నడ ప్రజలు కూడా ఈ చైత్రశుద్ధ పాడ్యమి రోజును 'ఉగాది'గా వ్యవహరిస్తున్నారు. మరాఠీయులు 'గుడిపఢ్వా'గా పిలుస్తున్నారు. సింధీలు 'చేతిచాంద్'గా, మణిపూర్ వాసులు 'సజీబు చైబోరా'గా పిలుచుకుంటున్నారు. మారిషస్‌లో కూడా కొందరు ఈరోజునే కొత్త సంవత్సరపు తొలిరోజుగా, మన మాదిరిగానే పండుగ చేసుకుంటారు. తమిళనాడులో 'చిత్తిరాయ్' అని, కేరళలో 'విషు' అని పిలుస్తూ కొత్త సంవత్సరం తొలిరోజుగా ఈ పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

తొలి తెలుగు పండుగ... ఉగాది

పండుగ విధి విధానాలు..

ప్రస్తుతం సంగతి ఎలా ఉన్నా గతంలో అయితే పదిరోజుల ముందుగానే పండుగ సందడి ప్రారంభమయ్యేది. అల్లుళ్లకు.. ముఖ్యంగా కొత్త అల్లుళ్లకు పిలుపులు వెళ్లటం, కొత్త బట్టలు కొనడం, పిండివంటల ఆలోచనలు, ఏర్పాట్లు, పిల్లల ఉత్సాహాలు చూడవలసిందే. ఆ రోజు ఉదయాన్నే అభ్యంగన స్నానాలయ్యాక కొందరు నేరుగా నూతన వస్త్రాలు ధరిస్తే, మరికొందరు పూజానంతరం కొత్త బట్టలు వేసుకుంటారు. పండుగ రోజున నూతన పంచాంగ పూజ, పెద్దలు, గురువులు, పండితుల ఆశీర్వాదాలు పొందాలని మన పూర్వులు సూచించారు. చాలామంది వీటిని ఇప్పటికీ పాటిస్తున్నారు. తెలుగింట కళ్లాపి, రంగవల్లులు, మామిడాకుల తోరణాలతో తెల్లవారుతుంది. ఆపైన కొత్త అల్లుళ్ల మర్యాదలు ఆరంభమవుతాయి. పండుగశోభ ప్రతి ఇంట కనిపిస్తుంది.

ఉగాది పచ్చడి

ఈ రోజున 'నింబ కుసుమ భక్షణమ్' ముఖ్యమని పెద్దలు చెబుతారు. అందువల్ల వేపపువ్వు, చిన్నగా తరిగిన లేత మామిడికాయ ముక్కలు, తగినంత కొత్త చింతపండు పులుసు, కొత్తబెల్లం, చిటికెడు ఉప్పు, చిటికెడు మిరియాల పొడి కలిపి ఉగాది పచ్చడిని తయారుచేస్తారు. ఈ దేశ చరిత్ర ఆరంభం మిరియాలతోనే ఆరంభమైందని చరిత్ర చెబుతోంది. అయితే అవగాహన లేక కొందరు పచ్చి మిరపను కలుపుతారు. చిన్నపిల్లలు తినలేరని కొందరు అరటిపండును జోడిస్తారు. అలా షడ్రుచులతో తయారైన ఉగాది పచ్చడితోనూ ఆ సమయంలో దొరికే అన్ని రకాల ఫలాలను నైవేద్యంగా ఉంచడం సంప్రదాయంగా వస్తోంది.

వేపపువ్వు చేదుని, బెల్లం తీపిని, మామిడి వగరుని, భవిష్యత్తులో జీవన మాధుర్యాన్ని, చింత పులుపు జీర్ణశక్తిని, తద్వారా ఆరోగ్యాన్ని, ఉప్పు భయాన్ని, మిరియాలు ఘాటుని, తద్వారా ఇవన్నీ కలిసి శరీరానికి సమతౌల్యం ఇస్తాయని, ఈ షడ్రుచుల సమ్మేళనంతో, సంవత్సరం పొడవునా ఎదురయ్యే కష్టసుఖాలను, ఎత్తుపల్లాలను సమదృష్టితో చూస్తూ ముమ్ముందుకు సాగాలని మన పూర్వులు చెబుతుండేవారు.

పంచాంగ శ్రవణం

మన ఇళ్ల లోగిళ్లలో, గుడుల్లో, నలుగురూ కలిసే రచ్చబండలపైన ఉగాది రోజు సాయంకాలం కొత్త సంవత్సర పంచాంగంలో విశేషాలను వినేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకునేవారు. మనది చాంద్రమానం ప్రకారం గుడించబడిన పంచాంగం. ఇందులో తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలనే ఐదు అంగాలతో కూడి ఉండటం వల్ల ఈ పేరు వచ్చింది. శాలివాహన శకం ప్రకారం మనకు అరవై సంవత్సరాలు ఉన్నాయి. ఒక సంవత్సరం పూర్తయి, మరొకటి ప్రారంభమయ్యే తొలిరోజునే ఉగాదిగా మనం స్వీకరించాం. సౌరమానం ప్రకారం గుణిస్తే తమిళనాడు, కేరళ రాష్ట్రాలు మాదిరి సుమారు మూడు నుండి 20 రోజులు తేడా రావచ్చు. ఏది ఏమైనా తెలుగువారి సంప్రదాయం ప్రకారం పురోహితులు రాజు, మంత్రి, సైన్యాధిపతి, మేఘాధిపతి మొదలైన గ్రహస్థితులను తెలుపుతూ, ఆయా గ్రహాలవల్ల రాబోయే దేశ కాల పరిస్థితులను అంటే వర్షాలు ఎలా పడతాయి, పంటలు ఏ మేరకు పండుతాయి, ధరల హెచ్చుతగ్గులు, పాలన ఏ విధంగా ఉంటుంది అనే విషయాలను విడమర్చి చెబుతారు. మన జన్మ నక్షత్రాలనుబట్టి పన్నెండు రాశులవారి ఆదాయం, వ్యయం, రాజ్యపూజ్యం, అవమానం, ఆరోగ్య విషయాలు కూడా తెలుస్తాయి. సంవత్సరంలో కలిగే సూర్యచంద్ర గ్రహణాలు, ఆ సంవత్సరంలో ఏ నదికి ఎప్పుడు పుష్కర ప్రవేశం కలిగేది లాంటి అనేక విషయాలను పంచాంగ శ్రవణంలో తెలుసుకుంటాం.

కవితా గోష్ఠి

ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుతుంటారు. గత కొన్ని సంవత్సరాలుగా తెలుగునాట, ఉగాదినాడు చిన్నా, పెద్దా కలిసి మనోల్లాసంగా కవిత, పద్యపఠనాలు చేస్తూ పరిచయాలు, స్నేహ సౌహార్ద్రాలు అభివృద్ధి చేసుకుంటున్నారు. ఆసక్తి, ఉత్సాహం ఉన్న యువతకు ఈ కార్యక్రమం ఓ పునాది రాయిలా పనిచేసి, చాలామందిలో ఉత్సాహాన్ని నింపి, వాళ్ల సాహిత్య అభివృద్ధికి తోడ్పాటునిస్తున్నది. మొట్టమొదటగా ఈ ఆలోచన వచ్చి, అమలుజరిపిన వారికి అభినందనలు తెలుపవలసిందే.

ఉగాదికి స్వాగత గీతం

చలసాని వెంకట రామారావు.
9490952093.

చైత్ర శుద్ధ పాడ్యమి తేరులోన
వసంత కోయిలమ్మ అతిథిగా వచ్చింది.
తీపి వగరు చేదు కారం ఉప్పు పులుపు
షడ్రుచులను కలగలిపి ఉగాది పచ్చడిగా
తెచ్చింది.
ఆనంద నవ వసంతం
కష్టసుఖాలను కలిమిలేములను
కావడి కుండలుగా తెచ్చింది

ఎక్కడమ్మా! వసంత కోయిలమ్మా!
పచ్చదనంతో పరవశించే పల్లెలు
నునులేత మామిడి తోరణాల గవాక్షాలు
మమతాను రాగాల క్రాంతి పథాలు
వేప పూల పరిమళ సుగంధాలు
కోయిల గాన సుధా విపంచికలు
ఉషస్సులు లేని ఓ ఉగాది
ఇదే నీకు నా స్వాగత గీతం

ప్లాస్టిక్ తెచ్చిన పాపంలో పర్యావరణం
ఎండుతున్న ఆశల తోరణాల కొత్త చిగురులు
ఎందుకమ్మా ! ఈ స్మశాన నిశ్శబ్దం
పోలీసు రాజ్యపు కర్కసత్వం ఏమిటమ్మా !
నెర్రలిచ్చిన తెలుగు నేలలో
తూర్పున తొలి పొద్దు పిలుస్తోంది !
అరుణబింబమై స్వాగతిస్తోంది !!
XXX XXX XXX
శ్రీ శోభకృత్ నామ ఉగాదీ
ఋతువుల రాణి వసంతమా
కావాలి ఈ కొత్త సంవత్సరం
ప్రజలందరికీ శుభసంకల్పం
శిశిరానికి సెలవంటూ
వసంతాన్ని స్వాగతిద్దాం !
సామ్యవాద సమసమాజ
కోయిల గాత్రంతో స్వాగతిద్దాం!!

షడ్రుచుల సేవనం - శోభాయమానం
ఉగాది పచ్చడి

తెలుగు సంవత్సరాది వచ్చిందంటే మన తెలుగువారి ఇంట ఒకటే సందడి ! ప్రతి ఇంటా ఉగాది పచ్చడి ఘుమఘుమలు! జీవితంలోని కష్టసుఖాలు షడ్రుచుల వంటివనీ, ఉప్పు, పులుపు, కారం, తీపి, చేదు, వగరు మున్నగు ఆరు రుచుల్నీ ఒక్కసారే సేవిస్తే - జీవితంలో కష్టసుఖాలు కూడా ఉగాది పచ్చడి అంత సురుచికరంగా సౌకర్యవంతంగా మారి మన జీవన మనుగడకు దోహదం చేస్తాయని ఒక నమ్మిక!

చేసే విధంగా చేస్తే ఉగాది పచ్చడి అంత రుచికరమైన పిండి వంట మరొకటి ఉండనే ఉండదు! ఈశ్వరనామ ఉగాది శుభవేళ రుచికరమైన ఉగాది పచ్చడి తయారీ విధానం అందిస్తున్నాం - స్వీకరించండి!

కావల్సిన వస్తువులు:

ఒక స్పూన్ వేపపువ్వు రేకులు, చిన్న చెరకు ముక్క, చిన్న కొబ్బరి ముక్క, ఆరు అరటిపళ్ళు, నిమ్మకాయంత చింతపండు, చిన్న మామిడికాయ, 100 గ్రా. బెల్లం, ఒక పచ్చి మిరపకాయ, చిటికెడు ఉప్పు, 2 ఏలకులు, రెండు గ్లాసుల నీళ్లు.

తయారుచేసే విధానం:

ముందుగా చెరకు, కొబ్బరి, బెల్లం, మిరపకాయ, మామిడికాయలను చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని విడివిడిగా జాగ్రత్తగా పెట్టాలి. వేప పువ్వును శుభ్రపరచి రేకల్ని మాత్రం పక్కన ఉంచుకోవాలి. ఏలకలు గుండగా చేసి అట్టేపెట్టాలి. రెండు గ్లాసుల నీళ్ళల్లో చింతపండును బాగా పిసికి, పులుపు నీళ్ళను ఒక గిన్నెలోకి వడగట్టాలి. అందులో బెల్లం గుండను వేసి బాగా కలియబెట్టాలి. ఆ తర్వాత అరటిపళ్ళను బాగా ముద్దచేసి ఆ నీళ్ళల్లో కలపాలి. ఎక్కడా అరటిపండు ముక్కలు ఉండకూడదు. అందులో చిటికెడు ఉప్పు, ఏలకల గుండ, చెరకు, కొబ్బరి, మిరపకాయ, మామిడికాయ ముక్కల్ని వేసి బాగా కలపాలి. అంతే - ఉగాది పచ్చడి తయార్! నిజం చెప్పాలంటే - షడ్రసోపేతమైన పిండివంటలకంటే సమపాళ్ళల్లో తయారుచేసిన ఉగాది పచ్చడి భలే రుచిగా ఉంటుంది.

కోకిలమ్మ గోడు

పక్షిగూడు చెదిరినట్లు బతుకు చెడెను
పడెను సంతోష వృక్షాలు చెడుగువలన
పట్టెడన్నము కరువాయె పండుగలకు
మాకు యెండుగేయయ్యెను ఆకలేసి,

గూడుచెదరగా కోకిల కూయునెట్లు?
వనములేక వసంతము వచ్చునెట్లు?
బాధితుల పచ్చి హృదయాలె ద్వారములకు
తోరణాలు తీర్థములు కన్నీరులివిగో!

శోభకృత్ పేరుకర్థమ్ము సోయగమ్ము
కాని వేషభాషలు ముళ్లకంచె లిచట
తెలుగు భాషకు జాతికి తెగులు పట్ట
క్షోభలాకృతి దాల్చెను శోభకృత్తు!

ప్రకృతి తల్లి ఉదరమును తవ్వుచుండ
పంచభూతాల నమ్ము దౌర్భాగ్యులుండ
పాలకులె హింస రచనకుపక్రమించ
కాలు మోపినావమ్మ! ఉగాది నీవు!

బాంబు ప్రేలుచునుండగా పక్షులెగిరి
గోలగోలగా నరచును క్షోభజెంది
శాంతి కరువయ్యె దేశాన భ్రాంతి పెరిగె
అదురు చైత్ర రథమునెక్కి యరచుచుండె,

మద్యమును పోసి ఓటర్ల మాయజేసి
మద్యమమ్ముకొని బతుకు మాయగాళ్లు
కుంభకోణాల గోలలో గోడువినగ
కాలుమోపినావమ్మ! ఉగాది నీవు!

స్వేచ్ఛ పక్షికి రెక్కలు విరిగి పోయె
వికృతి విధ్వంస రాక్షస వేషమేసె
తెలుగు తనము పోయెను భారతీయతణగె
ఆంధ్రులార! ఉగాదికి ఆమనెట్లు?

కక్ష కార్పణ్య గూబలు దీక్షబూనె
సామరస్య కపోతముల్ జడిసిపోయె
ప్రసవవేదన పడుచుండె భరతజాతి
ఓయి! శోభకృత్ శిశువువై ఉద్భవించు,

పొరహక్కుల పికములు పాడుచుండ
స్వేచ్ఛ సుమముల గంధము వీచుచుండ
సగటు మానవులనెడు వృక్షములు పెరుగ
రమ్ము! చైతన్యరథమున రా! ఉగాది!

డాక్టర్ లగడపాటి సంగయ్య
చరవాణి:9490769242.

నా ప్రతిపాదన

శుభకృత్‌ని మించి శోభకృత్ శోభాయమానంవగావస్తోందని
వసంతానికై వేయికళ్లతో ఎదురుచూస్తున్నవేళ
వడగండ్లవానొచ్చి కడగండ్లుమిగిల్చింది!
ఇక రాలుగాయలతోనే ఉగాదిపచ్చడికదా ఈసారి!?
వేపపువ్వుకై వెదకబోతే ఔషధవృక్షాలైన
వేపచెట్లు చిగుళ్లు ఎండిపోయే
తెగుళ్లొచ్చి నిర్వేదంగా నిలబడి కనిపించాయి
పువ్వెలాదొరుకుతుందీ!?
కొత్తచింతపండు సెంచరీకొట్టి కొండెక్కికూర్చుంది!

- ఉప్పల అప్పలరాజు

శోభకృత్ ఉగాదికి స్వాగతం...సుస్వాగతం

మోడువారిన తరువులన్నీ
చిగురుటాకుల చీరగట్టీ
పూలమోమున నవ్వు నవ్వుచుండగ.
పూల పుప్పొడి పరిమళాలు
పిల్లతెమ్మెర వీచుచుండగ.
మావిచిగురుల్ మెసవి కోకిలల్
స్వాగతించుచు గీతములాలపించగ
పుడమితల్లికి పూలపందిరి
పరవసిస్తు ప్రభలు గురియగ.
చైత్రశుద్ధ పాడ్యమందున
వచ్చెవచ్చె శోభకృత్ ఉగాది
సంతసంబుగ సంబరంబుగ
శిశిరం దుశ్శాసనుడిలా వృక్షకాంతల పత్రవస్త్రాలూడ్చగ
వసంత కృష్ణుడవై వృక్షకాంతలకు
చిగురుటాకుల వస్త్రదానం చేశావు
మహోపకర్తవై వృక్షకాంతలను రక్షించావు
అన్నమో రామచంద్రా అనే అన్నార్తుల ఆర్తనాదాలాలకించు.
వరాల వర్షాలు కురిపించీ పాడిపంటల సంవృద్ధితో
పుడమితల్లిని పులకింపజేయి
అమ్మబోతే అడవి కొనబోతే కొరవిలా ఉండే
రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించూ
కులమతాల భేదాల్ని అంతంచెయ్యి
ఉగ్రవాదాన్ని సమగ్రంగా నిర్మూలించు.
నానాటికి తీసికట్టు నాగంభట్లన్నట్లు
అంతకంతకుపెరిగె నిరుద్యోగ భూతాన్ని మట్టుబెట్టు.
ఆకాశమంటిన ధరవరలను అతకరించీ భూమార్గం పట్టించు
లంచగొండితనం రూపుమాపే విధంగా
ప్రజల్లో నైతిక విలువల్ని జాగృతం చెయ్.
గెలిచినదానికిఎత్తిన చెయ్యి దించక
గెలిచినాకప్రజలనెత్తిన చెయ్‌పెట్టే
నాయకంమన్యు లాటకట్టించు
ఎన్నిచట్టాలు పెట్టినా ఇంకా చక్కబడని అబలల బతుకులలో
వెన్నెల సిరులు కురిపించు.
అహర్నిశలూ కష్టపడి చదివే విద్యార్థులకు విజయాలనందించు
నీడలేని తాడిత స్వామినీ
మేడలోని ధనస్వామికీ సఖ్యంచేసే
సంపద సమంగా పంచుకొనీ
తరతమ భేదంలేకుండా సఖ్యం చేయనినాడు
ఎన్ని ఉగాదు లొచ్చినా.ఎన్ని ఉషస్సు లొచ్చినా
ఏదీ నిండు ఏదీ పండుగ.

ఈమనిశేషయ్య, 9177080045

- శిఖాఆకాష్

కనిపించని వేగంపల్లం నుండి
ఎత్తులకుకాళ్లు లేకుండానే
పరిగెడుతూ ఉంది.
వర్తమానమొక అన్ స్టాప బుల్
వాటర్ ఫాల్స్.
కోకిల ఏ భాషలోనైనా
మధురం గానేకూస్తుంది.
శిశిరం ఏ దేశంలోనైనా
కొత్త దుస్తులుతొడుక్కుంటుంది.
ప్రకృతి గొప్పకాస్ట్యూమ్ డిజైనర్.
వసంతాగమనంకొత్త కవిత్వం చెబుతుంది.
వసంతానిదిపొయిటిక్ ఏమోషన్.
ప్రకృతిని మించినగొప్ప కవయిత్రి ఎవరు?
చెట్ల ఆశలు ఫలించే రోజు.
పూల కలలు వికసించే రోజు.
పక్షుల గొంతులు చిగురించే రోజు.

శ్రమ ఏ దేశంలోనైనా ఉప్పగానే ఉంటుంది.
భ్రమఏ దేశంలోనైనా ఉచితంగానే
లభిస్తుంది.
అందంగానే ఆకర్షిస్తుంది.
ఇది అందమైన కలల కాలం.
వర్తమానమొక గందరగోళం.
భవిష్యత్తు ఒకసుందర పాతాళం.
ఏ వర్షంలోనైనామెరుపులు,
పిడుగులు ఉంటాయి.
శోభకృత్ షడ్రుచుల సంగీతం.
జీవితమొక పండుగో..దండగో ..

అనగనగా ఒకానొక మరణ వాంగ్మూలం

తేల్చుకో మంటుంది.
నెమరు వేసుకోవడానికి ఏముంది?
పునర్ ముద్రణలేని కాలం
మౌన సంపుటి.
లోపలో పాటల దీపం.
దీని లేత పెదాల్ని తనివి తీరా
ముద్దాడితే గాని
దాని చూపుల నూరు వసంతాల
పువ్వొకటి తాకివాన సీతాకోక పద్యం ఇంత వెన్నెల
మడుగయ్యింది.
పునర్జన్మ లేని మరణానికి జ్ఞాపకాలే మరో జన్మ
పిట్టలు పలకరించని చెట్టు.
ఇంటిని చూడని దీపం.
పొద్దు తిరుగుడు పువ్వు బతుకు.
ఎక్కడో లయ తప్పిన నాదం.
వేదాంగం పగిలిన మృదంగం.
దారిద్ర్యమే ఏ రాజ్యానికైనా
శాశ్వత పథకం.
సంక్షేమం ఓటుబ్యాంకు.
ఆర్థిక సంక్షోభమే అభివృద్ధి ట్యాంకు.
ఓటు వేసే వాడెప్పుడూఓడిపోవడమే
ప్రజాస్వామ్యం!?
తామరాకు మీద మంచు పువ్వు ఏకాంతం.
మోసుకొస్తుందో మృత్యు సంగీతం.
ఉగాది పచ్చడి ధరపలుకుతోంది.
కార్పొరేట్ కలలుదేశాన్ని వ్యభిచార
కేంద్రంగా మార్చాయి.
పంచాంగానికికుజదోషం ఉందని
ఆకాశరామన్న ఉత్తరం.
కాలానికి దిక్కు తోచక
తిక్క తిక్కగాపాతపాటే
అర్థంకాని భాషలోహైటెక్కు శృతిలో ఆలపిస్తుంది.
మనుధర్మ శాస్త్రంరంగీలా పాడుకుంటూరథమెక్కి వస్తుంది.
హత్యలు,ఆత్మ హత్యలూ
మతం వాసన వేస్తున్నాయి.
వివక్ష పేరు ధర్మస్థాపన.
పిట్టలు, పువ్వులూ
కులం జెండా పట్టుకుని
ప్రపంచ యాత్ర కుబయల్దేరాయి.
రాజ్యాంగాన్నికిడ్నాప్ చేస్తూ
ఆరెంజ్ కలర్ గూండాలు.
దేశాన్ని తాకట్టు పెడుతూ
కాషాయం కంచర గాడిద.
ఇప్పుడు రాజ్యం కార్పొరేట్ పిల్లుల్ని
డాన్ లు చేసివాళ్ల కాపలా కుక్కల్లా
చెప్పులు నాకుతున్నారు.
రెప్పపడని రేతిరి మధ్య నిద్ర ఎంత
కుమిలిపోయిందో..?!
ఎన్నెన్ని క్షణాలుఏ ఏ దారులుగా
విడిపోయాయో?!
దిక్కులేని నీడల కింద
ఏ రుతువుల్ని ఆరబోయాలి?
పాటల ఆనవాళ్లేని
వసంతాలతో పనేంటి?
ఏ స్పర్శా వెలిగించలేని పరిమళాల్ని
ఏ స్వప్న శాలకు ముఖచిత్రం చేయను?
ఏ అంతరాంతర
సీతాకోక దుఃఖంలోంచి నేనవ్వగలను?
చూపులు కాలిపోయాక
ఇక్కడ మనిషి చుట్టూ
ఎన్ని సుఖ స్వప్నాల సౌందర్య తీరాలున్నా...
ప్రతి మాటా రక్తం కక్కుకుంటుంది.
మట్టి కూడా మరణాన్ని మోయలేక
మూగబోతుంది.
కాలం వాయిదాలు వాయిదాలుగా
నిత్య నూతనంగా
ఆధునిక మరణాన్ని అనుభవిస్తుంది.
ఇవి వెన్నెల వసంతం కాదు.
సూర్యోదయంచీకటి జైల్లో
మగ్గిపోతున్న దారుణం.
వసంతాలు వస్తాయి, పోతాయి.
మనిషి పతనంలా.
పండుగల పటాటోపాలతో..
పాలకుల పాపాలతో..
ఇప్పుడు ఇక్కడ
మాలిన్యాలను కడిగేందుకు
మిగిలినవన్నీకల్తీ కన్నీళ్లే, నీళ్ల పాలే.
వసంతం ఒకమరణ వాంగ్మూలం.
భవిష్యత్తు ఒక సంతోషం ముసుగేసుకున్న
దుఃఖ సమీరం.
ప్రకృతిని జైల్లో పెట్టాలంటూ
ఒక బుల్డోజర్ భాష.
ఇక ఎప్పటికీ మిగిలేది
ఓకే ఒక్క సమరమే.

పచ్చడి పండగ

మన జీవితకాలంలో ఒక సంవత్సరం వ్యయమైపోయింది. ఏటా చెప్పకున్నట్లు గానే గత సంవత్సరాదినాడు కూడా "ఈ సంవత్సరం వృథా (వ్యయం) కాకూడదు" అనుకునే ఉంటారు చాలామంది. కానీ ఆ సంకల్పమూ షరా మామూలే అయింది కాదూ!

కాలం ఎంతగా మారిపోతున్నా, వసంతరుతువులో ప్రకృతి అంతా ఒక్కసారిగా ఆకుపచ్చని చీరకట్టుకుని సాక్షాత్కరిస్తుంది. ఆ సాక్షాత్కారంలో వచ్చేదే 'ఉగాది' పండగ...

...పచ్చడి మెతుకులా? అంటారుగానీ, ఈ ఉగాది పండగ మాత్రం అచ్చంగా పచ్చడి పండుగే. ఇది చింతకాయ పచ్చడి లాంటిది కాకపోయినా 'భాష్యం' మాత్రం 'పాతచింతకాయ పచ్చడే' అనిపిస్తుంది. అయితే సదరు పాతచింత కాయ పచ్చడి విలువ తెలిసిన వారెవరూ అంత తేలికగా తీసిపారేయలేరు కూడా.

జీవితం షడ్రుచుల సమ్మేళనం అని తెలియజెప్పడానికే ఉగాదిని పచ్చడితో ప్రారంభిస్తున్నాం. ఆరు రుచులకూ ప్రతీకలైన కొత్తబెల్లం, కొత్త చింతపండు, లేత మామిడిపిందె, లేలేత వేపపువ్వు, ఘాటిచ్చే మిరియం (లేదంటే కొత్తకారం) కలగలిపి చేస్తారీ పచ్చడిని. పచ్చడి గనుక ఉప్పు ఎలాగూ చేర్చకతప్పదు. అంతేనా? ఇవి కేవలం షడ్రుచులు మాత్రమే కాదు. ఒక్కొక్కటి ఒక్కొక్క విధంగా శారీరక రుగ్మతలను దూరం చేస్తుంది. అసలు ఆ మాటకు వస్తే మన పూర్వీకులు నెలకొల్పిన ఏ సంప్రదాయం మాత్రం శాస్త్రీయమూ, ఆరోగ్యదాయకమూ కాదు గనుక.

అదలా ఉంచితే, మన ఉగాదినే మహారాష్ట్రలో 'గుడిపడవ' పేరుతో ఇంద్రుణ్ణి పూజిస్తారు. ఈ సందర్భంలోనే మరో ముచ్చట స్ఫురణకు వస్తున్నది. ఇలా 'ఇంద్రధ్వజ' పూజలు జరపడాన్ని నిరసించి 'గోపూజ'కు శ్రీకృష్ణుడు శ్రీకారం చుట్టాడని ఆగ్రహించిన ఇంద్రుడు వరుణిని ప్రేరేపించి కుంభవృష్టి కురిపించగా శ్రీకృష్ణుడు గోవర్ధనం ఎత్తి, తన వారినందరినీ కాపాడుకున్నాడని పురాణ కథ. ఈయన 'గిరిధారి' కావడం వెనుక ఉన్న కథ అదేనంటారు. బెంగాలీలకూ ఆనాడే ఉగాది. వారు 'డోలాయాత్ర' పేరిట కృష్ణుణ్ణి పూజిస్తారని తెలుస్తున్నది. పంజాబ్ విషయానికి వస్తే వారు 'హోలీ'నాడే సంవత్సరాది వేడుకలు జరుపుకుంటారు. మనకు మొత్తం అరవై సంవత్సరాలని ఒకలెక్క. ఈ అరవై పూర్తికాగానే మళ్ళీ చక్రభ్రమణం మొదలవుతుంది. క్రైస్తవంలో సంవత్సరాలకు అంకెలే తప్ప పేర్లున్న దాఖలాలు లేవు. కానీ జపాన్, చైనాలాంటి దేశాలలో కూడా సంవత్సరాలకు పశుపక్ష్యాది నామాలున్నట్లు చెప్పుకుంటుంటారు. అలాంటి వాటిలో గార్ధభం, శునకం, వరాహం వగైరా కూడా ఉంటాయని విన్నాం. మనకున్న అరవై సంవత్సరాలు ప్రభవతో మొదలై క్షయతో ముగుస్తాయి. ప్రభవ అంటేనే ప్రారంభం, పుట్టుక అనే అర్థాలున్నాయి కదా! 'ప్రభవించడం' అనే పదం వాటికి సంబంధించినదేమరి. అలాగే క్షయ అనేది 'క్షీణత'ను అంటే ముగింపును సూచిస్తుంది. ఈ పేర్లకు సంబంధించి ఒక తమాషా వాదన ఉంది. నారదమహర్షి విష్ణుమాయలో పడి వివాహం చేసుకుని అరవైమంది సంతానాన్ని కని మాయ తొలగగానే తిరిగి సన్యసించాడని, ఆ అరవైమంది పేర్లే ఈ ప్రభవ, విభవ వగైరాలని కొందరు పేర్కొంటుంటారు కదూ, అరవైమందీ కృష్ణసంతానమనేది మరికొందరి విశ్లేషణ. దేనికీ తగిన ఆధారాలు లేవనేది వర్తమానంలో మరికొందరి కథనం.

ఏది ఏమైనా కథలూ, గాథలూ మాట ఎలావున్నా మనిషి జీవన విధానంలో విలువలను చొప్పించడం కోసం, ఆరోగ్యంగా జీవించడం కోసం పండగల పేరుతో కొన్ని విలువలను, ఆచార సంప్రదాయా లనూ పూర్వీకులు నిర్దేశించారు. మామూలుగా ఉత్త రోజుల్లో వేపపువ్వు తినమంటే ఎవరైనా తింటారా? తినంగాక తినం! ఉగాది పచ్చడి అనగానే ముఖం అదోలా పెట్టి అయినా కాస్తంత చప్పరిస్తాం. ఆనాడు పాటించే ఆరోగ్య సూత్రాల దృష్ట్యా ఆ మాత్రం వేపపువ్వు కడుపులోకి వెళ్లినా చాలు ప్రయోజనం ఉండేది. ప్రత్యేకించి కడుపులో నులిపురుగులను హరింపచేసే శక్తి ఆ వేపపువ్వుకు ఉందన్నది ఆయుర్వేద శాస్త్రం చెబుతోంది. ఇప్పుడు మనం నానాపేర్లతో తినే నానారకాల 'గడ్డి'కీ ఆ వేపపువ్వు చాలదనుకోండి. కానీ ఒక్క విషయం మాత్రం మనం గుర్తుపెట్టుకోవాలి. పండుగలు, ఆచారాల వెనుక ఒక బలీయమైన, శాస్త్రీయ పరమార్థం లేకపోలేదు. అది గమనించాలి!

చిగురించే ప్రభాతం

చీకటి దాగిన క్రాంతిపథం వెడలిపోతోంది
వెలుగు పూసిన శాంతి రథం కదలి వస్తోంది
కనులు తెరిసిన అందలమె కలిసి వస్తోంది
కలలు విరిసిన అంబరమే తోడు అంటోంది .

లే చిగురుల క్రొత్త ఆశల సంధ్యారాగం
లేత గాలుల తెలి ఉషస్సుల స్వర్ణగానం
ఎలకోయిల తొలి మామిళ్ళ భావగీతం
కొండ కోనలు చిగురించే హృదయ తరంగం

స్వాగతించే వసంత ఆగమనం
పులకించే శోభ కృత్ నామ వత్సరం
కురిసే ప్రభాతాల శుభాకాంక్షల చిరుజల్లులే
కలిసే ఆత్మీయతా అభిమానాల చిరునవ్వులే

తొంగి చూచేనా తెలుగింటి తోరణాలు
పరవసించేనా రసరమ్య సోయగాలు
ఇల్లిల్లూ మెరిసే అనుబంధాల కోకిలలు
ముంగిట మురిసే అనురాగాల కొవెలలు

విరిసే సుప్రభాతాల అరుణ కాంతులే చూడు
పొంగే ఊహల హరివిల్లులే తోడు
చిందే కలల ప్రతిరూపాల గూడు
పిలిచే షడ్రుచుల తెలుగులోగిళ్ళే నేడు.

ఎస్ .కె .డి.ప్రసాదరావు
అడ్వకేట్ ,నూజివీడు, 9866218299

శోభకృతునకు స్వాగతం
శుభ ప్రదాతకు సుస్వాగతం

మా కలలకు ఆకృతి నీయ,
మా వెతలకు పరిష్కృతి చూప,
మా ఆశల సఫలీకృతము సేయ
మా భవిత కు శోభాలంకృతిగా
సాక్షాత్కరించిన బహుమతి గా
అరుదెంచిన శోభకృతు నకు
మనస్పూర్వక నమస్కృతులివే
మంగళ కర జయధ్వానాలివే

శోభకృతు వత్సరమంతా
వసంత ఋతువై సాగాలి
ప్రకృతి మాత కటాక్షంతో
సంక్షేమం విరబూయాలి
జనులంతా ఏకీకృతమై
మమతా శిఖరంగా ఎదగాలి
మానవతకు అనుకృతి గా
మన సంస్కృతి పరిమళించాలి
ఘన చరిత ను రచించాలి.

- డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.
94408 36931.

ఉగాది

అమ్మా నాన్న, అన్నాచెల్లి, అత్తామామ, తాతమామ్మ....ఇలా అందరూ కలిస్తేనే కుటుంబం! జయాపజయాలు, సుఖదుఃఖాలు, మంచీచెడు, ఇష్టాఇష్టాలు.... ఇలా అన్నీ కలిస్తేనే జీవితం...! ఒంటరిగా ఉండే మనిషి ఉన్నా లేకున్నా ఒక్కటే! అందుకే- మనిషి సంఘజీవి! ఏ అనుభూతిలేని మనిషి ఉన్నా లేనట్లే!- ఇదే చెబ్తుంది! ఉగాది

ఇంగ్లీషు నెలల ప్రకారం జనవరి ఫస్టున నూతన సంవత్సరాదిని జరుపుకుంటే, మన తెలుగు నెలల ప్రకారం చైత్ర శుద్ధ పాడ్యమి నాడు తెలుగు సంవత్సరాదిని జరుపుకుంటాం! దీన్నే ఉగాది అనీ యుగాది అనీ పిలుస్తాం! మన తెలుగు సంవత్సరం చైత్ర మాసంతో ప్రారంభమౌతుంది.. వింధ్య పర్వతానికి దక్షిణానగల ప్రాంతంలో సౌరమాన లేదా చాంద్రమాన సంవత్సరంగా పరిగణిస్తే, వింధ్య పర్వతానికి ఉత్తరం వైపుగల ప్రాంతంలో బార్హస్పత్యమాన సంవత్సరంగా భావిస్తారు. ఈ కాలాన్ని సూర్యగమనాన్ని బట్టి లెక్కలేస్తారు.సూర్యుడి నడకను బట్టి, గ్రహరాసులలో కలిగే తేడాలను బట్టి...భూత భవిష్యత్ వర్తమానాలలో జరిగే విషయాలను అంచనా వేయడాన్నే జ్యోతిష్యంగా చెప్పవచ్చు. సూర్యగమనాన్ని బట్టి గ్రహరాసులలో కలిగే తేడాలను అంచనావేస్తూ...శుభాశుభ ముహూర్తాలను నిర్ణయిస్తారు. ఇదే పంచాంగం. తెలుగు సంవత్సర ప్రారంభం...కొత్త పంచాంగ శ్రవణం...తెలుగింట అమలయ్యే ఒక సదాచారం!

జనవరి ఫిబ్రవరి నెలల్లో చెట్లు ఆకులు రాల్చుతాయి. మార్చి ఏప్రిల్ నెలల్లో మోడువారిన చెట్లు చిగురించి పచ్చపచ్చగా, ఎర్రెర్రగా తెల్లతెల్లగా రకరకాల పువ్వులు పూస్తాయి. పసుపు సున్నము కలిపిన ఎర్రనీళ్ళల్లా ప్రకృతి వసంత శోభాయమాన మౌతుంది. అందుకే- దీనిని వసంత కాలమని కూడా సంబోధిస్తారు. లేతమామిడి ఆకులు, అప్పుడప్పుడే లేత మామిడి పిందెలు... కోయిల గానంతో ప్రకృతి పరవశిస్తుంది. ఉగాది అంటే మనకు వెంటనే గుర్తొచ్చేది ఉగాది పచ్చడి. తీపి, కారం, ఉప్పు, పులుపు, చేదు, వగరు...ఇలా ఆరు రుచుల మేళవింపు ఉగాది. మన జీవితంలో అన్నీ విజయాలే ఉండవనీ, అప్పుడప్పుడూ అపజయాలు కూడా ఎదురవుతుంటాయనీ, మన

జీవితంలో సుఖంతో బాటు దుఃఖం కూడా కలిసే ఉంటుందనీ తెలియజెబ్తుంది ఉగాది.

కొత్త బెల్లం, చెరకు,పచ్చిమిర్చి, ఉప్పు, కొత్త చింతపండు, వేపపవ్వు, కొబ్బరికాయ, కొత్తమామిడి, అరటిపండు...ఇలా విభిన్న రుచుల మేళవింపును మనకందించే ఉగాది పచ్చడి సర్వమత సమ్మేళనాన్ని, ప్రజల సహజీవనాన్ని, ప్రజలజీవితంలో అంతర్భాగమైన సుఖదుఃఖాల తీరు తెన్నులను తెలియజెబ్తుంది.

ఉగాది పర్వదినాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఉగాది అనీ, కర్నాటకలో యుగాది అనీ, మహారాష్ట్రలో గుడిపడవగా వ్యవహరిస్తారు.

ఉగాది రోజున తలారా స్నానం చేసి, షడ్రుచుల మేళవింపైన ఉగాది పచ్చడిని ఆరగించి, పంచాంగ శ్రవణం చెయ్యడం ఒక ఆచారం. ఇక ఇల్లంతా సందడే సందడి... కొత్తబట్టలు, కొత్తమామిడి, కొత్త ఆవకాయ, కొత్త మల్లెపూలు, కొత్త చెరకు, కొత్త చింతపండు, కొత్త పంచాంగం, కొత్త ఆశలూ, కొంగ్రొత్త ఆకాంక్షలూ... ఇలా అన్నీ ఇక కొత్తగానే...!!

చైత్రమాస ఉగాది

జారిపోయిన విలువలు
కృంగిపోయిన మనసులు
కూలిపోయిన ఆశల ముందు
ఎలా...నిలబడి...గెలవాలో
ప్రకృతి నేర్పిస్తుంది...
వైపరీత్యాల తర్వాత
మెల్లమెల్లగా సర్దుకోవడంలా!
ప్రకృతి నేర్పిస్తుంది
సద్దుమణుగుతూ తేరుకోవడంలా !
ప్రకృతి నేర్పిస్తుంది
జీవించడం అంటే
ప్రయాణించడమని....
జీవించడం అంటే
ఎదురీదడమని....
జీవించడం అంటే
పోరాడటమని....
ప్రకృతి నేర్పిస్తుంది
దేనికి ఇది ఆఖరు కాదని
ఆరంభమని...
ఆ ప్రకృతి ... చైత్రమాసాన
యుగాదిగా

డా॥ బాలాజీ దీక్షితులు పి.వి
8885391722

కళ తప్పిన ఉగాది

ఉగాది పండుగ వచ్చింది అంటే
ఊరంతా పండుగలా ఉంటుంది అనుకున్నా
సంతోషం లేదు సంబరాలు లేవు
తడిమి చూస్తే తెలుగు వాడి గుండె
తరుక్కుపోతుంది.
ప్రతి ఉగాది వస్తూనే ఉంది పోతూనే ఉంది
ప్రత్యేక హెూదా మాత్రం తేలేదంటున్నాడు
రాలేదంటున్నాడు
దగా పడ్డ తెలుగోడు
దిగాలుగా చూస్తున్నాడు.
మూడు రాజధానుల సినిమా చూస్తూ
ఒక్క రాజధానీ లేక ఉసూరు మంటున్నాడు.
దగాపడ్డ తెలుగోడు దిగాలుగా చూస్తున్నాడు.
విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్నది
విశాఖ ఉక్కు ఆదాని హక్కు అయినదేంటా అని
దగా పడ్డ తెలుగోడు
దిగాలుగా చూస్తున్నాడు
ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్యాకేజీ లేదు గాని
ఉన్నదంతా ఊడ్చి వేస్తున్నారేంటని
దగాపడ్డ తెలుగోడు దిగాలుగా చూస్తున్నాడు.
మోటార్లకు మీటర్లు బిగించి రైతుల మెడలకు ఉరితాడు బిగిస్తుంటే
రాజన్న మాటకు బూజు పట్టింది ఏమిటాయని
దగాపడ్డ తెలుగోడు దిగాలుగా చూస్తున్నాడు
ప్రగతీ పరిశ్రమలు లేకుండానే
ప్రభుత్వ పదవీకాలం అయిపోతుంది ఏంటాయని
దగాపడ్డ తెలుగోడు దిగాలుగా చూస్తున్నాడు
చింతలపూడి ఎత్తిపోతల పథకం
చింతలు తీరుస్తుందనుకుంటే
చింతాక్రాంతులను చేసిందేంటాయని
దగాపడ్డ తెలుగోడు దిగాలుగా చూస్తున్నాడు
రక్తం చిందిస్తున్న రహదారులలో
రాలిపోయిన తన వారిని చూసి
దగాపడ్డ తెలుగోడు దిగాలుగా చూస్తున్నాడు.
ఉగాదులు గాదులను నింపవురా
జీవితాన్ని మార్చవురా.
ఉగ్రుడవై నువ్వు లేవరా
ఉద్యమాలు మన ఊపిరి రా
పోరాటం మన హక్కు రా
దాని నాపటం ప్రభుత్వం తప్పురా.
అదే దానికి ముప్పురా.
దిగులుమాని లేవరా.
దివిటీలా వెలగరా.

పుల్లూరి సోమశేఖరాచార్యులు.
సిపిఐ ఏలూరు జిల్లా సమితి సభ్యులు.యర్రగుంటపల్లి.
చింతలపూడి మండలం, ఏలూరు జిల్లా.సెల్:7989687771.